సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 306

శనివారం 27-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | RAJAMAHENDRAVARAM | NIZAMABAD | ONGOLE | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'



రేపే ఎన్డీఏలోకి నితీశ్?

బీజేపీ మద్దతుతో మళ్లీ సీఎంగా ప్రమాణం! -6లో



తొలి టెస్టు మన చేతుల్లోకి..

భారత్ ప్రస్తుత ఆధిక్యం 175 పరుగులు. రాహుల్, జడేజా అర్ధ సెంచరీలు -13లో



నారీశక్తి విశ్వరూపం

ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు

- తొలిసారి మహిళలతో త్రివిధ దళాల కవాతు
- శకటాల నుంచి విన్యాసాల దాకా నారీభేరి
- సాయుధ పాటవానికీ అద్దం పట్టిన వేడుకలు
- రంగుల తలపాగాతో ఆకట్టుకున్న ప్రధాని మోదీ

6లో


ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలసి గుర్రపు బగ్గీలో వేడుకలకు హాజరు

75వ రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో త్రివిధ దళాలకు చెందిన మహిళా సేనల (వైద్య సేవల సాయుధ విభాగం, తీర గస్తీ దళం, బాంబే ఇంజనీర్ గ్రూప్, ఢిల్లీ పోలీసు, త్రివిధ సేవల దళం) కవాతు.

భక్త రామదాసు విగ్రహం

ఇదిగో!



కొత్త తెలంగాణ చరిత్ర బృందం ప్రకటన... 14లో ఖమ్మం జిల్లాలో లభ్యం

పెండింగ్ బిల్లులైనా ఇవ్వండి... పదవుల్లోనైనా ఉంచండి...

నిధులైనా... విధులైనా...

రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలో సర్పంచ్‌లు

- ప్రత్యేకాధికారుల పాలనంటే ప్రజాస్వామ్యానికి విలువే లేదు
- మేం రాజకీయ పార్టీల గుర్తులతో ఎన్నికైన వాళ్లం కాదు
- సొంత నిధులతో పంచాయతీ భవనాలు, శ్మశానవాటికలు, క్రీడా మైదానాలు నిర్మించాం... ఉపాధి హామీ, ప్రత్యేక అభివృద్ధి నిధి, రాష్ట్ర ఆర్థిక సంస్థ పరిధిలోని పనులు చేపట్టాం
- ఇందుకోసం అప్పులు చేసి మరీ నిధులు సమకూర్చుకున్నాం
- పెండింగ్ బిల్లులు రాకుంటే సమస్యల్లో మునుగుతామని ఆవేదన
- పదవీకాలం పొడిగిస్తే నిధుల రాకపై భరోసా ఉంటుందని విజ్ఞప్తి
- వచ్చే నెల 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన అంటూ అధికారులు హడావుడి చేస్తున్నారని ఆందోళన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల్లో ప్రథమ పౌరులు గందరగోళంలో పడ్డారు. వారం రోజుల్లో పదవీకాలం ముగియనుండటం.. గతంలో సొంత నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇంకా రాకపోవడంపై సర్పంచులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పెండింగ్ బిల్లులకు సంబంధించి నిధులైనా ఇవ్వాలని.. లేకుంటే మరో ఆరు నెలలపాటు పదవీకాలమైనా పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన అంటే ప్రజాస్వామ్యానికి విలువే ఉండదని స్పష్టం చేస్తున్నారు. అప్పులు చేసి మరీ గ్రామాల్లో పనులు చేయించామని.. పెండింగ్ బిల్లులు రాకపోతే సమస్యల్లో మునిగిపోతామని వాపోతున్నారు.

ఊర్లలో పనులు చేయించి..

రాష్ట్రంలో 12,752 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పార్టీ రహితంగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆ గ్రామాలకు సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. అందులో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల సానుభూతిపరులు కూడా ఉన్నారు. గత ఐదేళ్లుగా పంచాయతీలకు నిధులు, ఇతర పనుల విషయంలో ఇబ్బందులు ఉన్నా గ్రామాల అభివృద్ధి కోసం కృషిచేశారు. గ్రామంలో అభివృద్ధి పనులతోపాటు వివిధ పథకాల కింద మంజూరైన ప్రాజెక్టుల

మిగతా 10వ పేజీలో ▶

'గ్యారంటీ'గా ముందుకెళ్తున్నాం!

100 రోజుల్లో హామీలు అమలు చేసి ప్రజల ముఖాల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యం

గత పదేళ్లలో విధ్వంసమైన రాజ్యాంగ విలువలు, వ్యవస్థలను పునర్నిర్మించుకుంటున్నాం

గణతంత్ర దిన ప్రసంగంలో గవర్నర్ తమిళిసై

హాజరైన సీఎం రేవంత్, మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొలువుదీరిన క్షణం నుంచీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యాచరణ మొదలైందని.. ఆరు గ్యారంటీల్లో రెండు ఇప్పటికే అమల్లోకి వచ్చాయని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. మిగతా గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేసి ప్రజల ముఖాల్లో ఆనందం చూడాలన్నదే మిగతా 2వ పేజీలో ▶

ఇది ద్వంద్వ నీతి కాదా?

గవర్నర్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్ 2లో

విభజన హామీలపై నిలదీయండి

పార్టీ ఎంపీలకు కేసీఆర్ ఆదేశం



- కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతపై గళం విప్పండి... కేంద్రం కుయుక్తుల్ని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి
- తెలంగాణ హక్కుల కోసం పోరాడేది బీఆర్‌ఎస్ ఒక్కటేనన్న అధినేత
- పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం

- వివరాలు 3లో

క్లుప్తంగా...

రేవంత్ పాలన కేసీఆర్ అడుగుజాడల్లోనే

రిపబ్లిక్ డే వేడుకల్లో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యాభైరోజుల రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలన మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తున్నట్లు కన్పిస్తోందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె. లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. గత సర్కార్ తరహా లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని విమ ర్శించారు. శుక్రవారం రిపబ్లిక్ డేను పురస్కరించుకుని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

స్పీకర్, తమ్మినేనికి సీఎం పరామర్శ

సాక్షి, హైదరాబాద్: అనారోగ్యంతో చికిత్స పొంది తిరిగి కోలుకుంటున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను కూడా సీఎం రేవంత్ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డితో కలిసి పరామర్శించారు.

అవకాశవాద రాజకీయాలు

వంశీచంద్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: అవకాశవాద రాజకీయాలకు మాజీ మంత్రి డీకే అరుణ మారుపేరని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వంశీచంద్ రెడ్డి విమర్శించారు. విలువలు, విధానాలు లేని వ్యక్తి డీకే అరుణ అని, అసదుద్దీన్ ఆహ్వానిస్తే ఎంఐఎంలోకి కూడా వెళ్తారని ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో శుక్రవారం వంశీ చంద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో రూ.15 కోట్లు ఇస్తే కాంగ్రెస్ నుంచి మహబూబ్ నగర్ ఎంపీగా పోటీ చేస్తానని డీకే అరుణ చెప్పారని ఆరోపించారు. ఆమె డబ్బులు అడిగినట్టు ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని, అందుకోసం 28వ తేదీ 11 గంటలకు మహబూబ్ నగర్ టీచర్స్ కాలనీలోని రామ మందిరానికి వస్తానని చెప్పారు. ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరక ముందే తాను ఏఐసీసీ సభ్యుడినని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై భూ కబ్జా కేసు

ఆధారాల్లేకుండా అక్రమంగా కేసు పెట్టారు: పల్లా

పోచారం: జనగాం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిపై భూ కబ్జా కేసు నమోదైంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ముచ్చెర్ల రాధిక ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మేడిపల్లి మండలం, బుద్ధానగర్‌కు చెందిన రాధికకు ఘట్‌కేసర్ మండలం, చౌదరిగూడలోని సర్వే నంబర్ 796లో 150 చదరపు గజాల జాగా ఉంది. ఈ జాగాను కబ్జా చేసేందుకు గాయత్రీ ఎడ్యుకేషన్‌కు చెందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అతని భార్య నీలిమ, ఇంకొకరు మధుకర్‌రెడ్డి ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తన ప్లాట్ చుట్టూ ఉన్న హద్దురాళ్లను తొలగించారని, తహసీల్దారు కార్యాలయంలో నకిలీ పత్రాలు సృష్టించి లేఅవుట్‌ను మార్చారని చెప్పారు. దీంతో ఈ ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. డాక్యుమెంట్లు పరిశీలించి, ప్లాటుకు పంచనామా చేస్తామని సీఐ బి.రాజు తెలిపారు. దీనిపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తనపై, తన భార్యపై కేసు బనాయించారని వాపోయారు. తాము ఎవరి భూములను ఆక్రమించలేదని, ఎవరినీ బెదిరించలేదని చెప్పారు. నిజంగా భూమికి సంబంధించిన సమస్య అయితే సివి ల్ కోర్టుకు ఎందుకు వెళ్లలేదని పల్లా ప్రశ్నించారు. ఎవరు ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, చట్టంపై విశ్వాసం, న్యాయంపై నమ్మకంతో పోరాడతామన్నారు.

ఇదం జగత్



కూటమి వీడుతున్న వారందరికీ ప్రధాని పదవిని ఆఫర్ చేయలేం కదా!

రాజ్‌భవన్‌లో ఎట్‌హోమ్‌కు సీఎం రేవంత్





ఎట్‌హోం కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. పద్మ పురస్కార విజేతలు కేతావత్ సోమ్‌లాల్, ఆనందచారి, గడ్డం సమ్మయ్యలతో గవర్నర్

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో తేనీటి విందు ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ, బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు దూరంగా ఉన్నారు. గవర్నర్ తమిళిసై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలివిడిగా మాట్లాడారు. హైకోర్టు సీజే అలోక్ అరాధే, సీఎస్ శాంతికుమారి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఏఐసీసీ నేత రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు గోరెటి వెంకన్న, బండ ప్రకాశ్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. పద్మ పురస్కార గ్రహీతలకు గవర్నర్, సీఎం శుభాకాంక్షలు తెలిపారు. చిందు, యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య తేనీటి విందుకు హాజరుకాగా, జ్ఞాపిక అందజేసి గవర్నర్ అభినందించారు. కాగా, త్వరలో ఏపీ పర్యటనకు వెళుతున్నట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. దేవాదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన అంశాలపై ఏపీతో చర్చిస్తామన్నారు.

'గ్యారంటీ'గా ముందుకెళ్తున్నాం!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత పాలకుల నిర్వాకంతో చిన్నాభిన్నమైన ఆర్థిక పరిస్థితి, వ్యవస్థలను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నామని వ్యాఖ్యానించారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వివరాలు ఆమె మాటల్లోనే..



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న గవర్నర్ తమిళిసై, చిత్రంలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా

''పాలకులు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించినప్పుడు.. పోరాటాలు, తీర్పుల ద్వారా అధికారాన్ని నియంత్రించే శక్తిని ప్రజలకు రాజ్యాంగం ఇచ్చింది. ఆ రాజ్యాంగ స్ఫూర్తి, హక్కులతోనే తెలంగాణ సాధించుకున్నాం. తెలంగాణలో పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగినప్పుడు, దీనికి చరమగీతం పాడే అవకాశాన్ని కూడా రాజ్యాంగం ఇచ్చింది. గత 10 ఏళ్లలో పాలకులు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, నియంతృత్వ ధోరణితో వ్యవహరించడాన్ని సహించని తెలంగాణ సమాజం .. ఇటీవలి ఎన్నికల్లో తమ తీర్పు ద్వారా ఆ ధోరణికి చరమగీతం పాడింది. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది.

వ్యవస్థలను పునర్నిర్మించుకుంటున్నాం

గత పదేళ్లలో విధ్వంసమైన రాజ్యాంగ విలువలు, రాజ్యాంగబద్ధ సంస్థలు, వ్యవస్థలను ఇప్పుడిప్పుడే పునర్నిర్మించుకుంటున్నాం. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో రాజ్యాంగబద్ధమైన విలువలు, విధానాలు, పద్ధతులను పునరుద్ధరణ చేసుకుంటున్నాం. సమాజంలోని అన్నివర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది.

ప్రజాపాలనలో 1.25 కోట్ల దరఖాస్తులు

ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు అందించడం ప్రభుత్వ బాధ్యత. డిసెంబర్ 28 నుండి జనవరి 6 వరకు ప్రజల నుంచి పథకాల అమలు కోసం 1,25,84,383 దరఖాస్తులను స్వీకరించగా.. అందులో ఐదు గ్యారంటీల కోసం దరఖాస్తులు 1,05,91,636, ఇతర దరఖాస్తులు 19,92,747 వచ్చాయి. వీటిని శాఖలవారీగా క్రోడీకరించి, కంప్యూటరీకరించి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాం.

యువతలో అపోహలు వద్దు

గత పదేళ్లు యువతకు ఉపాధి, ఉద్యోగాల విషయంలో పూర్తి నిర్లక్ష్యం జరిగింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వం ఈ విషయంలో గట్టి దృష్టి పెట్టింది. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన ప్రక్రియ పూర్తికాగానే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియ మొదలవుతుంది. యువత ఎలాంటి అనుమానాలు, అపోహలకు లోను కావాల్సిన అవసరం లేదు. గతంలో ఎన్నడూ లేనివిధంగా దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికలో రూ.40,232 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకోవడం రాష్ట్ర పురోగమనానికి సంకేతం. ముఖ్యమంత్రి, వారి బృందాన్ని అభినందిస్తున్నాను.

> **రూ.2లక్షల రుణమాఫీకి చర్యలు**
>
> రైతులకు మా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని హామీ ఇస్తున్నాం. వరంగల్ డిక్లరేషన్ అమలుకు కార్యాచరణతోపాటు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతు భరోసా పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయడానికి కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే చిన్న, సన్నకారు రైతుల ఖాతాలలో రైతు భరోసా నిధులు జమచేశాం. రూ.2 లక్షల రుణమాఫీ కోసం బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయి.

సామాన్యులు సైతం సీఎంను కలవచ్చు

గత ప్రభుత్వం సామాన్యులకు అందుబాటులో లేదు. ఇప్పుడు ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాలు ప్రభుత్వం ప్రజాసమస్యలను వింటోంది. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

రాష్ట్రంలో తొలిసారిగా ప్రజాస్వామ్య పాలన

తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన, ప్రజల హక్కులను, స్వేచ్ఛను గౌరవించే పాలన మొదలైంది. అంబేడ్కర్ స్ఫూర్తితో పేద, బడుగు, బలహీన వర్గాలు, గిరిజనులు, మైనారిటీల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజాపాలన అడుగులు వేస్తోంది. ఇదే స్ఫూర్తితో ఇక ముందు కూడా పాలన సాగాలని, అభివృద్ధిలో తెలంగాణ అత్యున్నత శిఖరాలకు చేరాలని, సంక్షేమంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని కోరుకుంటున్నాను..'' అని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ మాటలు గవర్నర్‌కు తగవు

- పదేళ్లు పాలించిన ప్రభుత్వాన్ని నియంతృత్వమని ఎలా అంటారు?
- బీజేపీ కార్యకర్తలా వ్యవహరించే తమిళి సై ఇప్పుడు కాంగ్రెస్‌కు సహకరించడం ఆశ్చర్యకరం
- మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు
- కోదండరాంను ఎలా నామినేట్ చేస్తారని నిలదీత?



మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్యంగా ఎన్నికై పదేళ్లపాటు పనిచేసిన ప్రభుత్వాన్ని నియంతృత్వమని, ప్రజాస్వామ్య విలువలు లేవని చెప్పడం గవర్నర్ స్థాయికి తగదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారకరామారావు మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ ఫెవికాల్ బంధానికి ఇది నిదర్శనమన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేటీఆర్ తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణ కోసం కొట్లాడిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను ఎమ్మెల్సీలుగా గవర్నర్ కోటాలో నామినేట్ చేస్తూ డిసెంబర్ 3వ తేదీ ముందు అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే గవర్నర్ రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి.. ఈ ఇద్దరు రాజకీయ సంస్థలతో సంబంధం కలిగి ఉన్నారనే సాకు చూపుతూ అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. కానీ ప్రస్తుతం ఓ రాజకీయ పార్టీ అధ్యక్షుడుగా ఉన్న కోదండరాంను కాంగ్రెస్ అదే గవర్నర్ కోటాలో ప్రతిపాదిస్తే గవర్నర్ ఎలా ఆమోదించారు? గవర్నర్ పక్షపాత వైఖరిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అమిత్ షా ఆదేశాల మీద వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేశారు. దీంతో మాకు రావాల్సిన ఒక ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు కాంగ్రెస్‌కి వెళ్లింది. తెలంగాణలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు బీజేపీ కంకణం కట్టుకుని.. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణలో క్విడ్ ప్రోకో రాజకీయాలకు పాల్పడుతున్నాయి. ఓవైపు రాహుల్ గాంధీ ఆదానీని విమర్శిస్తే రేవంత్ మరోవైపు అతనితో ఒప్పందాలు చేసుకుంటున్నారు. గవర్నర్ గతంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలుగా పనిచేసి ఇప్పుడు కూడా బీజేపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారు. కానీ ఆమె కాంగ్రెస్‌కు మద్దతు పలకడమే ఆశ్చర్యకరం'' అని కేటీఆర్ విమర్శించారు.

సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించాలి

గ్రామ పంచాయతీల పాలన ప్రత్యేక ఇన్‌చార్జిలకు అప్పగించకుండా సర్పంచ్‌ల పదవీ కాలం పొడిగించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కరోనా మూలంగా రెండేళ్ల పాటు సర్పంచ్‌లు పరిపాలన సాగించలేక పోయారని, ఈ నేపథ్యంలో వారి పదవీ కాలాన్ని కనీసం ఆరు నెలల నుంచి ఏడాది పాటు లేదా తిరిగి ఎన్నిక నిర్వహించేంత వరకు పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, తెలంగాణ భవన్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన హోం శాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. అక్కడే ఉన్న కేటీఆర్ చొరవతో సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తిరిగి కోలుకున్న మహమూద్ అలీ తాను క్షేమంగా ఉన్నట్లు ఓ ప్రకటన విడుదల చేశారు.

గవర్నర్ వ్యవస్థను అవమానించిన చరిత్ర బీఆర్‌ఎస్‌దే

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి



కరీంనగర్ టౌన్: బీఆర్‌ఎస్‌ను ప్రజలు రద్దు చేశారని, గవర్నర్ వ్యవస్థను అవమానపర్చిన మూర్ఖత్వపు పార్టీ బీఆర్‌ఎస్ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విరుచుకుపడ్డారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. ఒక మహిళా గవర్నర్‌ను అసెంబ్లీలో మాట్లాడనీయకుండా అవమానించారని, గవర్నర్ పర్యటనకు ప్రొటోకాల్ పాటించలేదని మండిపడ్డారు. గవర్నర్ అంటే రబ్బర్ స్టాంపులా ఉండాలనుకున్నారని పేర్కొన్నారు. ప్రపంచంలో అనేక దేశాలు తమ తమ రాజ్యాంగాలను మార్చుకున్నాయని, భారత్ మాత్రం రాజ్యాంగాన్ని 105 సార్లు సవరించినా మౌలిక స్వరూపాన్ని మాత్రం మార్చలేదని సంజయ్ గుర్తుచేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ది మూడో స్థానమేనని, ఇంకా గూండాగిరి చేస్తాం.. ఇష్టమొచ్చినట్లు మాట్లాడతామంటే ప్రజలు బీఆర్‌ఎస్ నేతలపై తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు.

పూలే విగ్రహ ఏర్పాటుకు మహాధర్నా

జాగృతి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ప్రతిష్ఠించాలన్న డిమాండ్‌తో త్వరలో మహాధర్నా చేపడతామని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం కోసం జాగృతిలో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పలు రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు, రచయితలు, ప్రొఫెసర్లు హాజరై ఎమ్మెల్సీ కవితకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు కోసం చేస్తున్న పోరాటానికి మద్దతుగా రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి లేఖలు రాయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి జిల్లాలో, యూనివర్సిటీల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నుంచి వి.ప్రకాశ్, గట్టు రామచంద్రరావు, ఆంజనేయగౌడ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, సీపీఐ(ఎంఎల్) నేత సుభాష్, రచయిత సంగిశెట్టి శ్రీనివాస్, పద్మశాలి సంఘం నేత శివశంకర్, ప్రొఫెసర్ తాటికొండ రాజయ్య, ఓయూ జేఏసీ నేత రాజారాం యాదవ్, సంచార జాతుల సంఘం నుంచి కోలా శ్రీనివాస్, సీపీఐ నేత బాలమల్లేశ్, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, వడ్డెర సంఘం నేత మురళి, బీఎస్పీ నేత అనిత రెడ్డి, ఓబీసీ అధ్యయన కన్వీనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇది ద్వంద్వ నీతి కాదా?

గవర్నర్‌పై మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజం

- ఎమ్మెల్సీలుగా బీఆర్‌ఎస్ సిఫారసులు నిరాకరించి, కాంగ్రెస్‌వి ఆమోదిస్తారా? అంటూ నిలదీత
- ఏకంగా ఓ రాజకీయ పార్టీ అధ్యక్షుడి అభ్యర్థిత్వానికే ఆమోదం తెలిపారంటూ విమర్శ



సాక్షి, హైదరాబాద్/గజ్వేల్: రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్నారనే కారణంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిఫారసు చేసిన అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా నియమించడానికి నిరాకరించిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేస్తే, ఏకంగా ఓ రాజకీయ పార్టీ అధ్యక్షుడినే ఎమ్మెల్సీగా ఆమోదించారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 'ఇది ద్వంద్వ నీతి కాదా? గవర్నర్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించినట్టు కాదా?' అని శుక్రవారం 'ఎక్స్'లో నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీల రహస్య మైత్రి మరోసారి బయటపడిందని అన్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంలో రెండు పార్టీల మధ్య ఉన్న అవగాహన బట్టబయలైందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై బీఆర్‌ఎస్‌ను అణగదొక్కాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ కుట్రలో గవర్నర్ స్వయంగా భాగస్వామి కావడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. గతంలో కూడా క్రీడా, సాంస్కృతిక, విద్య, సామాజిక, సేవా రంగాల్లో కృషి చేసిన వారిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా సిఫారసు చేసిందని, అప్పుడు కూడా గవర్నర్ రాజకీయ కారణాలతో వాటిని ఆమోదించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ సూత్రాలు, రాజ్యాంగ సంప్రదాయాలు అన్ని పార్టీల విషయంలో ఒకే రకంగా ఉండాలని, కానీ గవర్నర్ బీఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్‌కు తేడా చూపిస్తున్నారని విమర్శించారు.

ప్రాజెక్టుల అప్పగింత గొడ్డలిపెట్టు లాంటిదే..

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ)కు సాగునీటి ప్రాజెక్టులను అప్పగించాలనే నిర్ణయం తెలంగాణకు గొడ్డలిపెట్టు లాంటిదని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, హైదరాబాద్ జిల్లాలకు తాగు, సాగునీరు, విద్యుత్ అవసరాలకు ఆటంకం కలుగుతుందని చెప్పారు. జల విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్ర ప్రభుత్వానికి స్వేచ్ఛ ఉండదని అన్నారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన బీఆర్‌ఎస్‌పీపీ సమావేశం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. తెలంగాణ నీటి వాటా తేల్చేవరకు, ఇతర మార్గదర్శకాలపై స్పష్టత ఇవ్వకుండా ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం.. ఢిల్లీలో సంతకాలు పెట్టిందంటూ కేంద్రం మినిట్స్ విడుదల చేయగా, రాష్ట్ర మంత్రులు మేం సంతకాలు పెట్టలేదని మాట్లాడటం శోచనీయమని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని విమర్శించారు. దీనిపై కేంద్ర జలవనరుల శాఖామంత్రిని తమ పార్టీ పార్లమెంటరీ బృందం కలిసి వినతిపత్రం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్‌పై బురద చల్లడం మానుకొని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఆదిలాబాద్‌కు వచ్చినప్పుడు సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను పునరుద్ధరిస్తామని మాట ఇచ్చిన బీజేపీ అగ్రనేత అమిత్‌షా తన మాటను నిలబెట్టుకోవాలని, బీసీ గణన చేపట్టాలని ఈ సందర్భంగా హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

వైభవంగా గంధం ఊరేగింపు



గంధం కలశం తలపై పెట్టుకుని తీసుకొస్తున్న మంత్రి ఉత్తమ్

పాలకవీడు(హుజూర్‌నగర్): సూర్యాపేట జిల్లా జాన్‌పహాడ్ దర్గా ఉర్సులో భాగంగా శుక్రవారం గంధం ఊరేగింపు వైభవంగా జరిగింది. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన గంధాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దర్గా ముజావర్ జానీ నివాసం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చారు. గంధోత్సవానికి లక్షన్నరకు పైగా భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డె పాల్గొన్నారు.

14 ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటాం

త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటుందని రాష్ట్ర భారీనీటిపారుదలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఉర్సులో పాల్గొన అనంతరం మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి తన హయాంలో జరిగిందే తప్ప, బీఆర్‌ఎస్ పాలనలో జరిగింది శూన్యమన్నారు.

ప్రజాపాలన భేష్: జానారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ఒరవడితో ముందుకెళ్తోందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కె.జానారెడ్డి వ్యాఖ్యానించారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ, మేధావులు, ప్రజాసంఘాల, పార్టీల సలహాలు, సూచనలతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం గత పరిస్థితులను వివరిస్తూ, సమస్యలు అధిగమించే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నం బాగుందని కితాబిచ్చారు. ఈ ప్రజా పాలనలో తనవంతు పాత్ర నిర్వర్తిస్తానని చెప్పారు. గతంలో తాను నాయకత్వం వహించినప్పటికీ, ఇప్పుడు పార్టీ కార్యకర్తగా పనిచేస్తానని స్పష్టం చేశారు. తన అనుభవాలు, సలహాలను ప్రభుత్వానికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తాను పదేళ్ల కింద చెప్పిన మాటలు నిజమయ్యాయని పేర్కొన్నారు. అప్పులు, విద్యుత్ కొనుగోళ్లు భవిష్యత్‌కు ప్రమాదమని తాను చెప్పింది నిజమైందని గుర్తు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచేలా.. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కాంగ్రెస్ కార్యకర్తలను జానారెడ్డి కోరారు.

కోదండరాంను మీరు అవమానిస్తే మేం గౌరవించాం: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో కోదండరాం భీష్ముడి పాత్ర పోషించారని, ఆయన నేతృత్వంలోనే ప్రజాపోరాటం సాగిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఉద్యమం సమయంలో దేవుడిగా చూసిన కోదండరాంకు బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా అవమానించారని విమర్శించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోదండరాంను బీఆర్‌ఎస్ అవమానిస్తే కాంగ్రెస్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించిందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు హద్దూ అదుపు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తొమ్మిదేళ్లలో కోదండరాం గురించి నోరు మెదపని కేటీఆర్ ఇప్పుడు తాము ఎమ్మెల్సీని చేస్తే రాద్ధాంతం చేస్తున్నారన్నారు. విలువ లేకుండా రాజకీయాలు చేస్తుంది కేటీఆర్ అని, అయ్యా.. కొడుకు ఏం మాట్లాడతారో అర్థం కావడం లేదని ధ్వజమెత్తారు. సంగారెడ్డిలో ఎన్నికల చివరి రోజు హరీశ్‌రావు రూ.25 కోట్లు ఖర్చు చేశాడని ఆరోపించారు. హరీశ్ దగ్గర కాళేశ్వరం డబ్బులు ఉన్నాయని, తక్కువలో తక్కువ రూ.4 వేల కోట్లు జమ చేశారని జగ్గారెడ్డి చెప్పారు.

జీవో 55ను వెంటనే రద్దు చేయాలి

మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దిల్‌సుఖ్‌నగర్ (హైదరాబాద్): అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మాణం కోసం జారీ చేసిన జీవో 55ను వెంటనే రద్దు చేయాలని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం నిరసన చేస్తున్న సమయంలో పోలీసుల దాడిలో గాయపడి కొత్తపేట ఓజోన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని శుక్రవారం రఘునందన్‌రావు స్థానిక కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలసి పరామర్శించారు. వర్సిటీ భూములను హైకోర్టుకు ఇచ్చేందుకు వీసీలు ఎలా సంతకం చేశారని రఘునందన్‌రావు ప్రశ్నించారు. కొత్త హైకోర్టు ఏర్పాటుకు బీజేపీ వ్యతిరేకం కాదని, అయితే దాన్ని మరో చోటు ఏర్పాటు చేయాలని రఘునందన్‌రావు కోరారు. విద్యార్థులపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులను సస్పెండ్ చేయాలని డీజీపీని కోరారు.



ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు తదితరులు

క్లుప్తంగా...

బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి శుక్రవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అలాగే నూతనంగా నియమితులైన సభ్యులు అనితా రాజేంద్ర, ప్రొఫెసర్‌ ఎస్‌.యాదయ్య, పాల్వాయి రజినీ కుమారి కూడా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్‌ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఎట్‌ హోం కార్యక్రమంలో భాగంగా రాజ్‌భవన్‌కు వెళ్లిన మహేందర్‌రెడ్డి.. గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కోహెడ మార్కెట్‌కు మరో 100 ఎకరాలు

వ్యవసాయ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్‌: కోహెడ మార్కెట్‌ భవిష్యత్‌ అవసరాలకు తగ్గట్లుగా ఉండాలని, జాతీయ, అంతర్జాతీయ పండ్లు, కూరగాయల మార్కెట్లను దృష్టిలో పెట్టుకుంటే ఈ మార్కెట్‌కు ప్రస్తుతం ఉన్న స్థలం సరిపోదని, అదనంగా 50 నుంచి 100 ఎకరాల స్థలం సేకరించే విధంగా ప్రణాళికలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కోహెడ పండ్ల మార్కెట్‌ అభివృద్ధిపై మార్కెటింగ్‌, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెట్‌ లే ఔట్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోహెడ మార్కెట్‌ను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఫేజ్‌–1 పనులను ఈ ఏడాదిలో పూర్తి చేయాలని సూచించారు.



నకిలీ డాక్టర్లకు చెక్‌..

అర్హతలేని ప్రాక్టీస్‌పై ఉక్కుపాదం.. రాష్ట్ర వైద్య మండలి నిర్ణయం.. కఠిన చర్యలకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్‌: అర్హత లేకున్నా వైద్యులుగా ప్రాక్టీస్‌ చేస్తున్న వారిపై, అక్రమంగా ఆసుపత్రులు నడుపుతున్నవారిపైనా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి (టీఎస్‌ఎంసీ) ఉక్కుపాదం మోపుతోంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌, ఖైరతాబాద్‌లో అర్హత లేకున్నా ప్రాక్టీస్‌ చేస్తున్న రెండు ఆసుపత్రులకు ఇటీవలే ఎన్నికైన కొత్త మండలి నోటీసులు జారీ చేసింది. సదరు ఆసుపత్రుల్లో యాంటీబయాటిక్స్‌, స్టెరాయిడ్స్‌ వంటి షెడ్యూల్డ్‌ డ్రగ్స్‌ను గుర్తించి ఈ మేరకు వాటిపై కేసులు నమోదు చేసింది. ఇంకా అనేక చోట్ల నకిలీ వైద్యుల దందాపై దాడులకు శ్రీకారం చుట్టింది. డాక్టర్లుగా చెప్పుకునే ఆర్‌ఎంపీలపై క్రిమినల్‌ కేసులు పెడతామని మండలి హెచ్చరించింది. పేరుకు ముందు 'డాక్టర్‌' హోదా పెట్టుకున్నా, ఆసుపత్రి అని రాసి ఉన్న బోర్డులు ప్రదర్శించినా, రోగులకు ప్రిస్క్రిప్షన్‌ రాసినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది.

ఆర్‌ఎంపీల ముసుగులో

రాష్ట్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు 30 వేల మంది వరకు ఉన్నారని ఓ అంచనా. ప్రతీ గ్రామంలో వారు ప్రాక్టీస్‌ చేస్తుంటారు. అయితే కొంతమంది నకిలీ సర్టిఫికెట్లతో ఆర్‌ఎంపీలు, పీఎంపీల ముసుగులో డాక్టర్లుగా చెలామణీ అవుతూ.. ఇష్టారాజ్యంగా అబార్షన్లు చేయడం, అత్యధిక మోతాదులో ఉన్న యాంటీబయాటిక్స్‌ ఇవ్వడం, చిన్న రోగాలకు కూడా అధికంగా మందులు రాస్తున్నారని మండలి గుర్తించింది. ఇటీవల నగరంలోని మలక్‌పేట్‌ ప్రాంతంలో నకిలీ రిజిస్ట్రేషన్‌ నంబర్‌ను కలిగి ఉన్న ఒక అర్హతలేని ప్రాక్టీషనర్‌ ప్రిస్క్రిప్షన్‌ను పరిశీలిస్తే, శిశువుకు యాంటీబయాటిక్‌ ఇంజెక్షన్‌ మెరోపెనెమ్‌ రాయడం చూసి అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. సహజంగా శిశువులకు ఉపయోగించే యాంటీబయాటిక్స్‌, స్టెరాయిడ్లు పెద్దలకు ఉపయోగించేవి కాకుండా ప్రత్యేకంగా ఉంటాయి. పెద్దలకు వాడే ఇంజెక్షన్లు శిశువుకు ప్రాణాంతకంగా మారతాయి. మలక్‌పేటలోని ఆ నకిలీ డాక్టర్‌ మాదిరిగానే చాలామంది నకిలీ డాక్టర్లు మానసిక ఔషధాల ప్రిస్క్రిప్షన్‌లోనూ ఇష్టారాజ్యంగా మందులు రాస్తున్నారని తేలింది. ఈ నేపథ్యంలో నకిలీ డిగ్రీని ప్రదర్శించడం, అర్హత లేకున్నా ప్రిస్క్రిప్షన్లు రాయడం వంటి దృష్టాంతాలను మండలి తీవ్రంగా తీసుకుంది. మరోవైపు అడ్డగోలుగా అల్లోపతి మందులను సూచిస్తున్న ఇద్దరు నకిలీ ఆయుష్‌ వైద్యులను గుర్తించి వారిపై ఆయుష్‌ శాఖకు లేఖ రాసింది. ఇక నకిలీ వైద్యుల ఆగడాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో డ్రగ్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ (డీసీఏ) సాయాన్ని కూడా తీసుకోవాలని మండలి నిర్ణయించింది. నకిలీ ప్రైవేట్‌ ప్రాక్టీషనర్ల ద్వారా రోగులకు మందులు అందకుండా చేయాలని నిర్ణయించింది.

విభజన హామీలపై నిలదీయండి

పార్టీ ఎంపీలకు కేసీఆర్‌ ఆదేశం

సాక్షి, హైదరాబాద్‌: వచ్చే పార్లమెంటు సమావేశాల్లో పార్టీ ఎంపీలు విభజన హామీల అమలుతో పాటు రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని భారత్‌ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు సూచించారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడే దళం బీఆర్‌ఎస్‌ ఒక్కటేనని, వారం రోజుల పాటు జరిగే సమావేశాల్లో ఎంపీలు ఆయా అంశాలపై మాట్లాడా లని చెప్పారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు తెలంగాణ ప్రాజెక్టుల అప్పగింతపై గళం విప్పాలని ఆదేశించారు. తెలంగాణ నీటి వనరులను గుప్పిట పెట్టుకునేందుకు కేంద్రం చేస్తు న్న ప్రయత్నాలు, రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వ వైఫ ల్యాలను ఎండగట్టాలని ఆదేశించారు. శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ అధ్యక్ష తన సుమారు మూడు గంటల పాటు బీఆర్‌ఎస్‌ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. పార్టీ నేతలు కె.కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు, కేటీ రామారావు, హరీశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లొద్దు

పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, చర్చించాల్సిన విధానాలపై ఎంపీలకు కేసీఆర్‌ దిశా నిర్దేశం చేశారు. నదీ జలాల కేటాయింపులు, ఉమ్మడి ఆస్తుల పంపకాలతో పాటు పెండింగులో వున్న రాష్ట్ర విభజన హామీల సాధన కోసం ఇప్పటికే ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర బీఆర్‌ఎస్‌ పార్టీదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లే సందర్భాల్లో అడ్డుకుని రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్‌ ఎంపీలపైనే ఉందని స్పష్టం చేశారు. పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు ఐదో ఇన్‌స్టాల్‌మెంట్‌ కింద రూ.450 కోట్ల విడుదల, ఎన్‌హెచ్‌ఏఐ సాయంతో ఆదిలాబాద్‌ సీసీఐ పునరుద్ధరణ, రాష్ట్రంలో ఐఐఎం, 23 నవోదయ విద్యాలయాల ఏర్పాటు గురించి ప్రస్తావించాలని కేసీఆర్‌ చెప్పారు. అలాగే పెండింగులో ఉన్న రైల్వే పనులు వేగవంతం చేసేందుకు నిధుల విడుదల, నీతి ఆయోగ్‌ సిఫారసు మేరకు మిషన్‌ కాకతీయకు రూ.5 వేల కోట్లు, మిషన్‌ భగీరథకు రూ.19,205 కోట్ల మంజూరు, బయ్యారంలో స్టీల్‌ ప్లాంటు ఏర్పాటు, జహీరాబాద్‌ నిమ్జ్‌కు నిధులు, ఎస్సీల వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల పెంపు తదితర అంశాలు లేవనెత్తాలని సూచించారు.



పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్‌ ఎంపీలు. చిత్రంలో కేటీఆర్‌, హరీశ్‌

త్వరలో అన్ని కార్యక్రమాలకు..!

ఎంపీలు పి.రాములు, బీబీ పాటిల్‌, పసునూరి దయాకర్‌, మన్నె శ్రీనివాస్‌ రెడ్డి, కేఆర్‌ సురేష్‌రెడ్డి, వెంకటేష్‌ నేతకాని, బడుగుల లింగయ్య యాదవ్‌, వద్దిరాజు రవిచంద్ర, మాలోత్‌ కవిత, పార్థసారథి రెడ్డి, జోగినపల్లి సంతోష్‌ కుమార్‌, దేవకొండ దామోదర్‌ రావు, గడ్డం రంజిత్‌ రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. తుంటి ఎముక చికిత్స అనంతరం కోలుకుంటూ తొలిసారిగా పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న కేసీఆర్‌, మునుపటి తరహాలో చురుగ్గా ఉన్నారని పలువురు ఎంపీలు తెలిపారు. త్వరలో పార్టీ పరంగా జరిగే అన్ని కార్యక్రమాలకు తాను స్వయంగా హాజరవుతానని కేసీఆర్‌ చెప్పినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ఈ భేటీలో ఎలాంటి ప్రస్తావన రాలేదని సమాచారం.

లోక్‌సభ ఎన్నికలపై దిశా నిర్దేశం

- లోక్‌సభ ఎన్నికల దిశగా పార్టీ పరంగా జరుగు తున్న సన్నద్ధతపైనా కేసీఆర్‌ సుదీర్ఘంగా మాట్లా డారు. నియోజకవర్గాల వారీ సన్నాహక సమావే శాల్లో కేడర్‌ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌, పార్టీ పరంగా చేపట్టబోయే దిద్దుబాటు చర్యలు, కార్యక్రమాల గురించి తెలియజేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని విశ్లేషిస్తూ లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలను వివరించారు. శని వారం నుంచి తిరిగి ప్రారంభమయ్యే లోక్‌సభ ఎన్ని కల సన్నాహక సమావేశాల గురించి ప్రస్తావిస్తూ, పార్లమెంటు సమావేశాల్లో పాల్గొంటూనే ఈ భేటీ లకు ఎంపీలు హాజరుకావాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ విద్యుత్‌ ఉత్పత్తిపై దృష్టి

2030 నాటి అవసరాలకు అనుగుణంగా విద్యుత్‌ ఉత్పత్తి చేస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, రంగారెడ్డి జిల్లా, షాబాద్‌: రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ విద్యుత్‌ ఉత్పత్తికి కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌ మండలం చందనవెల్లి గ్రామంలో శుక్రవారం జున్నా సోలార్‌ పవర్‌ ప్యానెల్‌ ఉత్పత్తి ప్లాంటును ఆయన ప్రారంభించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ 2030 సంవత్సరం నాటికి డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ విద్యుత్‌ను ఉత్పత్తిని చేస్తామన్నారు. విద్యుత్‌ రంగంపై గత ప్రభుత్వం రూ.81 వేల కోట్లకుపైగా అప్పుల భారం మోపిందని ఆయన విమర్శించారు. ఈ భారాన్ని అధిగమిస్తూ, విద్యుత్‌ డిమాండ్‌ పెరిగిపోతున్న క్రమంలో ప్రత్యామ్నాయంగా విద్యుత్‌ ఉత్పత్తిని పెంచుకునే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని వెల్లడించారు. ఈ మేరకు సౌరశక్తి, పవనశక్తి, హైడెల్‌, చెత్త నుంచి తయారు చేసే కేంద్రాల ద్వారా విద్యుత్‌ ఉత్పత్తి చేసి ప్రజల అవసరాలు తీరుస్తుందని చెప్పారు.



సోలార్‌ పవర్‌ ప్యానెల్‌ ఉత్పత్తి ప్లాంటును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

చందనవెల్లి భూసేకరణలో అక్రమాలపై విచారణ

రంగారెడ్డి జిల్లా షాబాద్‌ మండలంలోని హైతాబాద్‌, చందనవెల్లి గ్రామాల్లో పరిశ్రమల కోసం చేసిన భూ సేకరణలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన భూ బాధితులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిజమైన లబ్ధిదారులకు పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు.

కోదండరామ్‌కు శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్‌: ప్రొఫెసర్‌ కోదండరాం రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి రాష్ట్ర ప్రజలకు సేవలందించాలని డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహసీల్దార్ల సంఘం ప్రతినిధుల బృందం ఆకాంక్షించింది. ఎమ్మెల్సీగా నియమితులైన సందర్భంగా ప్రొఫెసర్‌ కోదండరాంను ఆయన నివాసంలో శుక్రవారం డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, అసోసియేట్‌ ప్రెసిడెంట్‌ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు వై.శ్రీనివాస్‌ రెడ్డి, పులి సైదులు, తెలంగాణ తహశీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌. రాములు, రమేష్‌ పాక, సెక్రటరీ జనరల్‌ పూల్‌ సింగ్‌ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

లైసెన్స్‌ లేకుండా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్‌: డ్రగ్‌ లైసెన్స్‌ లేకుండా మందులను విక్రయించే మెడికల్‌ దుకాణదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్స్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ (డీసీఏ) డైరెక్టర్‌ జనరల్‌ వీబీ కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. డీసీఏ నుంచి డ్రగ్‌ లైసెన్స్‌ లేని మెడికల్‌ షాప్‌ లకు, ఫార్మసీలకు మందులు విక్రయించే హోల్‌సేల్‌ ఏజె న్సీలు, డీలర్లపైనా చర్యలు తప్ప వని స్పష్టం చేశారు. డ్రగ్‌ లైసెన్స్‌ లేకుండా మందులను నిల్వ చేయడం, విక్ర యించడం చేస్తే డ్రగ్స్‌ అండ్‌ కాస్మొటిక్స్‌ యాక్ట్‌ కింద ఐదేళ్ల వరకు జైలు శిక్ష తప్పదని తెలిపారు. నకిలీ మందులు అమ్మడం, నిబంధనలకు విరుద్ధంగా మెడికల్స్‌ నిర్వహించే వారిపై డీసీఏ ఆధ్వర్యంలో గత కొద్ది రోజు లుగా సోదాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి శుక్రవారం పలు సూచనలు చేశారు. డ్రగ్‌ లైసెన్స్‌లు ఉంటేనే మెడికల్‌ దుకాణాలకు మందులు సరఫరా చేయాలని హోల్‌సేల్‌ ఏజెన్సీలు, డీలర్లకు సూచించారు. మెడికల్‌ దుకాణ దారులు విధిగా వారి డ్రగ్‌ లైసెన్స్‌ను కనిపించేలా దుకా ణంలో పెట్టాలని తెలిపారు. ప్రజలు కూడా లైసె న్స్‌ లేని దుకాణాల నుంచి మందులు కొనవద్దని, అది ఎంతో ప్రమా దకరమని పేర్కొన్నారు. మెడికల్‌ దుకాణాలకు సంబంధించి ఫిర్యాదు ఇచ్చేందుకు ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 10–30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 18005996969 టోల్‌ ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేయాలని డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు.

రూ.3.20 లక్షల మందులు స్వాధీనం..

డ్రగ్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ అధికారులు ఐఎస్‌ సదన్‌ లోని ఓ మెడికల్‌ షాప్‌లో గురువారం సోదాలు నిర్వహించారు. లైసెన్స్‌ లేకుండా ఈ షాప్‌లో మందులు విక్రయి స్తున్నట్లు గుర్తించారు. మొత్తం రూ.3.20 లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. షాప్‌ నిర్వాహకుడిని మహ్మద్‌ ఇతేషాత్‌గా గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు జరిగిన ఈ సోదాల్లో డీసీఏ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డి.సరిత పాల్గొన్నారు.

చదువుతోనే జీవితాల్లో వెలుగు: ఆర్‌ఎస్పీ

బోధన్‌: చదువుతోనే జీవితాల్లో వెలుగు వస్తుందని స్వేరోస్‌ ఇంటర్నేషనల్‌ నెట్‌వర్క్‌ వ్యవస్థాపకుడు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం నిజామాబాద్‌ జిల్లా సాలూర మండల కేంద్రంలో స్వేరోస్‌ ఇంటర్నేషనల్‌ ఆధ్వర్యంలో నిర్మించిన అంబేడ్కర్‌ విజ్ఞాన కేంద్రాన్ని (లైబ్రరీ) ఆయన ప్రారంభించారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి పల్లెలో విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాను చదువుకోకపోతే పాలమూరు జిల్లాలోని తుంగభద్ర నదిలో చేపలు పట్టుకొని, కూలీనాలీ పనులు చేసుకుని బతికేవాడినని ప్రవీణ్‌ చెప్పారు. దేశంలో గుడులతో పాటు బడులు ఉండాలని, బడులు ఖాళీగా ఉంటే జైళ్లు నిండుగా ఉంటాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని దేశానికి అందించిన గొప్ప మేధా సంపన్నుడు అంబేడ్కర్‌ అని ప్రవీణ్‌ కొనియాడారు. దేశంలో నక్కలు, కుక్కలు, పులులను లెక్కిస్తున్నారని, కానీ బీసీ కుల గణనను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ప్రవీణ్‌ విమర్శించారు. కుల గణన జరిగితే వారి జీవన స్థితిగతులు తెలుస్తాయని, వారిలో ఎంత మంది చదువుకు దూరం ఉన్నారో తెలుస్తుందన్నారు.



అంబేడ్కర్‌ విజ్ఞాన కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

విద్యా వ్యవస్థను అత్యున్నతంగా మార్చారు

ఏపీ సీఎం వైఎస్‌ జగన్‌కు ధన్యవాదాలు
ప్రముఖ సినీ నటుడు ఆర్‌.నారాణమూర్తి

ఇరగవరం: 'రాష్ట్రంలో విద్యా వ్యవస్థను అత్యు న్నతంగా మార్చిన సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డికి ధన్యవాదాలు' అని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్‌.నారాయణ మూర్తి అన్నారు. 'ప్రజాదీవెన' పేరిట యాత్ర చేపట్టిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావును పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం గోటేరు గ్రామంలో శుక్రవారం ఆర్‌.నారాయణమూర్తి కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం గోటేరులో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్‌ మీడియం ప్రవేశపెట్టడం ద్వారా భార తదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని గొప్ప పని చేశారని ప్రశంసించారు. ఇంగ్లిష్‌ మీడియంలో చదువుకోవడం వల్ల ప్రపంచీకరణలో భాగంగా ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. చదువు అంటే కేవలం సర్టిఫికెట్‌ కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్‌ కోసం ఉపయోగ పడాలని సీఎం జగన్‌ భావిస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లిష్‌ వస్తేనే ఉద్యోగా వకాశాలు దక్కుతున్నాయని, లేదంటే ఉద్యో గాలు రాని పరిస్థితి ఉందని తెలిపారు.

ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.కోటి సాయం

- రూపే కార్డు ఉంటే మరో రూ.15 లక్షలు
- ఆర్టీసీ ఉద్యోగులకు యూబీఐ వితరణ
- ఏడాదిగా రూ.40 లక్షల మేర వర్తింపు
- ఇప్పుడు ఒక్కసారిగా రూ.కోటికి పెంపు
- ఫిబ్రవరి 1 నుంచి పెంపు అమలులోకి

సాక్షి, హైదరాబాద్‌

➤ సిద్దిపేట నుంచి హైదరాబాద్‌ వస్తున్న ఆర్టీసీ బస్సు ఫెయిల్‌ కావటంతో ప్రయాణికులను మరో బస్సులోకి ఎక్కించారు. కండక్టర్‌ బస్సు ముందు నిలబడి ఆ వివరాలను రిపోర్టులో రాస్తుండగా వెనక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఆగి ఉన్న బస్సును ఢీకొంది.. దీంతో బస్సు దూసుకొచ్చి ముందు నిలబడిన కండక్టర్‌ను ఢీకొనటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటీవలే ఆయన కుటుంబానికి ప్రమాద సాయంగా రూ.40 లక్షలు అందాయి.

➤ మెహిదీపట్నంకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌పై ఓ చిన్న కారణంతో గతంలో ఆర్టీసీ క్రమశిక్షణ చర్యలు తీసుకుని సర్వీసు నుంచి తొలగించింది. దానిపై ఆ డ్రైవర్‌ లేబర్‌ కోర్టును ఆశ్రయించాడు. ఇది జరిగిన కొద్ది రోజులకే రోడ్డు ప్రమాదంలో అతను దుర్మరణం చెందాడు. సర్వీసులో లేకపోవటంతో ఆర్టీసీ నుంచి ఎలాంటి సాయం అందలేదు. దీంతో ఆ కుటుంబం పరిస్థితి దీనంగా మారింది. చిన్న పిల్లలను చదివించేందుకు ఆయన భార్య ఇళ్లల్లో పాచి పనులు చేయాల్సి వచ్చింది. ఆ దీనావస్థకు చలించి కొందరు జోక్యం చేసుకోవటంతో చివరకు ఆ ఉద్యోగి కుటుంబానికి కూడా రూ.40 లక్షల ప్రమాద బీమా సాయం అందింది.



యూబీఐతో ఒప్పందం చేసుకుంటున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌

ఇలా అనుకోని ప్రమాదం చోటు చేసుకుని.. సంపాదించే కుటుంబ పెద్ద చనిపోతే అల్పాదాయ కుటుంబాలు ఆర్థికంగా ఎదు ర్కొనే ఇబ్బందులు వర్ణనాతీతం. ఆస్తులు లేని కుటుంబాలు, సంపాదించే ఇతర వ్యక్తులు లేని కుటుంబాలు రోడ్డున పడటమే. ఇలాంటి సమయంలో ఆర్టీసీ ఉద్యోగులకు వారి ఖాతాలున్న బ్యాంకు శుభవార్త చెప్పింది. ప్రమాదవశాత్తూ చనిపోయిన ఆర్టీసీ ఉద్యోగి కుటుంబాలకు ఇకపై ఏకంగా రూ.కోటి సాయం అందనుంది. ఆ ఉద్యోగి పేరుతో రూపే కార్డు ఉంటే మరో రూ.15 లక్షలు అందుతుంది. వెరసి, రూ.1.15 కోట్లు అందటం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థికంగా వెసులుబాటు కలగబోతోంది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఇది అమలు కానుంది.

ఇప్పటికీ అవగాహన లేని ఉద్యోగులెందరో..

- ఈ ప్రమాద బీమా గురించి దాదాపు ఉద్యోగులందరికి తెలిసినా, అది వర్తించాలంటే ఏం చేయాలన్న విషయంలో కొందరికి ఇప్పటికీ అవగాహన లేదు. తమ ఖాతాలను సూపర్‌ సేవింగ్స్‌ సాలరీ ఖాతాగా మార్చాలంటూ ప్రతి ఉద్యోగి సంబంధిత బ్యాంకు బ్రాంచీలో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికీ, ఆ ఖాతాలోకి మారని ఉద్యోగులెందరో ఉన్నారు. అలాంటి వారు ఎవరైనా ప్రమాదవశాత్తూ చనిపోతే వారికి ఈ పథకం వర్తించదు. దాదాపు ఏడాదిగా ఆ బ్యాంకు ప్రమాద బీమా వసతిని అమలు చేస్తున్నా, ఉద్యోగులకు అవగాహన కల్పించటంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారు. ఇక రూపే కార్డు తీసుకోవాలని, దాన్ని ప్రతి 45 రోజుల్లోపు ఒకసారన్నా కచ్చితంగా వాడాలన్న నిబంధన గురించి కూడా అవగాహన లేదు. దీంతో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ ఆదేశాల మేరకు ఈడీ కృష్ణకాంత్‌ చర్యలు ప్రారంభించారు. ఈ పథకం వివరాలు, ఉద్యోగులు అనుసరించాల్సిన విషయాలను తెలియ చెప్తూ ఫ్లెక్సీలు రూపొందించి అన్ని డిపోలకు పంపుతున్నారు.

ఖాతాలు యూబీఐలోకి రావడంతో..

ఆర్టీసీ ఉద్యోగులకు పెద్దగా ఊరటనిచ్చే ప్రమాద బీమా లేదు. సంస్థ పరంగా అందే సాయం కూడా నామమాత్రమే. ఇలాంటి తరుణంలో, సూపర్‌ సేవింగ్‌ శాలరీ ఖాతా ద్వారా యూబీఐ పెద్ద వెసులుబాటు కల్పించింది. గతంలో ఆర్టీసీ జీతాల ఖాతాలు మరో బ్యాంకులో ఉండేవి. ఏడాదిన్నర క్రితం ఎండీ సజ్జనార్‌ వాటిని యూబీఐలోకి మార్చారు. ఆ సమయంలో ప్రమాద బీమా కింద ఆర్థిక సాయం అందే వెసులుబాటు గురించి చెప్పిన బ్యాంకు అధికారులు, ఆర్టీసీ ఉద్యోగుల ఖాతాలను సూపర్‌ సేవింగ్‌ సాలరీ ఖాతాలుగా మార్చాలని సూచించారు. ఆ వెంటనే ప్రమాద బీమా కింద రూ.40 లక్షలు పొందే వీలు కల్పించింది. దాదాపు ఏడాదిగా అది అమలవుతోంది. ఈ సమయంలో దాదాపు 20 మంది ఆర్టీసీ ఉద్యోగులుకు ప్రమాదాల బారిన పడి మృతి చెందారు. వీరి కుటుంబాలకు దశలవారీగా ప్రమాద బీమా కింద రూ.40 లక్షలు చొప్పున ఆర్థిక సాయాన్ని బ్యాంకు అందజేసింది. ఏదైనా సంస్థలో పనిచేస్తూ, ప్రతినెలా ఠంచన్‌గా జీతం అందే వారికి ఈ ఖాతా పొందే వీలును బ్యాంకు కల్పిస్తోంది.

బ్యాంకుల మధ్య పోటీతో పెంపు

బ్యాంకుల మధ్య నెలకొన్న పోటీ వాతావరణం నేపథ్యంలో, ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.కోటికి పెంచుతూ ఆ బ్యాంకు నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీలో 47 వేల మంది వరకు ఉద్యోగులున్నారు. ప్రతినెలా రూ.220 కోట్ల వరకు వారి జీతాల పద్దు ఉంటుంది. నిత్యం ఆర్టీసీకి రూ.14 కోట్ల వరకు టికెట్ల రూపంలో ఆదాయం (మహిళలకు అందించే జీరో టికెట్ల మొత్తం కాకుండా) ఉంటుంది. ఇవన్నీ ఆ బ్యాంకులోనే డిపాజిట్‌ అవుతాయి. ఇది పెద్ద మొత్తం కావటంతో సంస్థను ఆకట్టుకునేందుకు ఆ బ్యాంకు ఈ ప్రమాద బీమా మొత్తాన్ని పెంచింది. ఫిబ్రవరి ఒకటి నుంచి ఈ పెంపు అమలులోకి వస్తుంది. ఇక బ్యాంకు అందించే రూపే కార్డు ఉన్న వారికి అదనంగా మరో రూ.15 లక్షలు కూడా అందుతుంది.

హుస్సేన్‌సాగర్‌ తీరంలో భారత మాత మహా హారతి



శ్రీరాముడు ఆదర్శ పురుషోత్తముడు

బంజారాహిల్స్‌: సమాజంలో దేశభక్తిని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఏబీవీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్న భారతమాత మహాహారతి కార్యక్రమం శుక్రవారం సాయంత్రం హుస్సేన్‌సాగర్‌ తీరంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి త్రిదండి చిన్నజీయర్‌ స్వామి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నజీయర్‌ స్వామి మాట్లాడుతూ శ్రీరాముడు ఆదర్శ మహా పురుషోత్తముడన్నారు. ప్రతిఒక్కరినీ అక్కున చేర్చుకున్న ఘనత భారతదేశానికే దక్కిందన్నారు. జీవితంలో ఎంతటి వారికైనా కష్టసుఖాలు వస్తాయని, వాటికి కుంగిపోకుండా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని, ఇందుకు రామాయణం పూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.



మహాహారతి కార్యక్రమంలో హనుమాన్‌ మూవీ టీంను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో చినజీయర్‌ స్వామి తదితరులు

మాజీ ఎమ్మెల్యే మశ్చేందర్‌ మృతి

అల్వాల్‌: కంటోన్మెంట్‌ మాజీ ఎమ్మెల్యే మశ్చేందర్‌ (95) శుక్రవారం మృతిచెందారు. జనతా పార్టీ నుండి 1978లో కంటోన్మెంట్‌ ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం కాంగ్రెస్‌ పార్టీ నుండి నాగర్‌ కర్నూల్‌, కంటోన్మెంట్‌లో పోటీ చేశారు. అల్వాల్‌లో నివాసం ఉంటున్న ఆయన స్థానికంగా ఒక స్కూల్‌ను ఏర్పాటుచేసి తక్కువ ఫీజులతో పేద, మధ్య తరగతి వారికి ఆంగ్ల విద్యను అందిస్తున్నారు. మశ్చేందర్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మూడు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఈ ఆత్మ (పరమ పురుషుడు) సమస్త ప్రాణుల్లోనూ నిహితమై ఉన్నప్పటికీ,
యోగమాయ తెర వెనుక దాగివుండటం వల్ల అందరికీ ప్రత్యక్షం కాదు.
తమ బుద్ధిని అతి సూక్ష్మము, తీక్షణంగా మలుచుకున్నవారు మాత్రమే దర్శించగలరు.
– కేనోపనిషత్తు

సాక్షి
శనివారం, 27 జనవరి 2024

నితీశ్ కొత్త అవతారం!

గాలి ఎటు వీస్తున్నదో... అది ఏ గమ్యం చేరుతుందో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు తెలుసున్నంతగా దేశంలో మరే రాజకీయ నాయకుడికీ తెలియదని ఇప్పటికే ముద్రపడింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండగా ఆయన మరోసారి ఈ విన్యాసానికి తెరలేపారు. విపక్ష ఇండియా కూటమి ఏర్పాటులో చొరవ తీసుకుని, నాలుగైదు సమావేశాల్లో కూడా పాల్గొన్న నితీశ్ మరోసారి రంగు మార్చబోతున్నారని వారం రోజులుగా కథనాలు వస్తూనేవున్నాయి. మరికొన్ని గంటల్లో ఆయన కాషాయ కూటమి తీర్థం పుచ్చుకుని తరించబోతున్నారని కథనాలు వెలువడుతున్న దశలో కూడా ఆయన మౌనాన్నే ఆశ్రయిస్తున్నారు. పరస్పర విరుద్ధ సంకేతాలిస్తూ కథను రక్తికట్టించటానికి ఆయన పార్టీ జేడీ(యూ) ప్రయత్నిస్తోంది. ఒకపక్క తదుపరి సర్కారు గురించి గవర్నర్‌తో మంతనాలు జరుపుతూ కూడా 'మహాగఠ్‌బంధన్ సర్కారు బాగానేవుంది. మీడియా కథనాలన్నీ ఊహాగానాలే' అంటూ ఆ పార్టీ అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహా ప్రకటించటం ఎవరిని నమ్మించటానికో అర్థం కాదు. చిత్రమేమంటే మహాగఠ్‌బంధన్ కాపురాన్ని వదులుకోకుండానే... సీఎం పదవికి రాజీనామా చేయకుండానే ఆదివారం ఆయన నేతృత్వంలో ఏర్పడబోయే ఎన్డీయే సర్కారులో ఉపముఖ్యమంత్రులుగా, మంత్రులుగా ఎవరెవరుండాలనే నిర్ణయాలు జరిగిపోతున్నాయి. పట్నా–ఢిల్లీ మధ్య ఫోన్‌లైన్లు బిజీ అయిపోయాయి. బీజేపీలో బహిరంగంగానే హడావుడి కనబడుతోంది. ఎందుకిలా? 'రాజకీయాల్లాంటి జూదం మరేదీ లేదు... అక్కడ కనిపించినంత ప్రస్ఫుటంగా మరెక్కడా వైపరీత్యాలు కనబడవు' అని వెనకటికొక రాజనీతిజ్ఞుడు వ్యాఖ్యానించాడు. నితీశ్ పోకడలు గమనిస్తే అది అక్షరాలా నిజం అనిపిస్తుంది. ఆయన ఒక కూటమిలో వున్నంత కాలం మరో కూటమి ఆయన రాక కోసం ఎదురు చూస్తూ వుంటుంది. నితీశ్‌కు సీఎం పదవి కట్టబెట్టి ఆయన డిప్యూటీలుగా కొనసాగేందుకు రెండుచోట్లా నేతలు సిద్ధంగావుంటారు.

కూటములను మార్చటంలో నితీశ్‌ను తలదన్నే నేత దేశంలో మరెవరూ ఉండకపోవచ్చు. ఏపీ మాజీ సీఎం చంద్రబాబు నాయుడొక్కరే బహుశా ఆ విషయంలో నితీశ్‌తో పోటీపడగలరు. ఎన్డీయేతో తన దశాబ్దకాల అనుబంధాన్ని 2013లో నితీశ్ తెంచుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. నరేంద్ర మోదీని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ప్రకటించటం అప్పట్లో ఆయనకు అభ్యంతరం అనిపించింది. తీరా 2014 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలవడం, కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఏర్పడటంతో సీఎం పదవికి రాజీనామా చేసి జీతన్‌రాం మాంఝీని ఆ పీఠంపై కూర్చోబెట్టారు. కానీ ఆ వైరాగ్యం మూన్నాళ్ల ముచ్చటే అయింది. కొన్ని నెలలకే ఆయన్ను తొలగించి తిరిగి సీఎం అయ్యారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో కలిసి మహాగఠ్‌బంధన్ కూటమి కట్టి మరోసారి సీఎం అయ్యారు. కానీ రెండేళ్లు గడిచేసరికల్లా మళ్లీ ఎన్డీయే గూటికి చేరి మళ్లీ సీఎం అవతారమెత్తారు. మోదీ నాయకత్వాన్ని సంపూర్ణంగా ఆమోదించారు. తీరా 2022లో దాన్నుంచి బయటపడి మరోసారి మహాగఠ్‌బంధన్ సర్కారుకు సారథ్యం వహించారు. తాజాగా ఎన్డీయే కూటమిలో ప్రవేశం ఖరారైందన్న కథనాలు నిజమైతే ఆయన ముచ్చటగా మూడోసారి రంగు మార్చినట్టు! 2005లో తొలిసారి సీఎంగా అయినప్పుడు మొదలుకొని ఈ పదిహేడేళ్లలో ఆయన పదహారేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. చిత్రమేమంటే ఆయన ఎన్నిసార్లు యూటర్న్‌లు తీసుకున్నా బిహార్‌లో కాస్త అటూ ఇటూగా ఆయన ప్రతిష్ఠకు ఏనాడూ ఇబ్బంది కలగలేదు. లాలూ ప్రసాద్ యాదవ్, అటుపై ఆయన సతీమణి రబ్డీ దేవి ఏలుబడి సవ్యంగా వుంటే నితీశ్ ప్రాభవం ఈ స్థాయిలో ఉండేది కాదేమో! తన సొంత సామాజికవర్గం కుర్మీల బాగోగులు చూస్తూ బాగా వెనకబడిన కులాలనూ, మహాదళిత్ కులాలనూ సమాదరించి 'కోటాలో కోటా' కల్పించటం ఆయనకు రాజకీయంగా కలిసొచ్చింది. అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యతనీయటంవల్ల ఆధిపత్య కులాల్లో కొంత అసంతృప్తి ఉన్నమాట నిజం. అలాగే బీజేపీతో తరచు దగ్గరవుతున్నందుకు ముస్లింలలోనూ నితీశ్‌పై కినుకవుంది. కానీ ఆయన్ను పూర్తిగా దూరం పెట్టేంత తీవ్ర వ్యతిరేకత ఆ వర్గాల్లో లేకపోవటం నితీశ్‌కు ఆమోదయోగ్యతను కల్పిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో బీసీల్లోనూ, దళితుల్లోనూ అత్యంత వెనకబడిన కులాల ఆదరణను సులభంగా పొందగలిగిన బీజేపీకి బిహార్‌లో నితీశ్ అండదండలుంటేనే అది సాధ్యంకావటం జేడీ(యూ)కు తోడ్పడుతోంది.

మన పార్లమెంటరీ పార్టీలకు సిద్ధాంత జంజాటం తక్కువ. కొంతకాలం క్రితంవరకూ వామపక్షాల్లో, మితవాదపక్షాల్లో ఆ పట్టింపు ఎక్కువుండేది. కానీ ఓట్లు, సీట్ల వేటలో అది మసకబారింది. వామపక్షాలు బీజేపీని అంటరాని పార్టీగా చూస్తాయి తప్ప దాంతో జతకట్టినవారిపట్ల ఆ భావం వుండదు. వారు బయటపడిన మరుక్షణం పునీతులైనట్టే భావిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో గాలివాలుకు తగినట్టు రంగులు మార్చే నితీశ్ వంటి వారి నుంచి మెరుగైన కార్యాచరణను ఆశించలేం. ఆ సంగతలావుంచి ఇప్పటికే తృణమూల్ అధినేత, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తమ రాష్ట్రంలో ఇండియా కూటమితో పొత్తుండదని చెప్పిన తరుణంలో, పంజాబ్ ఆప్ నేత, సీఎం భగవంత్ మాన్ సైతం అదే బాణీ వినిపించిన నేపథ్యంలో నితీశ్ నిర్ణయం ఇండియా కూటమిని నామమాత్రావశిష్టం చేస్తుంది. నిర్దిష్టమైన సిద్ధాంతం లేనివారినీ, సులభంగా రంగులు మార్చే వారినీ, సూత్రబద్ధ రాజకీయాలు అనుసరించలేని వారినీ వెంటేసుకుని కూటమి కట్టినంత మాత్రాన మెరుగైన ఫలితాలు రావని, ఎంత మాత్రమూ ప్రయోజనం ఉండదని విపక్షాలు ఇప్పటికైనా గ్రహించటం ఉత్తమం.

ఈశాన్య సరిహద్దుల్లో మత్తు మహమ్మారి

ఇండియా–మయన్మార్ సరిహద్దులను కంచెతో మూసేస్తామని ఇటీవల కేంద్ర హోంమంత్రి ప్రకటించారు. ఇరుదేశాల మధ్య ఉన్న 1,643 కిలోమీటర్ల సరిహద్దు గుండా ఈశాన్య రాష్ట్రాల్లోకి మత్తు పదార్థాలు, ఆయుధాలు సరఫరా అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అఫ్గానిస్తాన్‌ను దాటి మయన్మార్ ప్రపంచంలో అత్యధిక నల్లమందు ఉత్పత్తిదారుగా అవతరించిందని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. ఆ సాగుకు కావాల్సిన నీరు, ఎరువులు, మూలధన పెట్టుబడులు, కొనుగోలుదారులు, మార్కెటింగ్, హవాలా లాంటి కార్యకలాపాలన్నీ ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్‌గా ఏర్పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటుగా, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సమాజాన్ని జాగృతం చేస్తే తప్ప ఈ ప్రమాదాన్ని అరికట్టలేం.

విశ్లేషణ



డాక్టర్ గద్దె ఓంప్రసాద్

కొలాడాన్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మయన్మార్‌లోని సిత్వే పోర్ట్‌ను మిజోరం రాజధాని ఐజ్వాల్‌తో కలిపే ప్రణాళికలో ముఖ్యమైన పాలేత్వా పట్టణాన్ని సాయుధ తిరుగుబాటు గెరిల్లా గ్రూపు అరకాన్ ఆర్మీ స్వాధీనం చేసుకుందన్న వార్తలు... ఇండియా–మయన్మార్ సరిహద్దులను కంచెతో మూసేస్తాం అన్న కేంద్ర హోం మంత్రి ప్రకటన... ఈ రెండు కూడా భారతదేశ భద్రతతో ముడిపడిన అంశాలు. అలాగే ఇటీవల మణిపుర్‌లో చెలరేగిన జాతుల మధ్య ఘర్షణతో కూడా కొంత సంబంధం ఉన్న విషయాలు. 2003 డిసెంబర్‌లో వెలువడిన 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' నివేదిక ప్రకారం, అఫ్గానిస్తాన్‌ను దాటి మయన్మార్ ప్రపంచంలో అత్యధిక నల్లమందు ఉత్పత్తిదారుగా అవతరించింది. అఫ్గానిస్తాన్‌లో నల్లమందు సాగుపై తాలిబన్ ప్రభుత్వం తీసుకొంటున్న కఠిన చర్యల ఫలితంగా అక్కడి ఉత్పత్తిలో గణనీయమైన తరుగుదల కనిపిస్తుండగా, మయన్మార్‌లో పెరుగుతోందన్న వార్తలు సరిహద్దు పంచుకుంటున్న భారత్ లాంటి దేశాలకు కలవరం కలిగించేదే.

దశాబ్దాలపాటు మయన్మార్‌లో నెలకొన్న రాజకీయ అస్థిరత, సాయుధ తిరుగుబాటు... నల్లమందు (ఓపియం) ఉత్పత్తి పెరగడానికి కారణమయ్యాయి. పేదరికంతో బాధపడుతున్న రైతులకు నల్లమందు సాగు పరిస్థితులు మెరుగుపరుచుకునేందుకు ఒకే ఒక మార్గంగా అవతరించింది. కిలోకు సుమారు 23 వేల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఒక కోటి పదిలక్షల హెక్టార్ల సాగు చేయదగిన భూమి ఉన్న మయన్మార్‌లో దాదాపు 47,000 హెక్టార్లు అంటే 0.5 శాతం భూమిలో నల్లమందు పండుతోంది. దీనివల్ల గతేడాది 1080 మెట్రిక్ టన్నుల నల్లమందు ప్రపంచ మార్కెట్లోకి విడుదలైంది. ఇది 2022లో ఆ దేశం ఉత్పత్తి చేసిన నల్లమందు కన్నా సుమారు 36 శాతం అధికం. ఇదే సమయంలో ఎకరానికి సగటు ఉత్పత్తి 19 నుండి 22 కిలోలకు పెరిగింది. సాగులో అధునాతన పద్ధతులు అవలంబిస్తున్నారనీ, ఆయా ప్రాంతాలను నియంత్రిస్తున్నవారి సహాయం లేకుండా ఇది సాధ్యపడదనీ మనం అర్థం చేసుకోవచ్చు. ఈ మొత్తం వ్యాపారం విలువ సుమారు రెండు బిలియన్ డాలర్లు. ఈ నల్లమందు ద్వారా ఉత్పత్తయ్యే హెరాయిన్, మార్ఫిన్, కోడెయిన్ వంటి మత్తు పదార్థాల ద్వారా సుమారు పది బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. ఇది మయన్మార్ స్థూల జాతీయోత్పత్తిలో 2–4 శాతం.

మయన్మార్‌లో ముఖ్యంగా మూడు రాష్ట్రాలైన షాన్, చిన్, కాచిన్‌లలో నల్లమందు సాగు నిరాటంకంగా జరుగుతోంది. థాయిలాండ్, లావోస్ దేశాలను ఆనుకుని ఉండే షాన్‌లో 1750ల లోనే నల్లమందు సాగు మొదలైంది. క్రమంగా ఆ ప్రాంతం మొత్తం విస్తరించి, ఇరవయ్యో శతాబ్దం నాటికి గోల్డెన్ ట్రయాంగిల్ రూపంలో అవతరించడమే గాక, ప్రపంచంలో సగం నల్లమందు ఆధారిత మత్తుపదార్థాలు ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగింది. ఈ ఒక్క రాష్ట్రంలోనే సుమారు 80 శాతం ఉత్పత్తి జరుగుతుంటే, భారత్‌ను ఆనుకొని ఉండే చిన్, కాచిన్ రాష్ట్రాలు మిగిలిన ఇరవై శాతం ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ రాష్ట్రాలలోని టాహం, ఫాలం, తుఎంసెంగ్ ప్రాంతాల మీదుగా మయన్మార్‌తో సుమారు 510 కిలోమీటర్ల కంచె లేని సరిహద్దు కలిగి వున్న మిజోరంలోని ఛాంఫై, మణిపుర్‌లోని మొరెహ్, టాము ప్రాంతాల ద్వారా నల్లమందు భారత్‌లోకి చేరుతోంది. మయన్మార్‌తో సుమారు 1,600 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్న భారత్‌పై, ముఖ్యంగా మిజోరం, మణిపుర్, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలపై దీని ప్రభావం పడుతుందనడంలో సందేహం లేదు.



వివిధ జాతులకు చెందిన సాయుధ పోరాట సంస్థలతో పాటు కొన్ని మిలిటరీ విభాగాలు, రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం, ఆయుధాల కొనుగోలు కోసం ఈ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో భాగం పంచుకుంటున్నారు. కాచిన్ ప్రాంతంలోని కాచిన్ ఇండిపెండెన్స్ ఆర్మీ, అరకాన్ ఆర్మీ, యునైటెడ్ వా స్టేట్ ఆర్మీ వాటిలో కొన్ని మాత్రమే. అలాగే చిన్ రాష్ట్రం నుండి కార్యకలాపాలు సాగిస్తున్న చిన్ నేషనల్ ఆర్మీ, చిన్ నేషనల్ డెమోక్రాటిక్ ఫోర్స్, చిన్ ల్యాండ్ డిఫెన్స్ ఫోర్స్ లాంటి కొన్ని సాయుధ సంస్థలతో పాటు, సరిహద్దులకు ఇరువైపులా కార్యకలాపాలు సాగిస్తున్న కుకీ నేషనల్ ఆర్మీ కూడా ఈ వ్యవహారాల్లో భాగం కావడం ఆందోళన కలిగించేదే. సరిహద్దు దేశాలపై తిరుగుబాటు దారులకు వ్యతిరేకంగా ఒత్తిడి తేవడానికి మయన్మార్ మిలిటరీ జుంటా కూడా ఈ నల్లమందు అక్రమ రవాణాలో భాగం పంచుకుంటోందని ఆ దేశానికి చెందిన 'నేషనల్ యూనిటీ కన్సల్టేటివ్ కౌన్సిల్' సభ్యుడు యు మయూన్గ్ మయూన్గ్ ఆరోపిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో చైనీస్ డ్రగ్ కార్టెల్స్ పాత్ర చెప్పుకోదగినది. డ్రగ్స్‌ను అటు ఆగ్నేయాసియా మార్కెట్లలోకి తరలిస్తూ, ఇటు థాయిలాండ్ నుంచి మయన్మార్, బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్ మీదుగా ఈశాన్య రాష్ట్రాల్లోకి ఆయుధాల్ని సరఫరా చేస్తున్నాయి.

ఈశాన్య ప్రాంతానికి చెందిన సాయుధ వేర్పాటు దళాలు ఇంతకు ముందు నిధుల సేకరణకు బ్యాంకు దోపిడీలు, టీ గార్డెన్లు, వ్యాపార సముదాయాల నుండి అక్రమ వసూళ్లు, ప్రజల వద్ద పన్నులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల నుండి డబ్బు గుంజడాలు లాంటివి చేస్తుండేవి. ఈ నిధులను మయన్మార్‌లోని కాచిన్ వేర్పాటు వాద వర్గాల నుండి ఆయుధాలు కొనుగోలు కోసం వెచ్చిస్తుండేవి. అవి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో పాలు పంచుకునేవి కాదు. కానీ గత కొన్నేళ్లుగా ఈ ధోరణిలో మార్పు వస్తోంది. ఈ వ్యవహారాలను పరిశీలిస్తే, నాలుగు విషయాలు గోచరిస్తాయి. ఈశాన్య రాష్ట్రాల్లోని కొండ, మారుమూల ప్రాంతాల్లో నల్లమందు, గంజాయి సాగు పెరుగుతోంది. హెరాయిన్, యాంఫేటమిన్ లాంటి మత్తు పదార్థాలు చిన్న పరిమాణాల్లో ఈశాన్య రాష్ట్రాలకు వస్తున్నాయి. కొన్ని రకాల ఫార్మాస్యూటికల్స్ ఈశాన్య రాష్ట్రాల నుండి మయన్మార్‌లోకి రవాణా అవుతున్నాయి. యాంఫేటమిన్ లాంటి మత్తు పదార్థాలు ఉత్పత్తి చేయడానికి కావాల్సిన ఫెడ్రిన్, సూడోఫెడ్రిన్ లాంటివి మయన్మార్‌కు ఈశాన్య రాష్ట్రాల నుండి వెళ్తున్నాయి. అంటే సరిహద్దులకు ఇరు వైపులా సాగుతున్న వ్యవహారం ఇది!

పశ్చిమాన అఫ్గానిస్తాన్, వాయవ్య పాకిస్తాన్, మధ్య ఆసియాతో కూడిన 'గోల్డెన్ క్రెసెంట్'కూ... తూర్పున మయన్మార్, థాయిలాండ్, లావోస్‌లతో కూడిన 'గోల్డెన్ ట్రయాంగిల్'కూ మధ్యలో ఉన్న భారత్ మాదక ద్రవ్యాలకు అతిపెద్ద ఆకర్షణీయమైన మార్కెట్. మత్తు పదార్థాలను ఏమాత్రం సహించని(జీరో టోలెరెన్స్) విధానాన్ని కేంద్ర ప్రభుత్వ స్వీకరించింది. దీనిలో భాగంగా 2016లో నార్కో కోఆర్డినేషన్ సెంటర్, కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం 2019లో జాయింట్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటైనాయి. 'నార్కోటిక్స్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్స్' చట్టం 1985లో భాగంగా బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్‌కు డ్రగ్స్ వ్యతిరేక చర్యలు తీసుకోవడానికి అధికారం కల్పించారు. ఇప్పటివరకూ సుమారు ఒకటిన్నర లక్షల కిలోల మత్తు మందులను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేస్తే, అందులో నలభై వేల కిలోలు ఒక్క ఈశాన్య రాష్ట్రాల్లోవే. ప్రభుత్వాలే కాకుండా వివిధ రంగాల ప్రజలు కూడా సమాజాన్ని జాగృతం చేస్తేనే మత్తు మహమ్మారిని అరికట్టగలం. కొన్ని సినిమాల్లో చూపిస్తున్న విధంగా డ్రగ్స్ సేవించడం, సైకోల్లా ప్రవర్తించడమే హీరోయిజంగా యువత భావిస్తే మనం కేవలం నిట్టూర్పు విడవాల్సి వస్తుంది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, దక్షిణాసియా వ్యవహారాల అధ్యయన విభాగం, జేఎన్‌యూ | 79089 33741

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చెల్లెలా, సెలవు!



డియర్ బవత (భవతారిణి: సంగీత దర్శకురాలు, ఇళయరాజా కూతురు), దీన్ని భారమైన హృదయంతో రాస్తున్నాను. నువ్వు నా సొంత చెల్లెలిలాంటి దానివి. గత కొన్ని వారాలుగా నాకు నచ్చిన వాళ్లను ఎందుకు కోల్పోతున్నానో నాకు తెలీదు. ఈ జీవితపు నిర్మాణం నాకు అంతు పట్టడం లేదు. నీ ఆత్మకు శాంతి కలగాలి.

– విశాల్, నటుడు

ఏం మిగిలిందని?



గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవడానికి ఏమీ మిగల్లేదు. రాజ్యాంగం చచ్చిపోయింది. అన్ని సంస్థలూ ఉమ్మడిగా ఆ మిగిలివున్న గణతంత్ర నిర్మాణాన్ని కాస్తా కూల్చేస్తున్నాయి. ఇది శోకించాల్సిన, మనల్ని మనం తరచి చూసుకోవాల్సిన రోజు.

– అపూర్వానంద్, ప్రొఫెసర్

రాజీ మార్గం



మార్కెట్ ధరకు పొందని నేల మీద చేసే నమాజు చెల్లదని మా ముస్లింలకు తెలుసు. ఒకవేళ సాక్ష్యాధారాలు లేకపోవడమే అయోధ్య కేసులో పోరాటానికి కారణమైతే... మరి కాశీ, మథురల్లో ఉన్న పుష్కలమైన సాక్ష్యాధారాలు రాజీకి సరిపోవా?

– షెహలా రషీద్, యాక్టివిస్ట్

జరిగేదదే!

'లౌకిక', 'సామ్యవాద' పదాలు లేని పాత రాజ్యాంగ పీఠికను భారత ప్రభుత్వ అధికారిక హాండిల్ షేర్ చేసింది. ఈ పదాలను తొలగించేలా పార్లమెంటులో కొత్త సవరణ తేవడానికి ఇంకెంతో కాలం పట్టదు.

– సిద్ధార్థ్, వ్యాఖ్యాత

మన ఘనత



ప్లేటో, అరిస్టాటిల్ రాశారని తప్పుగా ఆపాదించిన వందలాది పుస్తకాలను విశ్లేషించిన కొద్దీ, ప్రాచీన గ్రీకులు సంస్కృతం, పాళీ పుస్తకాలు చదివారని స్పష్టమవుతుంది. చాలాసార్లు వాళ్లే దాన్ని ఒప్పుకొంటారు కూడా. జేఎన్‌యూ పీహెచ్‌డీలు అలాంటి అంశాల మీద పరిశోధనలు చేయాలి; మొఘలుల పట్ల అపరాధనా భావాన్ని చూపే నాసిరకపువి కాకుండా.

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

చిత్రకళకు కొండంత చిరునామా

ఆ చిత్రాలను చూస్తే మన కనులకు ఆహ్లాదం మన మనసుకు ఆనందం. సప్తవర్ణ సోయగాలు బొమ్మలుగా సాక్షాత్కరిస్తాయి. విశాలంగా రెక్కలార్చిన పక్షులూ, శరవేగంగా పరుగులెత్తే జింకలూ ఎలా కాన్వాస్‌పై రంగుల్లో నిలిచిపోతాయో, గలగల సెలయేరులూ గంగానది ప్రవాహాలు కళ్ళ ముందు నిలుస్తాయి. అభిజ్ఞాన శాకుంతల కావ్యమైనా, రామాయణ భారత భాగవతాది కథలైనా వారి కుంచె విన్యాసాల్లో ఒదిగిపోతాయి. కోతుల నాడించే మదారి అయినా, పల్లెటూరి జంట అయినా, అరకు లోయలో అందాలైనా వారి బొమ్మల్లో గమ్మున కూర్చుంటాయి. వీరనారి ఝాన్సీ రాణీ, మహా పరాక్రమశాలి మహారాణి రుద్రమదేవీ పౌరుషంగా నిలబడతారు. నన్నయ్య, పోతన, వేమన ఇదిగో మేము ఇలా ఉంటాం అంటూ చిత్రాలై వస్తారు. ప్రకృతి చిత్రాల సోయగాల నుండి, సంప్రదాయ చిత్రాల ఆలోచనల నుండి, సామాజిక చింతన చేతనత్వం వరకు కొండపల్లి శేషగిరి రావు 40వ దశకం నుండి, 2000వ దశకం వరకు 70 ఏళ్ళు చిత్రకళా జగత్తుకు నిలువెత్తు చిత్రమై నిలిచారు.





కొండపల్లి శేషగిరిరావు; శాకుంతల పత్రలేఖనం

కొండపల్లి శేషగిరిరావు 1924 జనవరి 27న వరంగల్ జిల్లా మానుకోట దగ్గర ఉన్న పెనుగొండ గ్రామంలో జన్మించారు. పుట్టింది సంపద గల ఇల్లే అయినా, పదేళ్ల బాలుడు అయ్యేసరికి అనివార్య కారణాలతో పేదరికంలో పడిపోయింది కుటుంబం. పదవ తరగతి వరకు హనుమకొండలో వారాలబ్బాయిగా బ్రతుకు సాగించి చిత్రకళపై ఉన్న మక్కువతో హైదరాబాదుకు ధైర్యాన్ని వెంటబెట్టుకొని నడిచారు. కొందరు ప్రముఖుల సహకారంతో మెహదీ నవాజ్ జంగ్ గారికి పరిచయమై వారి సహాయంతో రెడ్డి హాస్టల్లో జాయిన్ అయి, 'హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్'లో విద్యార్థిగా చేరి నూతన అధ్యాయాన్ని తెరుచుకున్నారు. ఐదేళ్ల చదువును పూర్తి చేసుకుని ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడై, చిత్రకారునిగా ఎదిగి, మెహదీ ఫర్మాయిషీతో కలకత్తాకు పయనమయ్యారు.

రవీంద్రనాథ్ టాగూర్ స్థాపించిన 'శాంతినికేతన్'లో శేషగిరిరావు విద్యార్థి అయ్యారు. ప్రముఖ చిత్రకారులు నందాలాల్ బోస్, అవనీంద్రనాథ్ ఛటోపాధ్యాయుల ప్రియ శిష్యుడూ అయ్యారు. తరువాత తాను చదువుకున్న ఫైనార్ట్స్ కళాశాలలోనే అధ్యాపకునిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపల్‌గా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. రిటైర్ అయిన తర్వాత ఎన్నో వందల చిత్రాలను వేశారు. హైదరాబాద్ పరిసరాలలో కనిపించకుండా పోయిన కొండలు, గుట్టలు శేషగిరిరావు చిత్రించిన చిత్రాల్లో వందలాదిగా దర్శనమిస్తాయి. ఆక్వాటెక్చర్‌లో, కలర్ గ్రాన్యూల్స్ మ్యూరల్ పెయింటింగ్స్‌లో ఎన్నో కొత్త కొత్త ప్రయోగాలు చేశారు. అమీర్ పేట్ దగ్గర మైత్రి భవన్ హుడా కాంప్లెక్స్ ముఖ ద్వారం రెండువైపులా గోడలపై కనిపించే విశ్వరూప సందర్శనం, లవకుశులు చేజిక్కించుకున్న అశ్వమేధ యాగాశ్వ పెయింటింగ్ ఇప్పుడూ చూసి ఆనందించవచ్చు. 'చిత్రకళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు జీవిత చరిత్ర' అనే పుస్తకానికి ముందుమాటగా 'కుంచె సామ్రాజ్య మహారాజు' అంటూ ఆర్టిస్ట్ మోహన్ రాసిన వ్యాసంలో 'రావి నారాయణ రెడ్డి పైన నీలాకాశం తేలి, మబ్బుల కాంట్రాస్టులో ఆదర్శమంత ఎత్తెగురు తున్న ఎర్రని జెండా, దానిపై హత్తిన తెల్లని సుత్తి కొడవలి. కళ్ళు నిండిపోతాయి', 'నుదుట నామం దిద్దుకుని పరమ సాంప్రదాయకంగా కనిపిస్తూ చిత్రాలు గీసే ఈ పవిత్ర బ్రాహ్మణ మూర్తికి ఎర్రజెండా జబ్బు ఎలా సోకిందబ్బా? అని ఓ నాయకుడిని అడిగాను, ఇలాంటి పెద్ద కమ్యూనిస్టు నాయకులు ఎందరో ఆయనకు జిగిరీ దోస్తులు అని చెప్పాడు' అన్నారు. ఈ మాటలు శేషగిరి రావు నిండైన సామాజిక మూర్తి మత్వానికి అద్దం పట్టాయి అని చెప్పవచ్చు.

'కాకి పడిగెలు' జానపద చిత్రకళను వెలుగులోకి తెస్తూ రచించిన పరిశోధనాత్మక వ్యాసమైన 'ఆంధ్రదేశంలో చిత్రకళ', 'తెలంగాణాలో చిత్రకళ', 'కళ – కల్పనా వైచిత్రి' వంటి ఎన్నో గొప్ప వ్యాసాలను రచించిన కవి, రచయిత కూడా శేషగిరిరావు. 'చిత్ర శిల్పకళా రామణీయకము' వ్యాస సంపుటి వీరి పాండితి గరిమకు నిదర్శనం. మొట్ట మొదటి ప్రపంచ తెలుగు మహాసభలలో 'తెలుగు తల్లి' విగ్రహానికి రూపకల్పన చేశారు. 2012 జూలై 26న తుది శ్వాస విడిచారు. నేడు ఆ అద్భుత చిత్రకారుడు పుట్టిన రోజు సందర్భంగా శత జయంతి వేడుకలు జరుపుతున్నామని తెలియచేయడానికి సంతోషిస్తున్నాం.

– డాక్టర్ కొండపల్లి నీహారిణి | రచయిత్రి, సంపాదకురాలు

(నేడు కొండపల్లి శేషగిరిరావు శతజయంతి వేడుక జేఎన్ఏఎఫ్ఏయూ, హైదరాబాదులో ఉదయం 11 గంటలకు జరగనుంది.)

సారాంశం
సరికొండ చలపతి

ఓ మైగాడ్.. వాటీజ్ దిస్..!



పిల్లలూ.. దేవుడూ..

పండుగ పూట ఓ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ గుడికి వెళ్లారు. దైవ దర్శనం అయ్యింది. పిల్లాడితో సాష్టాంగ నమస్కారం చేయించారు. '..దేవుడు బాగా చదువు వచ్చేలా చేస్తాడు...' అని చెప్పే సరికి ఐదేళ్ల ఆ కుర్రాడు ఉత్సాహంగా దండం పెట్టేసి ప్రసాదం నోట్లో వేసుకుని తల్లిదండ్రులతో పాటు బయటికి వచ్చాడు. అంతా కలసి గుడి ప్రాంగణంలో తిరుగుతున్నారు. అక్కడో స్తంభంపైన చెక్కి ఉన్న సింహం ముఖాన్ని చూసి పిల్లాడు జడుసుకుని భయంతో ''అమ్మా.. నాన్నా... పరుగెత్తండి... సింహం మనల్ని చంపేస్తుంది..'' అని కేకలు పెట్టాడు. అప్పుడు తండ్రి చటుక్కున కొడుకుని దగ్గరకు తీసుకుని ''అలా భయపడకూడదు. అది ఒట్టి శిల్పం.. మనల్ని ఏమీ చేయదు..'' అని చెబుతూ ఆ సింహం బొమ్మ దగ్గరకు తీసుకెళ్తాడు. ఆ పిల్లాడు అమాయకంగా 'శిల్పం రూపంలో ఉన్న సింహం మనల్ని ఏమీ చేయలేక పోతే... గుడిలో శిల్పం రూపంలో ఉన్న దేవుడు మనకు ఎలా మేలు చేస్తాడు.. నాకు చదువు వచ్చేట్టు ఎలా చేస్తాడు..?'

■ తండ్రికి వెంటనే ఏం చెప్పాలో తోచలేదు..

ఆ తండ్రి ఏం చెప్పాడనేది వదిలేసినా .. అలాంటి సందర్భాలలో ఏ తండ్రి అయినా కొడుక్కి కన్విన్సింగా చెప్పేదే... వాడి భవిష్యత్ విశ్వాసాలను ప్రభావితం చేస్తుందనేది మాత్రం నిజం..

పేరెంట్స్ దారిలోనే..

మతం, రాజకీయాలు.. ప్రతి ఒక్కరిలో ఈ రెండు అంశాలకు సంబంధించి రకరకాల అభిప్రాయాలు ఉంటాయి. ఈ రెండింటి విషయంలో వ్యవహరించే తీరు కూడా భిన్నంగా ఉంటుంటాయి. పుట్టి, పెరిగిన వాతావరణం.. చిన్ననాటి నుంచి ఎదుర్కొన్న పరిస్థితులు.. చుట్టూ ఉన్నవారి ప్రభావం.. వంటివి ఆ అభిప్రాయాలకు, వ్యవహార శైలికి కారణమవుతాయి. అయితే ఇందులో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని, వారు భావించిన దాని కంటే ఎక్కువగా పిల్లలపై ప్రభావం ఉంటుందని ప్యూ రీసెర్చ్ సెంటర్ ఇటీవల చేసిన ఓ అధ్యయనం తేల్చింది.

కావాలని నేర్పించేవాటికన్నా..

చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు నైతికంగా మంచి ప్రవర్తనతో ఉండాలని కోరుకుంటారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ఉండటం నుంచి బయటివారితో వ్యవహరించే తీరు, కష్టపడి పనిచేసే అలవాటు దాకా నేర్పించాలని ప్రయత్నిస్తుంటారు. తమలా ఉండాలని భావిస్తుంటారు. కానీ చాలా మంది పిల్లలు ఈ అంశాల్లో తల్లిదండ్రుల కోరికకు భిన్నంగా వ్యవహరిస్తుంటారు. **కానీ మత, రాజకీయ అంశాల్లో మాత్రం 80 శాతం మంది పిల్లలు తమ తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగినట్టుగానే వ్యవహరిస్తుంటారని ప్యూ రీసెర్చ్ అధ్యయనంలో తేలింది.**

■ రాజకీయ అంశాల్లో పిల్లలు తమ బాటనే అనుసరించాలని కోరుకుంటున్నట్టు కేవలం 16 శాతం మంది, మతపరమైన అంశాల్లో తమ బాటలోనే నడవాలని భావిస్తున్నామని కేవలం 35 శాతం మంది తల్లిదండ్రులు చెప్పడం గమనార్హం.

■ అంటే పిల్లలపై తల్లిదండ్రుల నుంచి పెద్దగా ఒత్తిడేమీ లేకున్నా కూడా వారిబాటలోనే నడుస్తున్నారు. కొన్ని కుటుంబాల విషయంలో తరతరాలుగా ఇది కొనసాగుతూనే వస్తున్నట్టు తేలింది.

మేం వేరే అని పైకి చెప్పున్నా..

తరాలు మారుతున్న కొద్దీ చాలా అంశాల్లో పిల్లల అభిప్రాయాలు/ వ్యవహారశైలి మారుతూ ఉంటాయి. తల్లిదండ్రులు పాటించేవి పాత/కాలం చెల్లిన ఆచారాలు, అభిప్రాయాలు అని పిల్లలు చెప్తుంటారు. తాము వేరేనని అంటుంటారు. ఇలా చాలా అంశాల్లో తల్లిదండ్రులతో విభేదించినా.. మత, రాజకీయ అంశాల్లో తమకు తెలియకుండానే వారిని అనుసరిస్తుంటారని ప్యూ రీసెర్చ్ సెంటర్ రెలిజియస్ రీసెర్చ్ డైరెక్టర్ అలన్ కూపర్‌మన్ చెప్పారు. ''నిజానికి.. పిల్లలు మనం చెప్పినట్టుగా చేయాలని/వినాలని కోరుకోవడం.. పిల్లలు వాటిని తప్పనిసరిగా పాటించేలా చేయడం.. రెండూ వేర్వేరు. పిల్లలు చాలా విషయాల్లో తమకు నచ్చినట్టుగా చేస్తుంటారు. ఇది పిల్లల తల్లిదండ్రులందరికీ తెలుసు. అయినా కూడా.. మత, రాజకీయపరమైన అంశాల్లో తల్లిదండ్రుల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని మా అధ్యయనంలో తేలింది..'' అని వెల్లడించారు.

.....

ఈ పరిస్థితి పేరెంట్స్ నుంచి సమాజం చేతుల్లోకి మారుతోందా.. దారి తప్పుతోందా....

.....

సొసైటీ చేతుల్లోకి..

ఇది చూడండి.. ఇటీవలి సంభాషణ. ఎనిమిదో తరగతి చదువుతున్న టింకూ సాయంత్రం స్కూల్ నుంచి ఉత్సాహంగా వచ్చాడు. చేతిలో రామమందిరం తాలూకు కాషాయం జెండా. దాన్ని తన తండ్రి చేతిలో పెడుతూ 'డాడీ..ఇది మన ఇంటి మీద కట్టిరా..' ... ఆర్డరేశాడు.

'ఎందుకురా ఇది..'

'ఎందుకేమిటి?.. అయోధ్యలో రామ మందిరం కట్టారుగా.. మనం కూడా సెలబ్రేట్ చేసుకోవాలి..'

తండ్రికేమీ అభ్యంతరం అనిపించలేదు. ఇంట్లో నానమ్మ, తల్లి చేసే పూజలు సహజంగానే పిల్లాడికి ఆసక్తిని పెంచి ఉంటాయిగా అనుకుని.. ' సరే.. పైకి వెళ్లి కట్టేసి వస్తా..' అని మెట్లెక్కసాగాడు. టింకూ మాట్లాడుతూనే ఉన్నాడు,, '.. స్కూల్లో ఫుల్ జోష్ డాడీ..అంతా జై శ్రీరామ్ అని.. అందరం భలే ఎంజాయ్ చేశాం..'' – చెబుతూనే ఉన్నాడు.. సరదాగా వింటూ మెట్లెక్కుతున్న తండ్రి కొడుకు మాటకు ఒక్కసారిగా మెట్లు జారిపోయినట్టుగా అనిపించింది.

–' ఇది ముస్లింలపై మన సక్సెస్... నాన్నా..!

పసి పిల్లాడి నోట మనది కాని మాట ..

క్లుప్తంగా...

గాంధీభవన్‌లో ఘనంగా..

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో 75వ గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు అంజన్‌కుమార్ యాదవ్, జగ్గారెడ్డి, సీనియర్ నేతలు వి.హనుమంతరావు, మధుయాష్కీ, కోదండరెడ్డి తదితరులు హాజరయ్యారు.

'అంకితభావంతోనే అడవుల పరిరక్షణ'

సాక్షి, హైదరాబాద్: అడవుల పరిరక్షణ విషయంలో అటవీశాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ సూచించారు. గణతంత్ర దినోత్సవం వేళ ప్రతి ఒక్కరూ సరిహద్దుల్లో వీర జవాన్ల త్యాగాలను గుర్తు చేసుకోవాలని, వారి స్ఫూర్తితో అభివృద్ధికి పునరంకితం కావాలని కోరారు. అరణ్య భవన్‌లో శుక్రవారం రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా డోబ్రియాల్ జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా గత యేడాది ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఆయన ప్రోత్సాహకాలను అందజేశారు.

డీజీపీ కార్యాలయంలో..

డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో గణతంత్ర దినోత్స వాన్ని శుక్రవారం ఘ నంగా నిర్వహించారు. రైల్వేస్, రోడ్ భద్రత అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ జాతీయజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డీఐజీ (కో–ఆర్డినేషన్) డాక్టర్ గజరావు భూపాల్, ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఇంటెలిజెన్స్ కార్యాలయంలో ఇంటెలిజెన్స్ చీఫ్, అడిషనల్ డీజీ బి.శివధర్ రెడ్డి, ఇతర పోలీసు విభాగాల్లో ఆయా విభాగాల అధిపతులు జాతీయ పతాకాలను ఎగురవేశారు.

– సాక్షి, హైదరాబాద్

చోటా నయీం తీన్మార్ మల్లన్న

• ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: 'నాపై ప్రభుత్వం కక్ష సాధించేలా ప్రవర్తిస్తున్నది..కేసు పెట్టడానికి నిత్యం ప్రయత్నం జరుగుతోంది. తీన్మార్ మల్లన్నను చోటా నయీంగా మారుస్తున్నారని' జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని యశ్వంతాపూర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని, మల్లన్న వసూళ్ల దందా మితిమీరిపోతుందని, పోలీసులు నిజం వైపు నిలబడాలన్నారు. గవర్నర్ బీజేపీ నాయకురాలిగా మాట్లాడుతున్నారని, ఆమె తన పదవికి రాజీనామా చేసి బీజేపీ తరఫున పోటీ చేసుకోవచ్చని హితవు పలికారు.కోదండరాం ఎమ్మెల్సీ పదవికి ఓకే చేసిన గవర్నర్.. గతంలో దాసోజు శ్రవణ్‌కు ఇవ్వకుండా ఎందుకు అడ్డుకున్నారో చెప్పాలన్నారు.

గవర్నర్‌కు ఇంగిత జ్ఞానం లేదు: కడియం

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా గవర్నర్ ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థలను నాశనం చేసిందని, యువతకు ఉద్యోగాలు రాలేదంటూ గవర్నర్ గణతంత్ర వేడుకల్లో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగ వ్యవస్థకు ప్రతినిధిగా ఉన్న గవర్నర్ ప్రభుత్వం తప్పు చేస్తే చక్కదిద్దేలా సూచనలు, సలహాలు ఇ వ్వాలని చెప్పారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్య లక్ష్మీఅంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న పల్లా, కడియం

ఆరు నెలల్లో 7,877 కేసుల పరిష్కారం

• గణతంత్ర వేడుకల్లో హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే వెల్లడి
• కొత్త జిల్లాల్లోనూ కోర్టు భవనాల నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: ఆరు నెలల్లోనే 7,877 కేసులను పరిష్కారించామని, ఈ విషయంలో న్యాయమూర్తులు, న్యాయవాదులతో పాటు ఇతర సిబ్బంది కృషి ప్రశంసనీయమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే కొనియాడారు. ఆన్‌లైన్ సేవలను మరింత చేరువ చేయడం, కాగిత రహిత ఫైలింగ్ వంటి అంశాలు కేసుల సత్వర పరిష్కారానికి దోహదం చేస్తున్నాయని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని సాంకేతిక సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైకోర్టు ప్రాంగణంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్త హైకోర్టు నిర్మాణానికి 100 ఎకరాలు కేటాయించడం హర్షణీయమన్నారు. త్వరలోనే భవన నిర్మాణం ప్రారంభం కానుందని, అందరికీ అన్ని వసతులు, సాంకేతికతతో నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. కొత్త జిల్లాల్లోనూ న్యాయస్థానాల నిర్మాణానికి ప్రభుత్వం భూములు కేటాయించిందన్నారు. ఈ జిల్లాల్లో అన్ని వసతులతో భవన నిర్మాణాలు జరిగేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


పతాక ఆవిష్కరణ అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ..

హైకోర్టు ఆవరణలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు సీజే జస్టిస్ అలోక్ అరాధే శుక్రవారం భూమిపూజ చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉన్నదన్నారు.

అమరులకు నివాళి..


గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం తన నివాసంలో జాతీయజెండా ఆవిష్కరించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లోని సైనిక అమరవీరుల స్మారక స్తూపాన్ని సందర్శించి శ్రద్ధాంజలి అర్పించారు.

– సాక్షి, హైదరాబాద్

అసెంబ్లీలో రిపబ్లిక్ డే వేడుకలు

భారత 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శాసనమండలి ప్రాంగణంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ ఆవరణలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జాతీయజెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు వాణీదేవి, ఎంఎస్ ప్రభాకర్, ఎల్.రమణ, రఘోత్తమ్‌రెడ్డి, దండె విఠల్, మహేశ్ కుమార్‌గౌడ్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, శాసనసభ వ్యవహారాల సలహాదారు ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కాగా, పద్మవిభూషణ్ అవార్డులు సాధించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రముఖ సినీనటుడు చిరంజీవి, పద్మశ్రీ అవార్డులు వరించిన దాసరి కొండప్ప, గడ్డం సమ్మయ్య, కూరెళ్ల విఠలాచార్యులు, ఆనందాచారి, కేతావత్ సోంలాల్, ఉమామహేశ్వరికి సుభేందర్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు.


గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ తదితరులు

– సాక్షి, హైదరాబాద్

ఐ ఫోన్ మాయం.. రెండు గంటల్లో అప్పగింత

హిమాయత్‌నగర్: ఓ వైద్యురాలు ఆటోలో ప్రయాణిస్తుండగా మొబైల్ పోగొట్టుకుంది. పోలీసులకు ఫిర్యాదు చేసిన రెండు గంటల్లోనే ఆమెకు తన మొబైల్‌ను అప్పగించారు పోలీసులు. ఈ సంఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డాక్టర్ ఆర్.స్వాతిష (కార్డియాలజీ)(23) హిమాయత్‌నగర్ వైపు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఆమె మొబైల్ ఐఫోన్ 11 పోగొట్టుకుంది. వెంటనే తన మొబైల్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. టీఎస్ఐ జి.వెంకటేష్ తన టీమ్‌తో కలిసి సీసీటీవీ ఫుటేజీ సాయంతో ఫిర్యాదు చేసిన రెండు గంటల్లోనే మొబైల్‌ను గుర్తించారు. ఆ వైద్యురాలికి తిరిగి తన ఐఫోన్‌ను ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ అందజేశారు. తన ఐఫోన్ రెండు గంటల్లోనే అందించడంతో పోలీసుల పనితీరును అభినందించి కృతజ్ఞతలు తెలిపి డాక్టర్ స్వాతిష తన ఆనందాన్ని పంచుకున్నారు.

500 మంది ఖైదీలకు రుణాలిచ్చాం

• జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు రుణాలు ఇచ్చిన ఘనత తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖకే దక్కుతుందని ఆ శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా వెల్లడించారు. శుక్రవారం చంచల్‌గూడలోని జైళ్ల శాఖ శిక్షణ సంస్థ (సీకా) మైదానంలో 75వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీజీ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా సౌమ్యా మిశ్రా మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమంతో పాటు ఖైదీల సంక్షేమానికి కూడా జైళ్ల శాఖ విశేష కృషి చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దాదాపు 500 మంది ఖైదీలకు రూ. 1.5 కోట్లు రుణాలు ఇచ్చిన్నట్లు తెలిపారు. చదువుపై ఆసక్తి ఉన్న ఖైదీలను డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటీ ద్వారా ప్రోత్సహించామన్నారు. రాష్ట్రపతి మెడల్ సాధించిన జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీధర్, జైలర్ రామయ్యను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఐజీలు యెర్రంశెట్టి రాజేష్, ఎన్. మురళీబాబు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ డా. శ్రీనివాస్, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్ గౌడ్ పాల్గొన్నారు.


జాతీయ జెండాకు వందనం చేస్తున్న డీజీ డా. సౌమ్య మిశ్రా

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బాహాబాహీ

తొర్రూరు: గణతంత్ర వేడుకల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బాహాబాహీకి దిగారు. మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని తొర్రూరు ఉన్నత పాఠశాల ఆవరణలో ఇదివరకే వంద అడుగుల ఎత్తున జాతీయజెండా ఏర్పాటు చేశారు. గణతంత్ర వేడుకల సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు అక్కడ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమయ్యారు. అధికార పార్టీ ఎమ్మెల్యేను ఆహ్వానించకుండా జాతీయ పతాకాన్ని ఎలా ఆవిష్కరిస్తారంటూ కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నేతలతో వాగ్వాదానికి దిగారు. జాతీయ పతాకాన్ని లాగేసి గొడవకు పూనుకున్నారు. సీఐ సత్యనారాయణ ఘటనాస్థలికి చేరుకుని ఇరు పార్టీల నాయకులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ నాయకులు ససేమిరా అనడంతో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

231 మంది ఖైదీలకు క్షమాభిక్ష!

• సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు గవర్నర్ ఆమోదం అని ప్రచారం • ధ్రువీకరించని జైళ్లశాఖ

సాక్షి, హైదరాబాద్: ఏళ్ల తరబడి విడుదల కోసం ఎదురు చూస్తున్న ఖైదీలకు ఈ ఏడాది స్వేచ్ఛ లభించే అవకాశం కనిపిస్తోంది. జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదల కసరత్తు జరుగుతోంది. సత్ప్రవర్తన గల ఖైదీల విడుదలకు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని, మంచి ప్రవర్తనగల ఖైదీలను కూడా గుర్తించాలని ఈనెల 24వ తేదీన ప్రభుత్వం జీవో 2ను జారీ చేసింది. ఈ మేరకు జైళ్లశాఖ ఉన్నతాధికారులు రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో ఉన్న సత్ప్రవర్తన కలిగిన ఖైదీల జాబితాను సిద్ధం చేసినట్టు తెలిసింది. మొత్తం 212 మంది జీవితఖైదు అనుభవిస్తున్న వారు, 19 మంది ఇతర శిక్షలు అనుభవిస్తున్నవారు కలిపి మొత్తం 231 మంది ఖైదీలను విడుదలకు అర్హులుగా గుర్తించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా గణతంత్ర దినోత్సవం రోజున ఖైదీల విడుదలకు గవర్నర్ ఆమోదం తెలిపినట్టు ప్రచారం జరిగింది. కానీ ఖైదీల విడుదలకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని జైళ్లశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రతిపాదనలు మాత్రమే ప్రభుత్వానికి వెళ్లాయని, వాటికి ఆమోదముద్ర పడలేదని చెపుతున్నారు. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో 194 మందిని, 2020లో దాదాపు వంద మంది జీవిత ఖైదీలను ప్రభుత్వం విడుదల చేసింది.

ట్రెసా కేంద్ర కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

సీసీఎల్ఏ కార్యాలయ ప్రాంగణంలోని ట్రెసా కేంద్ర కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆ సంఘం అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి జాతీయజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రెసా ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్‌తోపాటు సీసీఎల్ఏ సెక్రటరీ గంగాధర్, సీసీఎల్ఏ యూనిట్ ట్రెసా కార్యదర్శి ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, హైదరాబాద్

కరెంట్ షాక్‌తో ఇద్దరు మృతి

• గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి
• రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన మంత్రి సీతక్క

ములుగు: గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి చెందగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా కేంద్రంలోని శివాలయం ఎదుట శుక్రవారం యువజన సంఘాల సభ్యులు జెండా ఆవిష్కరించడానికి ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే జెండా స్తంభం 11కేవీ విద్యుత్ వైర్‌కు తగిలింది. దీంతో ల్యాడ విజయ్, బోడ అంజిత్‌కుమార్, బోడ కళ్యాణ్‌చక్రి షాక్‌కు గురయ్యారు. వెంటనే వారిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. విజయ్, అంజిత్‌కుమార్ మృతి చెందగా, స్వల్పగాయాలతో కళ్యాణ్‌చక్రి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క ఆస్పత్రికి చేరుకొని మృతుల కుటుంబాలను ఓదార్చారు. ప్రభుత్వం తరఫున ఆ రెండు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. తక్షణ సాయంగా రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గణతంత్ర వేడుకల సమయంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణ్‌చక్రికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులు ఉన్నారు.


మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి సీతక్క

నామినేటెడ్ ఇంకెప్పుడు?

• పదవులపై గంపెడాశలతో కాంగ్రెస్ ఆశావహులు
• అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్న సీఎం కార్యాలయం
• ఈనెల 27 తర్వాత ప్రకటించ వచ్చనే చర్చ
• పార్లమెంటు ఎన్నికల వరకు వాయిదా పడే అవకాశముందనీ ప్రచారం
• తొలిదఫాలో 9 నుంచి 18 కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ల ప్రకటనకు చాన్స్
• అద్దంకి దయాకర్‌కు ఆర్టీసీ చైర్మన్, అనిల్‌కు టీఎస్ఐఐసీ చైర్మన్ పదవులు!

సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 50 రోజులు గడుస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్ల చైర్మన్ పదవుల భర్తీ కోసం ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సీఎం రేవంత్‌కు సన్నిహితులైన నలుగురు నేతలకు ఇటీవలే ప్రభుత్వ సలహాదారులుగా కేబినెట్ హోదా కల్పించడం, ముఖ్యమంత్రి కూడా విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన నేపథ్యంలో నామినేటెడ్ పందేరం నేడో, రేపోననే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. దీనిపై రెండు రకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తొలిదఫా నామినేటెడ్ జాబితా ఖరారై పోయిందని, ఈనెల 27 తర్వాత ఏ క్షణమైనా ఈ పదవులను ప్రకటిస్తారని కొందరు చెబుతున్నారు. మరికొందరు మాత్రం తొలి జాబితా ఖరారైన మాట వాస్తవమే అయినా, ప్రకటన మాత్రం పార్లమెంటు ఎన్నికల తర్వాతే ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆశావహులు డోలాయమానంలో ఊగిసలాడుతున్నారు.


చాన్స్ ఎవరికో..?: నామినేటెడ్ పోస్టుల విషయంలో సరైన స్పష్టత లేనప్పటికీ ఎవరిని వరించే అకాశం ఉందనే దానిపై మాత్రం చర్చోపచర్చలు జరుగుతున్నాయి. పార్టీ అనుబంధ సంఘాల నేతలకు తొలి దఫాలో ప్రాధాన్యం ఉంటుందని భావిస్తుండగా.. వీరితో పాటు మరికొందరు పార్టీ నాయకులు, ఇటీవలి ఎన్నికల్లో టికెట్ ఆశించి దక్కని మరికొందరి నేతల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. శివసేనారెడ్డి (యూత్ కాంగ్రెస్), ఫహీం (ప్రొటోకాల్ కమిటీ), నాగరిగారి ప్రీతం (ఎస్సీ సెల్), ఎస్.అన్వేశ్‌రెడ్డి (కిసాన్ సెల్), చల్లా నర్సింహారెడ్డి (రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు), భూపతిరెడ్డి న ర్సారెడ్డి (టీపీసీసీ ప్రధాన కార్యదర్శి), ఎంఆర్‌జీ వినోద్‌రె డ్డి (టీపీసీసీ ఉపాధ్యక్షుడు), మన్నె సతీశ్ (సోషల్ మీడియా), అద్దంకి దయాకర్ (టీపీసీసీ ప్రధాన కార్యదర్శి), ఈరవత్రి అనిల్ (మాజీ ఎమ్మెల్యే), పటేల్ రమేశ్‌రెడ్డి (టీపీసీసీ ఉపాధ్యక్షుడు), కొండ్రు పుష్పలీల (టీపీసీసీ ఉపాధ్యక్షురాలు), మెట్టు సాయికుమార్ (ఫిషర్‌మెన్ సెల్), శ్రీరంగం సత్యం (టీపీసీసీ అధికార ప్రతినిధి)ల పేర్లు మొదటి దఫాలో వస్తాయనే ప్రచారం జరుగుతోంది. ఇందులో అద్దంకి దయాకర్‌కు ఆర్టీసీ చైర్మన్‌గా, ఈరవత్రి అనిల్‌కు టీఎస్ఐఐసీ చైర్మన్‌గా అవకాశమిస్తారని, కేబినెట్ హోదా కూడా కల్పిస్తారని అంటున్నారు. మాజీ మంత్రి పుష్పలీలను మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమిస్తారనే చర్చ జరుగుతోంది. మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు నేరెళ్ల శారద పేరు కూడా ఈ పోస్టు విషయంలో వినిపిస్తోంది. వీరితో పాటు వందలాది మంది నేతలు నామినేటెడ్ పోస్టు లను ఆశిస్తుండగా, కొందరికి మలి దఫాలో, ఇంకొందరికి ఇంకో దఫాలో అవకాశం వస్తుందని సీఎంవో వర్గాల సమాచారం. మొత్తం మీద తొలిదఫాలో 9 నుంచి 18 వరకు కార్పొరేషన్ల పదవులను ప్రకటిస్తారనే చర్చ జరుగుతోంది.

ఆశావహుల్లో అసంతృప్తి

సంక్రాంతికే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని సీఎం ప్రకటించినా ఇప్పటివరకు ఆ ప్రక్రియ ముందుకు కదలకపోవడంపై ఆశావహులు తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవులు పార్టీని అంటిపెట్టుకుని ఉన్న వారికి కాకుండా ఇతరులకు ఇవ్వడంపై కూడా అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ నేత, మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ బాహాటంగానే తన అసంతృప్తిని వెల్లడించారు. కాగా బూత్ స్థాయి నాయకుల సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను పలువురు నేతలు కలిసి తమకు పదవులెప్పుడంటూ అడిగినట్లు సమాచారం.

అట్టహాసంగా సాహిత్య సమ్మేళనం

• హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రారంభం
• మొదటి రోజు వర్క్‌షాప్స్, గ్యాలరీల సందడి
• పర్యావరణ పరిస్థితులపై నిపుణుల చర్చ
• మరో 2 రోజుల పాటు సాహిత్య, సాంస్కృతిక అంశాలపై చర్చలు



సాక్షి, హైదరాబాద్: నగరం వేదికగా హెచ్ఎల్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సాహిత్య–సాంస్కృతిక ఉత్సవం 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్' వైభవంగా ప్రారంభమైంది. హైటెక్‌సిటీలోని సత్వ నాలెడ్జ్ సిటీ వేదికగా దాదాపు 200 మందికి పైగా రచయితలు–సాహిత్యకారులు, విభిన్న రంగాలకు చెందిన కళాకారులు అన్నింటికీ మంచి వందల సంఖ్యలో పాల్గొన్న సాహిత్య అభిలాషకులు–ఔత్సాహికులతో మొదటి రోజు 'హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్' సందడిగా ప్రారంభమైంది. ఈ సాహిత్య ఉత్సవంలో అంతరించిపోతున్న భారతీయ భాషలు, సాహిత్యం–సంస్కృతి, సైన్స్ అండ్ సిటీ తదితర అంశాల్లో చర్చా కార్యక్రమాలను, ప్రత్యేక వర్క్‌షాప్‌లను, సామాజిక అంశాలను ప్రతిబింబించే ఆర్ట్ గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఈ ఫెస్టివల్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, జేఎన్ఏఎఫ్ఏయూ వంటి వివిధ సంస్థలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాకృతులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫెస్టివల్‌లో ప్రధానంగా ఏర్పాటు చేసిన స్టేజ్ టాక్‌లో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అధిపతి ఆకర్ పటేల్ పాల్గొని పలు అంశాలపైన చర్చించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, వాటి ప్రభావం గురించి ఆయన ప్రస్తావించారు. ఇటీవల తను దృష్టి సారించిన పని 'ఆఫ్టర్ మెస్సీయ' గురించి వివరించారు. మొదటి రోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం ఏర్పాటు చేసిన పర్వాజ్ ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో పరిక్రమిస్తున్న క్లైమేట్ చేంజ్ అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో నిపుణులు, సామాజిక వేత్తలు పాల్గొని మాట్లాడారు. అంతేకాకుండా కావ్యధార, స్టోరీ టెల్లింగ్, మూవింగ్ ఇమేజెస్ వంటి విభిన్న కార్యక్రమాలతో సాహిత్య పండుగ ఆసాంత కొనసాగింది. పుస్తక పరిచయాలు, పుస్తక ఆవిష్కరణలతో నిర్వహించిన కార్యక్రమాల్లో సాహిత్య అభిలాషకులు ఆసక్తిగా పాల్గొన్నారు. ప్యానెల్ చర్చలు, రీడింగ్‌లు, వర్క్‌షాప్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చలనచిత్ర ప్రదర్శనలతో కొనసాగే ఈ లిటరరీ ఫెస్టివల్ నేడు, రేపు కూడా కొనసాగనుంది. ఈ కార్యక్రమాల్లో ఔత్సాహికులకు ఉచిత ప్రవేశం ఉందని, సాహిత్య కళాభిలాషకులు ఎవరైనా పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.

చైన్ స్నాచింగ్‌కు మహిళ బలి

• ప్రతిఘటించడంతో గాయపరిచిన ఆగంతకుడు
• ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు మృతి

గజ్వేల్‌రూరల్: మహిళ మెడపై ఉన్న బంగారు ఆభరణాలను ఓ ఆగంతకుడు చోరీకి యత్నించాడు. ప్రతిఘటించేక్రమంలో ఆమెకు గాయాలై అపస్మారక స్థితిలో వెళ్లింది. ఆపై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొల్గూరులో చోటు చేసుకుంది. అడిషనల్ డీసీపీ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాల ప్రకారం..కొల్గూరుకు చెందిన చెన్న శ్రీనివాస్– శ్యామలత(55) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహాలు జరగ్గా, కొడుకు హైదరాబాద్‌లో జాబ్ చేస్తూ అక్కడే ఉంటున్నాడు. దంపతులిద్దరూ స్థానికంగా ఉంటూ కిరాణ దుకాణం నడుపుతున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటలకు నిద్రలేచిన శ్యామలత ఇంటి వెనుక భాగంలో ఉన్న డోర్ తీసి బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఇదే సమయంలో ఓ ఆగంతకుడు ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించాడు. శ్యామలత భర్త శ్రీనివాస్ బెడ్‌రూమ్‌లో నిద్రిస్తుండగా, ఆగంతకుడు తలుపులకు గొళ్లెం పెట్టాడు. బాత్‌రూమ్ నుంచి శ్యామలత ఇంట్లోకి వస్తున్న సమయంలో ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసు, చెవికి ఉన్న అరతులం కమ్మలను దొంగిలించేందుకు ప్రయత్నించాడు. శ్యామలత ప్రతిఘటించడంతో ఆమె ముఖంపై దిండు(మెత్త)ను అదిమిపట్టి ఆభరణాలను దొంగిలించాడు. ఈ క్రమంలోనే ఆమె చెవికి గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. భారతమ్మ పాలు పోసేందుకు వస్తుండగా, మంకీ క్యాప్ పెట్టుకున్న ఆగంతకుడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లడాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్లి బెడ్‌రూమ్ గొళ్లెం తీయగా భర్త శ్రీనివాస్ బయటకు వచ్చాడు. శ్యామలతను వెంటనే గజ్వేల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యుడు మెరుగైన చికిత్స అవసరమని చెప్పడంతో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ శ్యామలత మృతి చెందింది.



అవార్డు అందుకున్న రోజే హఠాన్మరణం

గుండెపోటుతో మున్సిపల్ మేనేజర్ మృతి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయ మేనేజర్ చెన్నమాధవ దివాకర్ (56) హఠాన్మరణం చెందారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్నారు. అనంతరం పట్టణంలోని అంబికానగర్‌లో గల తన ఇంటికి వెళ్లారు. అల్పాహారం తింటుండగా శ్వాస సమస్య తలెత్తడంతో కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దివ్యాంగుడైన దివాకర్‌కు భార్య నాగలక్ష్మి, కుమారులు మణికంఠ సాయి, గిరిధర్ సాయి ఉన్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన దివాకర్ 2003లో ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో టైపిస్ట్‌గా నియుక్తులయ్యారు. అంచెలంచెలుగా ఎదిగి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో స్థిరపడ్డారు. అవార్డు వచ్చిన ఆనందంలో ఇంటికి వెళ్లిన ఆయన గంట వ్యవధిలోనే మృత్యుఒడికి చేరడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.


కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న దివాకర్


శుక్రవారం గణతంత్ర వేడుకలకు గుర్రపు బగ్గీలో వస్తున్న రాష్ట్రపతి ముర్ము, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్


ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో ముచ్చటిస్తున్న మోదీ


కవాతులో పాల్గొన్న ఫ్రెంచి ఫారిన్ లెజియన్ జవాన్లు


అయోధ్య రామాలయ థీమ్‌తో ఉత్తరప్రదేశ్ శకటం

నారీశక్తి విశ్వరూపం

ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు | తొలిసారి మహిళలతో త్రివిధ దళాల కవాతు

- శకటాల నుంచి విన్యాసాల దాకా నారీభేరి
- సాయుధ పాటవానికీ అద్దం పట్టిన వేడుకలు
- ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్
- ముర్ముతో కలిసి గుర్రపు బగ్గీలో వేడుకలకు
- రంగుల తలపాగాతో ఆకట్టుకున్న మోదీ

న్యూఢిల్లీ: భారత 75వ గణతంత్ర వేడుకల్లో నారీ శక్తి వెల్లివిరిసింది. శుక్రవారం ఢిల్లీలో కర్తవ్య పథ్‌లో జరిగిన వేడుకలు మన సైనిక పాటవ ప్రదర్శనకు కూడా వేదికగా నిలిచాయి. దేశ ఘన సాంస్కృతిక చరిత్రకు అద్దం పట్టాయి. ఆర్మీ మిలిటరీ పోలీస్ విభాగానికి చెందిన కెప్టెన్ సంధ్య సారథ్యంలో తొలిసారిగా పూర్తిగా మహిళా సిబ్బందితో జరిగిన త్రివిధ దళాల కవాతు అందరినీ ఆకట్టుకుంది. నేవీ, డీఆర్‌డీఓ శకటాలతో పాటు మణిపూర్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, హరియాణా, ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి పలు రాష్ట్రాల శకటాలు కూడా ఆసాంతం నారీ శక్తికి అద్దం పట్టేలా రూపొందాయి. 265 మంది మహిళా సిబ్బంది మోటార్ సైకిళ్లపై ఒళ్లు గగుర్పొడిచేలా డేర్‌డెవిల్ విన్యాసాలు చేశారు. సంప్రదాయ మిలిటరీ బ్యాండ్ స్థానంలో కూడా ఈసారి 112 మంది మహిళా కళాకారులు శంఖం, నాదస్వరాలతో పాటు గిరిజన తదితర సంగీత వాయిద్యాలతో అలరించారు. బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ మొదలుకుని ఢిల్లీ పోలీస్, ఎన్‌సీసీ వంటి పలు విభాగాల కవాతులన్నీ పూర్తిగా నారీమయంగా మారి అలరించాయి. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ వీటన్నింటినీ ఆసాంతం ఆస్వాదిస్తూ కనిపించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి ఆయన సంప్రదాయ గుర్రపు బగ్గీలో ఆయన వేడుకలకు విచ్చేయడం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జరిగిన పరేడ్‌లో ముర్ము, మేక్రాన్ త్రివిధ దళాల వందనం స్వీకరించారు. 90 నిమిషాలకు పైగా జరిగిన వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు సైనిక దళాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. వణికించే చలిని, దట్టంగా కమ్మేసిన పొగ మంచును లెక్క చేయకుండా భారీ జనసందోహం వేడుకలను తిలకించింది. ఈసారి ఏకంగా 75 వేల మందికి పైగా గణతంత్ర వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించారు. మోదీ వారితో కలివిడిగా మాట్లాడుతూ గడిపారు. ఫొటోలు, సెల్ఫీలకు పోజులిచ్చారు. ఆయన ధరించిన రంగు రంగుల బంధనీ తలపాగా ఆహూతులను ఆకట్టుకుంది. మోదీ రాక సందర్భంగా భారత్ మాతా కీ జై అంటూ వారు చేసిన నినాదాలతో కర్తవ్య పథ్ మారుమోగింది. ఫ్రాన్స్‌కు చెందిన 95 మంది సభ్యుల కవాతు దళం, 30 మందితో కూడిన సైనిక వాయిద్య బృందం కూడా వేడుకల్లో పాల్గొన్నాయి. చివరగా వాయుసేనకు చెందిన 29 యుద్ధ విమానాలు, ఏడు రవాణా విమానాలు, 9 హెలికాప్టర్లు, ఒక హెరిటేజ్ ప్లేన్‌తో పాటు ఫ్రాన్స్ వైమానిక దళానికి చెందిన ఎయిర్‌బస్ ఏ330 మల్టీ ట్యాంకర్ రావాణా విమానం, రెండు రాఫెల్ ఫైటర్ జెట్లు చేసిన ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ విన్యాసాల్లో కూడా 15 మంది మహిళా పైలట్లు పాల్గొనడం విశేషం.


మహిళా డేర్‌డెవిల్స్ వీరోచిత విన్యాసాలు


అలరించిన నాగ్ మిసైల్ వ్యవస్థ

- వేడుకల్లో ప్రదర్శించిన టీ–90 భీష్మ ట్యాంకులు, నాగ్ మిసైల్ వ్యవస్థ, తేజస్ వంటి యుద్ధ వాహనాలు, ఆయుధాలను గుర్తించే రాడార్ వ్యవస్థ స్వాతి, డ్రోన్లను జామ్ చేసే వ్యవస్థ, అత్యాధునిక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థ, క్యూఆర్ఎస్ఏఎం తదితర క్షిపణులు అలరించాయి.


వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి ముర్ము


అసోం పోలీస్ మహిళా కమెండోల కవాతు


బీఎస్ఎఫ్ మహిళా బృందం కవాతు


పూర్తిగా మహిళలతో కూడిన సైనిక దళాల వైద్య సేవల విభాగం కవాతు

మోదీ నివాళులు

శుక్రవారం ఉదయం ప్రధాని మోదీ తొలుత నేషనల్ వార్ మెమోరియల్‌ను సందర్శించారు. దేశమాత రక్షణలో ప్రాణాలొదిలిన సైనిక వీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ముర్ము, మేక్రాన్ గుర్రపు బగ్గీలో వస్తున్న దృశ్యాలను కెమెరాలు, సెల్ ఫోన్లలో బంధించేందుకు జనం పోటీ పడ్డారు. అనంతరం జెండా వందనం, జాతీయ గీతాలాపన, 105 ఎంఎం దేశీయ శతఘ్నులతో 21 గన్ సెల్యూట్ అందరినీ ఆకట్టుకున్నాయి. భారత కీర్తి పతాకను వినువీధిలో ఘనంగా ఎగరేసిన చంద్రయాన్ థీమ్‌తో రూపొందిన శకటం అలరించింది. దాంతోపాటు అయోధ్య రామాలయ ప్రారంభం నేపథ్యంలో కొలువుదీరిన బాలక్ రామ్ శకటం ప్రధానాకర్షణగా నిలిచింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 16 శకటాలు, కేంద్ర శాఖలకు సంబంధించి 9 శకటాలు పరేడ్‌లో పాల్గొన్నాయి. వేడుకలు ముగిశాక మోదీ కర్తవ్య పథ్ పొడవునా కాలినడకన సాగి ఆహూతులను అలరించారు. మరోవైపు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కూడా గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్లు, ముఖ్యమంత్రులు తదితరులు వాటిలో పాల్గొన్నారు.

గొప్ప గౌరవం: మేక్రాన్

''గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనడం నాతో పాటు ఫ్రాన్స్‌కు కూడా గొప్ప గౌరవం. థాంక్యూ ఇండియా. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీతో పాటు భారత ప్రజలందరికీ గణతంత్ర దిన శుభాకాంక్షలు'' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పేర్కొన్నారు. వేడుకల అనంతరం ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. గణతంత్ర వేడుకల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా పాల్గొనడం ఇది ఆరోసారి కావడం విశేషం! ఈ వేడుకలకు దేశాధినేతలను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు నెల్సన్ మండేలా (1995లో) మొదలుకుని అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా (2015లో) దాకా ఎందరో అధినేతలు వీటిలో భాగస్వాములయ్యారు.

దేశాధినేతల అభినందనలు

బ్రిటన్ రాజు చార్లెస్ 3 మొదలుకుని ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు దాకా పలు దేశాల అధినేతలు భారత్‌కు 75వ గణతంత్ర దిన శుభాకాంక్షలు తెలిపారు. అభినందన సందేశాలతో సామాజిక వేదికల్లో పోస్టులు పెట్టారు. భారత్‌తో బ్రిటన్ సంబంధాలు నానాటికీ పటిష్టమవుతున్నాయని రాష్ట్రపతి ముర్ముకు పంపిన సందేశంలో కింగ్ చార్లెస్ హర్షం వెలిబుచ్చారు.

గాజాలో పౌరుల మరణాలను నివారించాలి

ది హేగ్: ఇజ్రాయెల్ ఆర్మీ– హమాస్ మధ్య పోరు కారణంగా గాజాలో తీవ్ర ప్రాణనష్టం సంభవిస్తుండటం, ప్రజలు అంతులేని వేదనకు గురికావడంపై అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) శుక్రవారం ఆందోళన వ్యక్తం చేసింది. యుద్ధం కారణంగా అక్కడ అమాయక ప్రజల మరణాలను, నష్టాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌ను కోరింది. అయితే, ఇజ్రాయెల్ ఆర్మీ గాజాలో యుద్ధం ద్వారా మారణహోమానికి పాల్పడుతోందన్న ఆరోపణలను కొట్టివేయరాదని ఐసీజే నిర్ణయించింది. గాజాలో వెంటనే కాల్పుల విరమణను ప్రకటించాలన్న ఉత్తర్వులను మాత్రం ఐసీజే ఇవ్వలేదు. తాజా ఉత్తర్వులు మధ్యంతర తీర్పు మాత్రమేనని చెబుతున్నారు. గాజాలో యుద్ధానికి విరామం ప్రకటించేలా, అక్కడి ప్రజలకు వెంటనే మానవతా సాయం అందేలా చూడాలని దక్షిణాఫ్రికా ఐసీజేలో కేసు వేసింది. దీని విచారణకు ఏళ్లు పట్టొచ్చని భావిస్తున్నారు.

నాటోలో స్వీడన్ చేరికకు తుర్కియే ఆమోదం

అంకారా: నాటోలో స్వీడన్ సభ్యత్వానికి తుర్కియే గురువారం అధికారికంగా ఆమోదం తెలిపింది. హంగేరీ కూడా ఓకే చెబితే నార్డిక్ దేశం స్వీడన్ నాటో దేశంగా మారిపోనుంది. ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు తుర్కియే పార్లమెంట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర నేపథ్యంలో ఫిన్లాండ్, స్వీడన్ నాటో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. నాటో సభ్యదేశమైన తుర్కియే ఫిన్లాండ్ సభ్యత్వానికి మాత్రమే సమ్మతం తెలిపింది. స్వీడన్ సభ్యత్వంపై అభ్యంతరం తెలుపుతూ వస్తోంది. వాటికి కూడా తగు పరిష్కారం దొరకడంతో తాజాగా ఆమోదం తెలిపింది. ఇక, నాటోలో స్వీడన్ చేరికపై హంగరీ పార్లమెంట్‌లో ఫిబ్రవరి ఆఖరులో చర్చించొచ్చని భావిస్తున్నారు.

రాజకీయాల్లోకి తమిళ నటుడు విజయ్?

చెన్నై: తమిళ నటుడు దళపతి విజయ్ రాజకీయ ప్రవేశానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకుగాను త్వరలోనే కొత్తగా రాజకీయ పార్టీని ప్రకటించనున్నారు. చెన్నైలో గురువారం జరిగిన విజయ్ అభిమానుల సంఘం 'విజయ్ మక్కల్ ఇయక్కమ్' సర్వసభ్య సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. విజయ్ అధ్యక్షతన ఏర్పాటయ్యే పార్టీకి నియమ నిబంధనలను ఖరారు చేసే అధికారం కూడా ఈ సమావేశం విజయ్‌కే వదిలేసింది. నెలలోగా పార్టీ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారని సమాచారం. తమిళనాడుతోపాటు కేరళలోనూ విజయ్‌కు భారీగా అభిమానులున్నారు. ఆయన పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారు. స్థానిక ఎన్నికల్లోనూ విజయ్ అభిమానుల సంఘం పోటీ చేసింది. 2026 ఎన్నికల్లో రాజకీయాల్లోకి ప్రవేశిస్తానంటూ గతంలోనే ఆయన ప్రకటించారు.

రేపే ఎన్డీఏలోకి నితీశ్?

- బీజేపీ మద్దతుతో మళ్లీ సీఎం!
- ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత సుశీల్
- రసకందాయంలో బిహార్ రాజకీయం

పట్నా/న్యూఢిల్లీ: బిహార్ రాజకీయం రసకందాయంలో పడింది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన అధికార మహాఘట్‌బంధన్ సంకీర్ణానికి జేడీ(యూ) సారథి, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గుడ్‌బై చెప్పి ఎన్డీఏ కూటమిలో చేరడం దాదాపుగా ఖాయమైందని తెలుస్తోంది. పాత నేస్తం బీజేపీతో మళ్లీ జట్టు కట్టి ఆయన కొత్తగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఆదివారమే నితీశ్ మరోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేయవచ్చని జేడీ(యూ) వర్గాలంటున్నాయి. రాష్ట్ర బీజేపీ అగ్ర నేత సుశీల్‌కుమార్ మోదీకి ఉప ముఖ్యమంత్రి పదవి దక్కనుందని సమాచారం. ''(నితీశ్‌కు ఇంతకాలంగా బీజేపీలోకి) మూసుకుపోయిన తలుపులు తెరుచుకోవచ్చు. రాజకీయాంటేనే అవకాశాల ఆటస్థలి. కనుక ఏదైనా సాధ్యమే'' అంటూ శుక్రవారం సుశీల్ చేసిన నర్మగర్భ వ్యాఖ్యలు కూడా ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. బిహార్ తాజా పరిణామాలపై రాష్ట్ర బీజేపీ చీఫ్ సమర్ద్ చౌదరి, సుశీల్‌కుమార్ ఇప్పటికే ఢిల్లీ వెళ్లి కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితర బీజేపీ అగ్ర నేతలతో చర్చలు జరిపి వచ్చారు. ఈ నేపథ్యంలో జేడీ(యూ)ను ఎన్డీఏలోకి తీసుకోవడంపై శని, ఆదివారాల్లో బిహార్ బీజేపీ రెండు రోజుల రాష్ట్ర



కార్యవర్గ సమావేశాల్లో చర్చించనున్నారు. ఆదివారమే పొత్తు నిర్ణయం వెలువడవచ్చని తెలుస్తోంది. ఆ రోజు ఉదయమే జేడీ(యూ) ఎమ్మెల్యేలతో నితీశ్ సమావేశం కానుండటం విశేషం! మరోవైపు 10 మంది దాకా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా బీజేపీతో టచ్‌లో ఉన్నట్టు వస్తున్న వార్తలు అధికార సంకీర్ణంలో కలకలం రేపుతున్నాయి.

నితీశ్ స్పష్టత ఇవ్వాలి: ఆర్జేడీ

సంకీర్ణంలో ప్రధాన భాగస్వామి అయిన ఆర్జేడీతో నితీశ్‌కు విభేదాల నేపథ్యంలో బిహార్‌లో రెండు రోజులుగా రాజకీయ రగడ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆయన ఎన్డీఏలో చేరతారన్న వార్తలు గురువారం కలకలం రేపాయి. జేడీ(యూ) నిష్క్రమిస్తే సంకీర్ణ ప్రభుత్వం మైనారిటీలో పడుతుంది. దాన్ని కాపాడుకునేందుకు అవసరమైన 8 మంది ఎమ్మెల్యేల కోసం ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. నలుగురు ఎమ్మెల్యేలున్న ఎన్డీఏ భాగస్వామి హిందూస్తానీ అవామ్ మోర్చా చీఫ్ జీతన్‌రామ్ మాంఝీతో శుక్రవారం మంతనాలు జరిపారు. మాంఝీ మాత్రం నితీశ్ కూడా త్వరలో ఎన్డీఏలోకి వస్తారని మీడియాతో చెప్పుకొచ్చారు! ఘట్‌బంధన్ సర్కారు ఒకట్రెండు రోజుల్లోనే కుప్పకూలడం ఖాయమని ఆయన కుమారుడు సంతోష్ జోస్యం చెప్పారు. మొత్తం ఉదంతంపై నితీశ్ తక్షణం స్పష్టమైన ప్రకటన చేసి ఊహాగానాలకు తెర దించాలని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా కోరడం విశేషం.

పొత్తిళ్లలో విడిపోయి 19 ఏళ్లకు కలిశారు

కవలలను కలిపిన టిక్‌టాక్ వీడియో

కన్న తల్లి ఒడిలో పెరిగి జంటగా ఆడుకోవాల్సిన కవల అమ్మాయిలు వీరు. కానీ విధి వారితో వింత నాటకం ఆడింది. ఆస్పత్రుల్లో పుట్టిన పసికందులను దొంగలించి పిల్లల్లేని జంటలకు అమ్మేసే ముఠా బారిన పడి కన్నతల్లి ప్రేమకు దూరమయ్యారు. ఎందరో చిన్నారులను మొబైల్‌ఫోన్‌కు అతుక్కుపోయేలా చేసే టిక్‌టాక్ వీడియో ఒకటి వీరిద్దరినీ మళ్లీ కలిపింది. అందుకు ఏకంగా 19 సంవత్సరాల సమయం పట్టింది. అచ్చం తనలా ఉన్న అమ్మాయిని చూసి ఎవరీమె? ఎందుకు నాలాగే ఉంది? అంటూ ఒకరిని వేధించిన ప్రశ్నలు చివరకు తన కవల సోదరి చెంతకు చేర్చాయి. ఈ గాథ ఐరోపాలోని జార్జియాలో జరిగింది...

ఈ కథ 2002 ఏడాదిలో జార్జియాలోని కీర్ట్‌స్కీ ప్రసూతి ఆస్పత్రిలో మొదలైంది. గోచా ఘకారియా దంపతులకు కవల అమ్మాయిలు పుట్టారు. వెంటనే తల్లి అజా షోనీకి తీవ్ర అస్వస్థతకు గురై కోమాలోకి వెళ్లింది. తను చనిపోతే పసికందులను పెంచడం తన వల్ల కాదని గోచా భావించాడు. ఇదే అదనుగా అక్కడున్న పిల్లల్ని దొంగలించే ముఠా అతనికి డబ్బులు ఎరవేసి పిల్లల్ని తీసుకెళ్లిపోయింది.

అచ్చం తనలా ఉండటంతో అవాక్కై..

పిల్లలను ఆ దొంగల ముఠా వేర్వేరు ప్రాంతాల్లోని వేర్వేరు కుటుంబాలకు పెద్ద మొత్తాలకు అమ్మేసింది. పెంపుడు తల్లిదండ్రులు ఆ చిన్నారులకు అమీ ఖవీటియా, అనో సర్టానియా అని పేర్లు పెట్టారు. చూస్తుండగానే పుష్కరకాలం గడిచిపోయింది. 12 వయసు ఉన్నప్పుడు అమీ 2014 సంవత్సరంలో ఓ రోజు టీవీలో తనకిష్టమైన ప్రోగ్రాంలో అచ్చం తనలా ఉన్న ఓ 12 ఏళ్ల అమ్మాయి డ్యాన్స్ చేయడం చూసి అవాక్కైంది.

కలిపిన టిక్‌టాక్

అమీకి కూడా డ్యాన్స్ అంటే ప్రాణం. డ్యాన్స్ నేర్చుకుంది. ఏడేళ్ల తర్వాత అమీ ఒక టిక్‌టాక్ వీడియో తీసి అప్‌లోడ్ చేసింది. అది తెగ వైరల్ అయింది. దానిని అమీ సొంతూరుకు 320 కిలోమీటర్ల దూరంలోని టిబిలిసీ నగరంలోని కవల సోదరి అనో సర్టానియా స్నేహితురాలు చూసింది. ఆ వీడియో సర్టానియోది అనుకుని భ్రమపడింది. సర్టానియోకు షేర్ చేసి విషయం కనుక్కోమని చెప్పింది. తనలాగా ఉన్న అమీ వీడియో చూసి సర్టానియోకు అనుమానం వచ్చింది. ఈమె నాకు బంధువు అవుతుందా? అసలు ఈ టీనేజర్ ఎవరు? అంటూ తను చదువుకునే విశ్వవిద్యాలయం వాట్సాప్ గ్రూప్‌లో పోస్టులుపెట్టేది. ఈ గ్రూప్‌లో అమీకి తెల్సిన వ్యక్తి ద్వారా ఒకరి ఫోన్ నంబర్ ఒకరికి అందింది. అందజేశారు. దీంతో అమీ, అనో



మొట్టమొదటిసారిగా మెసేజ్‌ల ద్వారా మాట్లాడుకోవడం మొదలైంది.

ఎన్నెన్నో పోలికలు

వేర్వేరు కుటుంబ వాతావరణాల్లో పెరిగినా ఇద్దరి అభిరుచులూ ఒకటే. డ్యాన్స్ ఇష్టం. హెయిర్ స్టైల్ ఒక్కటే. ఇద్దరికీ ఒకే జన్యు సంబంధమైన వ్యాధి ఉంది. సర్టిఫికెట్లలో పుట్టిన తేదీ కూడా చిన్న తేడాతో దాదాపు ఒకేలా చూపిస్తోంది. ఒకే వయసు ఉన్నారు. సర్టిఫికెట్లలో ఆస్పత్రి పేరు కూడా ఒక్కటే. ఇన్ని కలవడంతో తాము కవలలమేమో అని అనుమానం బలపడింది. కానీ ఇరు కుటుంబాల్లో 'నువ్వు మా బిడ్డవే' అని చెప్పారుగానీ కొనుక్కున్నాం అనే నిజం బయటపెట్టలేదు. వీళ్ల మొండిపట్టు చూసి నిజం చెప్పేశారు. కానీ వీళ్లు కవలలు అనే విషయం వారికి కూడా తెలీదు. ఎందుకంటే వీరికి అమ్మిన ముఠా సభ్యులు వేర్వేరు. దీంతో తమ కన్న తల్లిదండ్రులు ఎవరనేది మిస్టరీగా ఉండిపోయింది. పెంచలేక వదిలేశారని అనో ఆగ్రహంతో రగిలిపోయింది. కన్న వారిని ఎలాగైనా కనిపెట్టాలని అమీ మాత్రం పలు వెబ్‌సైట్లు, గ్రూప్‌లలో అన్వేషణ ఉధృతం చేసింది. ఇందుకోసం సొంతంగా ఫేస్‌బుక్ పేజీని ప్రారంభించింది.

మూడో తోబుట్టువు!

ఆ నోటా ఈనోట విన్న ఒక టీనేజర్.. అమీకి ఫోన్ చేసింది. తన తల్లి 2002లో ఒక మెటర్నిటీ ఆస్పత్రిలో కవలలకు జన్మనిచ్చిందని, వారు పుట్టగానే చనిపోయారని తల్లి ఓసారి తనతో చెప్పిందని అమీకి వివరించింది. వెంటనే అమీ అక్కడికి వెళ్లి ఆ టీనేజర్, ఆమె కన్నతల్లి డీఎన్ఏ టెస్టులు చేయించింది. అవి తమ డీఎన్ఏలతో సరిపోలాయి. అలా ఎట్టకేలకు 19 ఏళ్ల వయసులో లీపెగ్ నగరంలో కవలలు కన్నతల్లిని కలిసి తనివి తీరా కౌగిలించుకున్నారు. దాంతో ఆమెకు నోట మాట రాలేదు. కోమా నుంచి కోలుకున్నాక మీరు చనిపోయారని భర్త చెప్పాడని కన్నీరుమున్నీరైంది. ఈ మొత్తం ఉదంతం తాజాగా వెలుగు చూసింది.

లక్షల శిశు విక్రయాలు

ట్యాక్సీ డ్రైవర్లు మొదలు ఆస్పత్రి సిబ్బంది, అవినీతి అధికారులదాకా ఎందరో ఇలా జార్జియాలో పెద్ద వ్యవస్థీకృత ముఠాగా ఏర్పడి లక్షల మంది పసికందులను ఆస్పత్రుల్లో మాయం చేశారని అక్కడి మీడియాలో సంచలనాత్మక కథనాలు వెల్లడయ్యాయి. దీనిపై ప్రస్తుతం జార్జియా ప్రభుత్వం సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

నైట్రోజన్ గ్యాస్‌తో మరణ శిక్ష అమలు

ప్రపంచంలో తొలిసారిగా నూతన శిక్షను అమలుచేసిన అమెరికా

అట్మోర్(అమెరికా): మూడు దశాబ్దాల క్రితం వేయి డాలర్ల సుపారీ తీసుకుని ఒక మహిళను హత్యచేసిన కేసులో దోషికి అమెరికా నూతన పద్ధతిలో మరణశిక్షను అమలుచేసింది. 58 ఏళ్ల కెన్నెత్ ఎజీన్ స్మిత్ స్వచ్ఛమైన నైట్రోజన్ వాయువును పీల్చేలాచేసి మరణశిక్షను అమలుచేసింది. ఇలా నైట్రోజన్‌గ్యాస్‌ను వాడి దోషికి మరణశిక్షను అమలుచేయడం ప్రపంచంలోనే తొలిసారి కావడం గమనార్హం. అమెరికాలోని అలబామా రాష్ట్రంలో ఈ శిక్షను స్థానిక కాలమానం ప్రకారం గురువారం రాత్రి అమలుచేశారు. అమెరికాలో 1982 ఏడాది నుంచి విషం ఇంజెక్షన్‌తో దోషులకు మరణశిక్షను అమలుచేయం మొదలెట్టాక మరో నూతన శిక్షా విధానాన్ని అమల్లోకి తేవడం ఇదే తొలిసారి.

ఎలా అమలుచేశారు?: అట్మోర్ నగరంలోని హోల్‌మ్యాన్ కరెక్షన్ ఫెసిలిటీలో నైట్రోజన్ హైపోక్సియా శిక్ష అమలు ప్రక్రియను ఐదుగురు మీడియా ప్రతినిధులను తీసుకెళ్లి చూపించారు. నైట్రోజన్ గ్యాస్ నింపిన సిలిండర్ పైపును దోషి స్మిత్ ముక్కుకు బిగించిన మాస్క్ ద్వారా శరీరంలోకి పంపించారు. స్వచ్ఛమైన నైట్రోజన్ గ్యాస్ అనేది ప్రాణాధారమైన ఆక్సిజన్‌ను శరీరకణాలకు అందకుండా చేస్తుంది. దీంతో కణాలు ఆక్సిజన్ లేక క్షణాల్లోనే మృతిచెందుతాయి. దీంతో మరణం సంభవిస్తుంది. రాత్రి 7.53 గంటలకు గ్యాస్‌ను పంపించారు. 8.25 గంటలలోపు అతను మరణించినట్లు ప్రకటించారు.



ఏమిటీ కేసు?: చార్లెస్ సెన్నెట్ అనే మతాధికారి 1980లలో భారీగా అప్పులుచేశాడు. భార్యను చంపేస్తే బీమా సొమ్ము వస్తుందని ఆమె హత్యకు పథకం వేశాడు. చార్లెస్ నుంచి సుపారీ తీసుకుని జాన్ ఫారెస్ట్ పార్కర్, స్మిత్ ఆయన భార్య ఎలిజబెత్‌ను చంపేశారు. వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చాత్తాపంతో చార్లెస్ ఆత్మహత్య చేసుకున్నాడు. 2010లో పార్కర్‌కు అమలు శిక్షను అమలుచేయగా తాను నిర్దోషినంటూ ఇన్నాళ్లు స్మిత్ కోర్టుల చుట్టూ తిరిగారు. జ్యూరీ జీవితఖైదు సిఫార్సుచేయగా జడ్జి ఏకంగా మరణశిక్ష విధించారు. ఇంతవరకూ లేని కొత్త విధానంలో శిక్ష అమలు చేయాలని ఆదేశాలిచ్చారు. దీనిపై గురువారం అమెరికా సుప్రీంకోర్టులో వాదనలు నడిచాయి. ఇంతవరకు వాడని, క్రూరమైన, అసాధారణ శిక్షా విధానాన్ని ఎలా అమలుచేస్తారని స్మిత్ లాయర్లు వాదించినా శిక్ష అమలుకే కోర్టు పచ్చజెండా ఊపింది.

జ్ఞానవాపి మసీదులో దేవతా విగ్రహాలు

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదు కింద పురాతన హిందూ ఆలయ అవశేషాలున్నాయంటూ కోర్టుకు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) సమర్పించిన సర్వే నివేదికలో మరికొన్ని అంశాలు వెలుగులోకి వచ్చాయి. శివలింగం భాగాలు, హిందూ దేవతల ధ్వంసమైన విగ్రహాలు మసీదులో ఉన్నాయి. వాటి ఫొటోలు తాజాగా జాతీయ మీడియాకు లభించాయి. హనుమాన్, గణేష, నంది విగ్రహాల ఫొటోలు, కొన్ని పానవట్టాలు, కిందిభాగం లేని శివలింగం వాటిలో ఉన్నాయి. శతాబ్దాల నాటి నాణేలు, పర్షియన్ లిపి సున్నపురాయి శాసనం, రోలు ఉన్నాయి. మసీదు కింద భారీ ఆలయముండేదని నివేదిక నిరూపిస్తోందని హిందువుల తరఫు న్యాయవాది విష్ణుశంకర్ జైన్ చెప్పారు. ఆలయ రాతిస్తంభాలనే కాస్త మార్చి మసీదు నిర్మాణంలో వాడారని నివేదికలో ఉందన్నారు. ''17వ శతాబ్దంలో ఔరంగజేబు ఇక్కడి ఆదివిశ్వేశ్వర ఆలయాన్ని కూల్చేసినట్లు నివేదికలోని ఆధారాలు బలంగా చాటుతున్నాయి. దీన్ని బట్టి ఇక్కడ ఒక ఆలయం ఉండేదని స్పష్టమవుతోంది'' అని ఆయన చెప్పారు. దీనితో అంజుమన్ అంజామియా మసీదు కమిటీ ప్రతినిధి అఖ్లాఖ్ అహ్మద్ విభేదించారు. ''ఇందులో కొత్తేమీ లేదు. గతంలోనూ అవి ఉన్నాయని ఏఎస్ఐ తెలిపింది. తాజా నివేదికలో వాటి కొలతలను స్పష్టంగా పేర్కొంది. అవి పురాతనమైనవని చెప్పే ఆధారాలను ఏఎస్ఐ ప్రస్తావించలేదు. ఆ రాళ్ల వయసు ఎంత అనే అంశాలపై ఏఎస్ఐ ఇంకా ఎలాంటి నిర్ధారణకు రాలేదు. సర్వేలో ఉన్నవన్నీ ఏఎస్ఐ అభిప్రాయాలు మాత్రమే. అవి నిపుణుల అభిప్రాయాలు కాదు'' అని ఆయన వాదించారు. గత ఏడాది జిల్లా కోర్టు ఆదేశాల మేరకు ఏఎస్ఐ మసీదు కాంప్లెక్స్‌లో శాస్త్రీయసర్వే చేపట్టి గత ఏడాది డిసెంబర్ 18వ తేదీన సీల్డ్ కవర్‌లో సర్వే నివేదికను సమర్పించింది. తాజాగా కోర్టు వాటిని కేసులో భాగమైన ఇరుపక్షాల ప్రతినిధులు, న్యాయవాదులకు అందజేశారు. దీంతో నివేదికలోని అంశాలు బహిర్గతమయ్యాయి.

సాక్షి
కరీంనగర్
శనివారం । 27 । జనవరి । 2024







కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ



పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో..



జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో..



ఎమ్మెల్యే కమలాకర్ క్యాంపు కార్యాలయంలో..



శాతవాహన యూనివర్సిటీలో..



నగరపాలక సంస్థ కార్యాలయంలో..



జిల్లా పరిషత్ కార్యాలయంలో..



జిల్లా కారాగారంలో..

జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి





మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తూ..

ప్రగతి పథంలో జిల్లా

• త్యాగధనుల పోరాటమే మన జీవనం • సమగ్రాభివృద్ధిలో భాగస్వాములుకండి • మహిళా సంక్షేమానికి పెద్దపీట • గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ పమేలా సత్పతి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఆకట్టుకున్న కస్తూర్బా విద్యార్థినుల ప్రదర్శన



రాణి రుద్రమ వేషధారణలో చిన్నారి

కరీంనగర్/కరీంనగర్‌కల్చరల్: జిల్లాను అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చేసే దిశగా తీసుకుంటున్న నిర్ణయాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించి, త్రివర్ణ పతాకం ఆవిష్కరించారు. స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వివిధ స్టాళ్లు పరిశీలించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు తిలకించారు. అంతకుముందు కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం భారతీయులందరికీ గొప్ప జాతీయ పండుగ అన్నారు. ప్రభుత్వ పథకాలు జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లో అన్నివర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని సూచించారు.

మహాలక్ష్మితో ఉచిత ప్రయాణం

మహిళలకు గౌరవం, ఆత్మరక్షణ, భద్రతను కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో బాలికలు, మహిళలు, థర్డ్‌జెండర్లు ఉచితంగా ప్రయాణం చేసేలా మహాలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 09 డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు 98,46,585మంది ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. జిల్లాలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన వారందరికీ రూ.10 లక్షల వైద్యసాయం అందించడం జరుగుతోందని అన్నారు. జిల్లాలోని 19 ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రుల ద్వారా ఇప్పటి వరకు 1,751 మంది రాజీవ్ వైద్య సాయం పొందినట్లు వివరించారు. ప్రజాపాలనలో జిల్లావ్యాప్తంగా 3,22,264 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని ఆన్‌లైన్ చేస్తున్నామని, అర్హులైన వారికి సాయం అందేలా చూస్తామని అన్నారు.

'స్నేహిత'తో భరోసా...

జిల్లాలోని చిన్నారులందరూ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు 'స్నేహిత' కార్యక్రమం గత సంవత్సరం జనవరి 10న ప్రారంభించామన్నారు. జిల్లాలోని 128 ఉన్నత పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు బహుముఖ వ్యూహంతో అమలు చేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 6,709ఫిర్యాదులను స్వీకరించగా అందులో 6,388 ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేసేందుకు పూర్తి సహకారం అందిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మేయర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తున్న జిల్లా జడ్జి, పోలీసు కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రత్యేక ప్రదర్శనలిచ్చిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. 'మన బడులు చదువులమ్మ గుడులు' నాటికకు ప్రత్యేక స్పందన లభించింది. ఈ నాటికలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్నికల్లో మహిళా సంఘాల పాత్ర అనే అంశంపై అవగాహన కల్గించేలా స్వప్న బృందం ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాటిక ఆలోచింపజేసింది. జిల్లా అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఫైర్ విన్యాసాలు అబ్బురపరిచాయి. అనంతరం స్వాతంత్ర సమర యోధులను సన్మానించారు. ఎంపీ బండి సంజయ్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ వై.సునీల్‌రావు, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీసీపీ రాజు, ఆర్డీవో మహేశ్వర్, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



బండి సంజయ్‌ని పలుకరిస్తున్న కలెక్టర్



స్టాల్‌లో ఆహార పదార్థాలు పరిశీలిస్తూ..



స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం



విద్యార్థుల ప్రదర్శన



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తూ..

న్యూస్‌రీల్

29న బల్దియా కౌన్సిల్ సమావేశం

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నారు. గత నెల 30వ తేదీన సమావేశం జరగాల్సి ఉండగా ప్రజాపాలన కార్యక్రమం నేపథ్యంలో వాయిదాపడింది. ఆ సమావేశాన్ని ఈనెల 29వ తేదీన నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన నిర్వహించనున్నారు.

మరోసారి పోలీసు కస్టడీకి ఇద్దరు

కరీంనగర్‌క్రైం: భూమి ఆక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో రిమాండ్‌లో ఉన్న కార్పొరేటర్ తోటరాములు, చీటీ రామారావును పోలీసులు శుక్రవారం ఉదయం మరోసారి కస్టడీకి తీసుకున్నారు. సదరు కేసులో లోతుగా విచారణ జరపడం కోసం కస్టడీకి తీసుకున్నట్లు తెలిసింది. పలు డాక్యుమెంట్లు పరిశీలించి, వివిధ కోణాల్లో విచారణ జరిపినట్లు తెలిసింది. శనివారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం తిరిగి జైలుకు పంపించనున్నట్లు సమాచారం. ఇది వరకు ఒకసారి కస్టడీకి తీసుకోగా, పూర్తిస్థాయి సమాచారం కోసం శుక్రవారం కస్టడీకి తీసుకున్నట్లు తెలిసింది.

ప్రజాపాలన లెక్క తేలింది!

- వంట గ్యాస్, రూ.2500కు భారీగా అర్జీలు
- ఆన్‌లైన్‌లో వివరాల నిక్షిప్తీకరణ పూర్తి
- దరఖాస్తులపై ఫిబ్రవరిలో ఇంటింటా సర్వే





వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

కరీంనగర్ అర్బన్: ప్రజాపాలనలో వేటికెన్ని అర్జీలొచ్చాయో లెక్క తేలింది. జిల్లాలో ఆన్‌లైన్ ప్రక్రియ ఇటీవలే ముగియగా మహాలక్ష్మి పథకానికి అత్యధిక అర్జీలు వచ్చాయని స్పష్టమవుతోంది. గత నెల 28 నుంచి ఈ నెల 6వరకు గ్రామాల్లో, పట్టణాల్లో రోజువారీగా అర్జీలు స్వీకరించగా వెల్లువలా దరఖాస్తులు వచ్చిన సంగతి విదితమే. సదరు దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవగా ఇక క్షేత్ర స్థాయి పరిశీలన మిగిలింది.

తస్మాత్ జాగ్రత్త

లక్షల మంది అర్జీలు ఇచ్చిన క్రమంలో ఆరు గ్యారంటీల సాకుతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడే అవకాశముందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి ఓటీపీలు అడుగుతున్నట్లు సమాచారముందని అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అపరిచితులు పంపించే లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దని, ఓటీపీలను చెప్పవద్దని చెబుతు మోసానికి గురైతే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలంటున్నారు.

ఫిబ్రవరిలో క్షేత్రస్థాయి పరిశీలన

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవగా ఫిబ్రవరిలో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనుంది. అనర్హులను ఏరివేసి అర్హులకు ప్రయోజనం చేకూర్చనున్నారు. లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయి పరిశీలన కీలకమవటంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆరు గ్యారంటీల అమలుకు ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క చైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీని నియమించింది. ఇందులో సభ్యులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్‌బాబు ఉన్నారు. నిజమైన లబ్ధిదారులకు అభయహస్తం పథకాలు అందించటమే లక్ష్యంగా సబ్ కమిటీ పనిచేయనుంది. సదరు కమిటీ గైడ్‌లైన్స్ ప్రకారం క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

జిల్లాలో గ్రామాలు: 313
మున్సిపాలిటీలు: 5
వచ్చిన అర్జీలు: 3,22,264 (రేషన్ కార్డులకు కలిపి)
గ్యారంటీలకు వచ్చిన అర్జీలు: 3,21,246
మొత్తంగా కవరైన నివాసాలు: 3,12,186

ఆన్‌లైన్‌తో తేలిన లెక్క ఇదీ

రూ.2500కు వచ్చిన అర్జీలు: 2,26,401
రూ.500కు గ్యాస్‌కు: 2,77,292
ఇందిరమ్మ ఇండ్లకు: 2,17,180
గృహజ్యోతికి: 2,35,091
రైతు భరోసాకు: 1,02,172
రైతు కూలీలకు: 1,11,187

కరీంనగర్ నుంచే ఎన్నికల శంఖారావం

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్



ఎస్సారార్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని కరీంనగర్ నుంచే పూరించబోతున్నామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ నెల 28న కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో 20వేల మందితో పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సమ్మేళనం నిర్వహించబోతున్నామన్నారు. శుక్రవారం సాయంత్రం ఎస్సారార్ కళాశాల మైదానంలో సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వస్తున్న సందర్భంగా జిల్లా అధికారులు, పోలీసులతో సమీక్షించారు. 28న మధ్యాహ్నం ఒంటి గంటకు షా కరీంనగర్ చేరుకుని సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలపై మార్గదర్శనం చేయడంతో పాటు ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం పూరించనున్నారని తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి పార్లమెంట్ నియోజకవర్గపరిధిలో యాత్ర ప్రారంభించి గ్రామాల్లో పాదయాత్ర చేస్తానని తెలిపారు.

చెక్కు చెదరని రాజ్యాంగం భారత్ సొంతం

చెక్కు చెదరని భారత రాజ్యాంగాన్ని అందించిన ఘనత బాబా సాహెబ్ అంబేద్కర్‌దేనని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఎంపీ కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవి, పద్మశ్రీకి ఎంపికైన కూరెళ్ల విఠలాచార్య, గడ్డం సమ్మయ్య, కేతావత్ సోమ్‌లాల్, వేలు ఆనందచారి, దాసరి కొండప్పకు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు.

317 జీవోను సవరిస్తారా? లేదా?

ఉద్యోగుల జీవితాలను చిన్నాభిన్నం చేసిన 317 జీవోను సవరిస్తారా? లేదా? స్పష్టం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లాశాఖ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. కట్టా రాజేశం, అంబటి వెంకన్న, వెంకటరమణారావు, శ్రీనివాస్, సుధాకర్, రామస్వామి, కృష్ణగోపాల్, ఉదయ్ కిరణ్‌రావు, నరసింహారెడ్డి, కే.ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డెంగీతో వార్డు సభ్యురాలు మృతి


స్వరూప (ఫైల్)

మానకొండూర్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన వార్డు సభ్యురాలు అమ్మిగల్ల సరిత(30) గురువారం రాత్రి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సరిత స్థానిక కస్తూరిబా విద్యాలయంలో కొద్ది రోజులనుంచి వంటపని చేస్తోంది. వారం రోజుల క్రితం తీవ్ర జ్వరం రాగా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ తగ్గకపోవడంతో ప్రైవేటు హాస్పిటల్, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

స్వగ్రామానికి యువకుడి మృతదేహం


చెన్నకేశవరెడ్డి (ఫైల్)

రామడుగు(చొప్పదండి): విదేశాల్లో ఉద్యోగం చేసి ఉన్నత స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో లండన్ వెళ్లిన యువకుడు గుండెపోటుకు గురై మృతిచెందిన ఘటన రామడుగు మండలం దత్తోజీపల్లిలో విషాదం నింపింది. వివరాలు.. దత్తోజీపల్లి గ్రామానికి చెందిన గంట్ల రాధ-శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు గంట్ల చెన్నకేశవరెడ్డి (27) మూడేళ్ల క్రితం ఓ కంపెనీలో ఉద్యోగం కోసం లండన్ వెళ్లాడు. మూడునెలల క్రితం స్వగ్రామానికి వచ్చి మళ్లీ వెళ్లాడు. అక్కడ ఉద్యోగం చేస్తుండగా పదిరోజుల క్రితం గుండెపోటుకు గురై మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం మృతదేహం స్వగ్రామానికి చేరగా దహనసంస్కారాలు నిర్వహించారు. చెన్నకేశవరెడ్డి మృతదేహం ఇంటికి చేరుకోగానే కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్డులో స్వామి వివేకానంద విగ్రహం వద్ద సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలైనాయి. స్థానికుల వివరాలు.. మున్సిపల్ పరిధి దిమ్మక్కపేటకు చెందిన వృద్ధుడు ఇల్లందుల పోచయ్య సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా, వేములవాడ డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తూ పోచయ్యను ఢీకొట్టడంతో ఎగిరి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బ్లూకోల్ట్స్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కేసు నమోదు

జమ్మికుంట(హుజూరాబాద్): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రమేశ్ తెలిపారు. జమ్మికుంట మున్సిపల్‌కు చెందిన బచ్చు సాయికృష్ణ ఓ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం పని చేస్తున్నాడు. ఓ కంపెనీ పంపిన లింక్‌ను క్లిక్ చేశాడు. దీంతో కొంత డబ్బులు వారు అందించారు. మరోసారి షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టాలని తెలుపగా, సాయికృష్ణ పలుమార్లు రూ.లక్షా 85 వేల వరకు చెల్లించాడు. కంపెనీ నుంచి డబ్బు తిరిగి రాకపోయేసరికి మోసపోయానని గుర్తించి శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పట్టు నిలుపుకున్న 'పాడి'

- జమ్మికుంట మున్సిపాలిటీని నిలబెట్టుకున్న గులాబీ నేత


పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే

హుజూరాబాద్: జమ్మికుంట అవిశ్వాసం కథ సుఖాంతమైంది. ఎన్నో మలుపులు తిరిగిన పురపాలక రాజకీయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన పట్టు నిలుపుకోగలిగారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం పురపాలికలు ఒక్కొక్కటిగా కాంగ్రెస్ వశం అవుతున్న వేళ, జమ్మికుంట మున్సిపాలిటీలోనూ ముసలం పుట్టింది. కౌన్సిలర్లలో పలువురు హస్తం పార్టీ వైపు వెళ్లేందుకు ప్రయత్నాలు సాగించారు. ఈ క్రమంలో అవిశ్వాసం అనివార్యంగా మారింది. చివరకు గురువారం జరిగిన అవిశ్వాసంలో జమ్మికుంట మున్సిపాలిటీని బీఆర్‌ఎస్ నిలబెట్టుకోగలిగింది. చివరి నిమిషం వరకు క్షణక్షణం ఉత్కంఠ రేపిన అవిశ్వాసంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తనదైన మార్క్ చూపించారు. గులాబీ పార్టీకి వ్యతిరేకంగా క్యాంపు నిర్వహించిన శిబిరంలో ఉన్న వారంతా ఎమ్మెల్యేతో టచ్‌లోనే ఉండడం గమనార్హం. ఈ విషయాన్ని పాడి ఇటీవల కలక్టరేట్‌లో చెప్పిన విషయాన్ని అంతా గుర్తు చేస్తున్నారు. అందుకే ×కౌన్సిలర్లు అంతా ఎక్కడ ఉన్నా.. వారి మనసు మాత్రం మాతోనే ఉంది అంటూ ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారని పునరుద్ఘాటిస్తున్నారు. కౌశిక్ చూపిన సమయస్ఫూర్తితో గులాబీ సీనియర్లతో సైతం శభాష్ కౌశిక్ అని ప్రశంసలు అందుకుంటున్నాడు.

అవిశ్వాసానికి చెక్ ఇలా..

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావుపై కాంగ్రెస్ కౌన్సిలర్లు కొందరు అవిశ్వాసానికి దరఖాస్తు చేశారు. హైదరాబాద్ శివారులోని ఓ రిసార్టులో శిబిరం ఏర్పాటు చేసి బీఆర్‌ఎస్ చైర్మన్‌ను గద్దెదింపే ప్రయత్నం చేశారు. వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రంగంలోకి దిగారు. కలెక్టర్‌ను కలిసి కౌన్సిలర్లకు పార్టీ పరంగా విప్ జారీ చేశారు. ఒకవైపు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా సమయస్ఫూర్తి, వ్యూహం, ఎత్తుగడలతో అవిశ్వాసం వీగిపోయి చైర్మన్ పదవి బీఆర్‌ఎస్ చేజారకుండా కాపాడుకోగలిగారు.

మానవత విలువలు లేకుండా అవిశ్వాసం పెట్టారు


మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట(హుజూరాబాద్): మానవత విలువలు లేకుండా తన కూతురు వివాహం రోజు అవిశ్వాసం పెట్టి క్షోభకు గురి చేశారని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తన నివాసంలో మాట్లాడారు. 29 రోజుల క్రితం ఒక్కరిద్దరి ప్రోద్బలంతో 23వ కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య అవిశ్వాసం పెట్టారని ఆరోపించారు. తాను పాలకవర్గంతో మమేకమై గతం కంటే పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. కష్టకాలంలో తన వెంట ఉండి సహకరించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కౌన్సిలర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కోసం పని చేస్తామని, సహచర కౌన్సిలర్లు కలిసిరావాలని కోరారు. అనంతరం చైర్మన్‌ను నాయకుడు గర్రెపెల్లి అరుణ్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి గజమాలతో సత్కరించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘునాథ్‌రావు


మాట్లాడుతున్న అధికారులు

కరీంనగర్: మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికులకు కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో ఎలాంటి ఇక్కట్లు లేకుండా చూడాలని కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘునాథ్‌రావు సూచించారు. మేడారం మహాజాతర ఫిబ్రవరి 18 నుంచి 25 వరకు జరుగనున్న నేపథ్యంలో 11 డిపోలకు చెందిన డీఎంలు, మెకానిక్ సూపర్‌వైజర్లతో శుక్రవారం బస్‌స్టేషన్ కాంప్లెక్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు ఎక్కడికక్కడ సమన్వయంతో ముందుకు సాగాలని దిశానిర్దేశనం చేశారు. వనదేవతల జాతరకు లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా రవాణా సౌకర్యం, భక్తులకు విడిది, ఇతరత్రా ఏర్పాట్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఆర్‌ఎం సుచరిత, వివిధ విభాగాల అధికారులు సుగుణాకర్, భూపతిరెడ్డి, కె.సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎం.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకముందు ఆర్టీసీ ఈడీ రఘునాథరావు కరీంనగర్ బస్‌స్టేషన్‌లో బస్సులను, ప్రయాణికుల రాకపోకలను పరిశీలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



మానకొండూర్: మండలంలోని సదాశివపల్లి తీగలవంతెన సమీపంలో బోరగుట్ట వద్ద శుక్రవారం కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్థానికుల కథనం మేరకు.. హనుమకొండకు చెందిన కె.శ్రీపాల్‌రెడ్డి కొమురంభీం జిల్లా సిర్పూర్-కాగజ్‌నగర్‌లో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని తన కారులో హనుమకొండ వెళ్తుండగా మార్గమధ్యలో ముందు టైర్ పగిలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కి సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతిన్నది. తహసీల్దార్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది.


కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్


లక్ష్మీకిరణ్, అదనపు కలెక్టర్ | మహేశ్వర్, ఆర్డీవో | స్వరూపరాణి, డీసీ, మున్సిపల్ | పవన్‌కుమార్, జెడ్పీ సీఈవో | శ్రీలత, డీఆర్‌డీవో | వి.పద్మావతి, డీడీ మార్కెటింగ్ ఆఫీసర్

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస

75వ గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. విధుల్లో ఉత్తమ సేవలందించిన అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి ప్రశంసాపత్రాలు అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్


నవీన్‌కుమార్, జీఎం డీఐసీ | సరస్వతి, డీడబ్ల్యూవో | పవన్‌కుమార్ డీఎండబ్ల్యూవో, ఇన్‌చార్జి డీఆర్‌వో


టి.వెంకన్న, ఫైర్ ఆఫీసర్ | లలితాదేవి, డీఎంహెచ్‌వో | బి.రవీందర్, పీడీ మెప్మా | ఆంజనేయులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ | వేణుమాధవ్, బల్దియా కమిషనర్, కొత్తపల్లి | శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, జమ్మికుంట | జి.ప్రణీత్‌కుమార్, ఎస్‌ఏ | ఎస్.మన్‌మీత్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ | ఎండీ షరీఫ్, ఎస్‌ఏ | ఎండీ అజారుద్దీన్ కౌసర్, ఎస్‌ఏ


సుజాత, ఎస్‌ఏ | కనుకయ్య, తహసీల్దార్ | సి.ప్రతాప్, ఏసీపీ | జి.తిరుమల్, సీఐ | పి.చేరాలు, ఎస్సై | పి.లక్ష్మారెడ్డి, ఎస్సై | ఎస్.సాంబమూర్తి, ఎస్సై | డాక్టర్ శ్రీకీర్తన, మెడికల్ ఆఫీసర్ | జి.ఎషికాశ్రీ | శ్రీనివాస్, కానిస్టేబుల్


దివ్యదర్శన్‌రావు, ఎంపీడీవో | సుధాకర్‌రెడ్డి | శారద | మంజుల, బాలభవన్ | నాగలక్ష్మి, ఎంవీఐ | రజనీ, ఏఎంవీఐ | సురేశ్, ఆర్‌ఐ | అజయ్‌కందాల్ | బి.లచ్చయ్య, ఎస్‌ఏ | స్వర్ణలత

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం


శేఖర్ (ఫైల్)

కరీంనగర్‌క్రైం: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన బైర శేఖర్(22) తన తల్లితో పాటు విద్యానగర్‌లో నివసిస్తూ కూలీ పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో పని ఉండడంతో శుక్రవారం ఉదయం సిరిసిల్ల బైపాస్ రోడ్డులో బైక్‌పై వెళ్తున్నాడు. ఐటీ టవర్ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అక్కడే ఉన్న విద్యుత్ స్తంభానికి తాకడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శేఖర్ తండ్రి గతంలోనే చనిపోయాడు. ఇద్దరు అక్కలు ఉండగా వారికి వివాహమైంది. చేతికంది వచ్చిన ఒక్కగానొక్క కుమారుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరుగా రోదించింది.

వ్యాన్ ఢీకొని ఒకరు..

కరీంనగర్‌రూరల్: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వెనక నుంచి వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మతిచెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. నగునూర్ గ్రామానికి చెందిన అలకుంట సాయిలు(66) బండ కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు టీ తాగేందుకు ఇంటి నుంచి మెయిన్ రోడ్డు వద్దకు వెళ్తుండగా వెనక నుంచి వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ..

జమ్మికుంట(హుజూరాబాద్): బైక్, ట్రాలీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మండలంలోని సైదాబాద్ గ్రామానికి చెందిన ముష్కమల్ల మహేందర్ (42) జమ్మికుంట పట్టణంలో ట్రాన్స్‌పోర్టు హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16న రాత్రి పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ సమీపంలో గుర్తు తెలియని ట్రాలీ ఢీకొనడంతో తీవ్ర గాయాలైనాయి. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య రమ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్‌క్రైం: జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రేకుర్తిలో నిర్వహించిన దాడుల్లో గంజాయి పట్టుబడినట్లు సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన సమీర్‌బేగ్, షేక్ రిజ్వాన్, రహీమ్‌చావూస్ వద్ద 703 గ్రాముల గంజాయి పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సై శ్రీనివాస్, మోసిన్, కుమార్‌యాదవ్, ఖాసింబి, కమలాకర్, కమలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.

ఆలనాపాలన చూసే తల్లి మృతి

- తండ్రికి అనారోగ్యం
- దిక్కుతోచని స్థితిలో దివ్యాంగ కుమారుడు


రాములు, ఆంజనేయులు

కోనరావుపేట(వేములవాడ): ఆ యువకుడు దివ్యాంగుడు.. తండ్రికి అనారోగ్యం.. ఏ పనికీ వెళ్లలేరు.. దీంతో తల్లే కూలీ పని చేస్తూ ఇద్దరి ఆలనాపాలన చూసేది. హఠాత్తుగా ఆమె చనిపోవడంతో వారు దీనంగా చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన మేర్గు గౌరవ్వ-రాములు దంపతులకు కుమారుడు ఆంజనేయులు ఉన్నాడు. అతను దివ్యాంగుడు. రాములు కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఇద్దరూ ఏ పనీ చేయలేరు. దీంతో గౌరవ్వ కూలీ పనులకు వెళ్తూ వారిని చూసుకునేది. గురువారం రాత్రి ఆమెకు గుండెపోటు రావడంతో మృతిచెందింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ తండ్రీకుమారుడిని చూసి స్థానికులు కంటతడి పెట్టారు. వారిని దాతలు ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

స్వప్నకాలనీలో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


పరిశీలిస్తున్న ఏసీపీ మహేశ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి స్వప్నకాలనీలోని ఓ ఇంట్లో దొంగలుపడ్డారు. ఎస్సై విజేందర్, బాధితుల వివరాల ప్రకారం.. స్వప్నకాలనీలో నివాసం ఉంటున్న శోభారాణికి ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు సింగాపూర్, చిన్నకొడుకు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. మూడురోజుల క్రితం ఆరోగ్యం బాగాలేక శోభారాణి కరీంనగర్ ఆసుపత్రిలో చేరింది. చికిత్స పొంది శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలకొట్టి ఉంది. బీరువాలోని 27తులాల బంగారు ఆభరణాలు, రూ.38వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఉన్నా దొంగలు వాటి రికార్డు తాలూకు డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటన స్థలాన్ని ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐ జగదీశ్ పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌లతో దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి వృద్ధుడు మృతి

ఎలిగేడు(పెద్దపల్లి): ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కెనాల్‌లో పడి మృతిచెందగా, మృతదేహం ఎలిగేడు మండలం ముప్పిరితోట శివారులో లభ్యమైంది. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ, మృతుడి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణానికి చెందిన మత్స్యకారుడు పారుపల్లి నర్సింహులు(60) గురువారం సాయంత్రం ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాల్వలో చేపలు పట్టేందుకు వెళ్లి కాలుజారి కెనాల్‌లో పడి కొట్టుకుపోయాడు. అతడికి ఈత వచ్చినా కెనాల్‌లో నీటి ప్రవాహం, ఉధృతికి ఫలితం లేకుండాపోయింది. నర్సింహులు ఇంటికి రాకపోయేసరికి అనుమానం వచ్చిన కటుంబసభ్యులు కెనాల్‌లో వెతికినా కనిపించలేదు. శుక్రవారం మృతదేహం ఎలిగేడు మండలం ముప్పిరితోట శివారులో తేలింది. స్థానిక రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి కొలనూర్ గ్రామానికి చెందిన యాదవసంఘం నాయకుడు బావు ఎల్లయ్య(75) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాలు.. వికలాంగుడైన ఎల్లయ్య కరీంనగర్‌లో త్రీచక్ర వాహనం కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా చల్మెడ ఆస్పత్రి వద్ద ఎదురుగా వస్తున్న లారీని అదుపుతప్పి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటన స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, బొంగోని రాజయ్యగౌడ్, దివాకర్, యాదవ సంఘం నాయకులు బాధిత కుటుంబసభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు.


జెండా వందనం చేస్తున్న పీసీసీ కార్యదర్శి అంజన్


కరీంనగర్‌లోని విద్యుత్ భవన్‌లో..


టీఎన్జీవో భవన్‌లో..


ఆర్టీసీ బస్టాండ్‌లో జెండా ఎగురవేస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.రఘునాథ్‌రావు


సీపీఐ కార్యాలయంలో..


సీఐటీయూ ఆధ్వర్యంలో...


తెలంగాణ భవన్‌లో జెండా వందనం చేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

మది నిండా జాతీయ జెండా

వాడవాడల మువ్వన్నెల జెండా సగర్వంగా రెపరెపలాడింది. ప్రతీ మదిలో జాతీయభావాన్ని నింపింది. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం కరీంనగర్‌తోపాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జెండాకు వందనం చేసి జాతీయ గేయాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అతిపెద్దదని కొనియాడారు. మహాత్మాగాంధీ, బీఆర్.అంబేడ్కర్ వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ సమైక్యతను చాటేలా నినాదాలు చేస్తూ ప్రదర్శనలు చేశారు. పలువురు గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యతను వివరించగా..పలు క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా స్కూల్‌లో జరిగిన వేడుకల్లో చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాధన్ పాల్గొన్నారు. – కరీంనగర్/సప్తగిరికాలనీ/కరీంనగర్‌కార్పొరేషన్/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి


ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో..


కొత్తపల్లి ఎంపీపీ ఆఫీసులో..


కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో..


పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..


ఏబీవీపీ ఆధ్వర్యంలో..


మెడికవర్ ఆస్పత్రిలో..


కాపువాడలో..


సెయింట్ జార్జి స్కూల్‌లో..


చెర్లభూత్కూర్ ప్రాథమిక పాఠశాలలో..


మర్చంట్ అసోసియేషన్ బిల్డింగ్ ఆవరణలో..


ప్రభాత్‌భేరీలో సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు


చెర్లభూత్కూర్‌లో జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

విద్యాసంస్థల్లో..


మానేరు స్కూల్‌లో..


అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో..


బిర్లా స్కూల్‌లో వేడుకలు


గోపాల్‌పూర్‌లోని శాతవాహన స్కూల్‌లో..


పారమితలో..


భగవతి విద్యార్థుల నృత్య ప్రదర్శన


వాణినికేతన్ పాఠశాల విద్యార్థుల ర్యాలీ


అచీవర్స్ పాఠశాల విద్యార్థుల ర్యాలీ


బ్లూబెల్స్ పాఠశాలలో..


వివిధ వేషధారణలో 'వసంత వ్యాలీ' విద్యార్థులు


రేకుర్తిలోని ప్యారడైజ్ హైస్కూల్‌లో..



జాన్సన్ కోరా విద్యార్థుల నృత్య ప్రదర్శన



వివిధ వేషధారణలో 'హొవెల్స్' విద్యార్థులు

సెయింట్ జాన్స్ స్కూల్‌లో..

క్లుప్తంగా

గ్రామపంచాయతీ భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్, జెడ్పీటీసీ లలిత

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. ప్రధాన రహదారి పక్కన ఏడాదిక్రితం రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన భవన నిర్మాణ పనులు పూర్తికానప్పటికీ సర్పంచ్ పదవీకాలం ఈనెలాఖరుతో ముగుస్తుండటంతో ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పురుమల్ల లలిత, ఉప సర్పంచ్ మాచర్ల సత్యనారాయణ, ఎంపీటీసీలు వెంగల్‌దాసు శ్రీనివాస్, బదరున్నీసా, పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా, వార్డుసభ్యులు తోట కిరణ్‌కుమార్, వరాల శ్రీనివాస్,జక్కినపల్లి శంకర్,గాదె శ్రీనివాస్, ఇస్తియాక్ అహ్మద్, నాయిని సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో సంబరాలు



కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు శుక్రవారం నగరంలోని తెలంగాణచౌక్‌లో తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ఉద్యమకారులకు సరైన గౌరవం దక్కిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జేఏసీ, తెలంగాణ జనసమితి నాయకులు బండి చంద్రశేఖర్, వెంకటమల్లయ్య, పెంచాల శ్రీనివాస్, రాములు, ఆంజనేయరావు, ఫయాజ్ అలీ, సుదర్శన్, శ్రీనివాస్, కుమారస్వామి, నాగేందర్‌సింగ్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కర్షక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం నగరంలో కార్మిక సంఘాల నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి తెలంగాణ చౌక్ వరకు కొనసాగిన ర్యాలీలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పానగంటి కేదారిలు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా కుదించారని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తుందని విమర్శించారు. ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌లో కార్మిక, కర్షక ఐక్యత చాటి కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, రాజు పాల్గొన్నారు.

'అక్రమ కేసులు పెట్టింది బీఆర్‌ఎస్సే'

కరీంనగర్ కార్పొరేషన్: అధికారంలో ఉండగా ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టింది బీఆర్‌ఎస్ పార్టీయేనని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా పోలీసు కేసులు పెడుతోందని బీఆర్‌ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడా అక్రమ కేసులు పెట్టడం లేదని, చట్టప్రకారమే నడుచుకొంటోందన్నారు. తన గ్రామంలో అనుమతి లేకుండా పార్టీ జెండా గద్దెను నిర్మించనీయకుంటే అక్రమంగా కేసు పెట్టారని గుర్తు చేశారు. అలాగే అప్పటి ఎమ్మెల్యే రవిశంకర్ ప్రోద్బలంతో తన భర్త ప్రభుత్వ ఉద్యోగి వెంకటరాంరెడ్డి ఇంక్రిమెంట్లు తొలగించారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తనతోపాటు ఎంతో మందిపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. అలాంటిది ఇప్పుడు కవిత అక్రమ కేసులు పెడుతున్నారంటూ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

'కళారంగంపై జిల్లా యంత్రాంగం వివక్ష'

కరీంనగర్‌కల్చరల్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంసాపత్రాల ప్రదానంలో భాగంగా జిల్లా యంత్రాంగం వివక్ష చూపిందని, సాంస్కృతిక, సాహితీ, క్రీడా రంగాలకు చెందిన వ్యక్తులను విస్మరించిందని జానపద వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జి.కృపాదానం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు అవార్డులిస్తుంటే ప్రత్యేక మంత్రి, ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఉన్న ఈ శాఖకు సంబంధించిన ఒక్కరికి కూడా వేడుకల్లో ప్రశంసాపత్రం ఇవ్వకపోవడంతో కళాకారులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, క్రీడాకారులను ఇకనైనా గుర్తించాలని తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉప సర్పంచ్ దామరపల్లి దామోదర్‌రెడ్డి రూ.23వేలతో కొనుగోలు చేసిన 340 స్టీల్‌ప్లేట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్, వార్డుసభ్యులు హన్మంతరావు, అరుణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ ప్రచార రథయాత్ర


ప్రచార రథయాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

కరీంనగర్: ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని కోర్టు చౌరస్తా వద్ద శుక్రవారం భారత రాజ్యాంగ ప్రచార రథయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగమే ఈ దేశానికి రక్ష అని, రాజ్యాంగ ప్రాముఖ్యతను ప్రభుత్వమే బోధించాలని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీపౌరుడిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సాధన జంగం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాధ్యులు శ్రీకాంత్, స్టూడెంట్ వింగ్ నాయకులు సదానందం, రాకేశ్, రాజేంద్రప్రసాద్, బాబు, శ్రీకాంత్, నాగరాజు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ పాలకవర్గానికి సన్మానం

వీణవంక: జీపీ పాలకవర్గ పదవీకాలం ఈ నెలతో ముగిస్తుండటంతో మండలంలోని పలు గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులను జీపీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నర్సింగాపూర్‌లో సర్పంచ్ గంగాడి సౌజన్యతిరుపతిరెడ్డిని ప్యాక్స్ చైర్మన్ మవ్వురం విజయభాస్కర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. సర్పంచ్‌లు మోరె సారయ్య, గంగాడి సౌజన్య, ఎంపీటీసీ మోరె స్వామి, కోఆప్షన్ సభ్యులు రవీందర్‌రావు, సత్యనారాయణ, ఉపసర్పంచ్ చొప్పరి తిరుపతి, పాల్గొన్నారు.

స్వాగత తోరణం ప్రారంభం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో గ్రామపంచాయతీ నిధులు రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన స్వాగత తోరణం కమాన్‌ను శుక్రవారం సర్పంచ్ జక్కం నర్సయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కూకట్ల తిరుపతి, పంచాయతీ కార్యదర్శి సల్మాన్, ఏఎంసీ డైరెక్టర్ శివనాధుని వెంకటేశ్వర్లు, వార్డుసభ్యులు మాదాసు శివరామకృష్ణ, మైలారం శ్రీనివాస్, చింతపూల శ్రీనివాస్, మహేశ్వరి, రజిత, నాయకులు డి.అంజిరెడ్డి, ఎస్.మల్లారెడ్డి, టి.ఎల్లారెడ్డి, డి.నారాయణ, బి.జగన్మోహన్‌రావు, ఎం. నాగరాజు, సాయిలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామం ఏకశిల పాఠశాల పదో తరగతి విద్యార్థిని జి.స్పందన ఈనెల 28న విజయవాడలో నిర్వహించే జాతీయస్థాయి సైన్స్ ప్రదర్శనల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దినేశ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, స్టాఫ్ ఇన్‌చార్జి నరేశ్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఓటుహక్కుపై అవగాహన

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మంగతాయారు ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగించుకొనే విధానం వివరించారు. ఓటుహక్కు ద్వారా తొమ్మిదో తరగతి విద్యార్థులు తమ తరగతి గది ప్రతినిధిని ఎన్నుకున్నారు. కేంద్రీయ విద్యాలయం పరీక్షాపే చర్చ టాపిక్‌లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించిన వి. శివ, అవంతిక ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు నిర్వహించిన పెయింటింగ్, వ్యాసరచన ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఇన్నోవేషన్ అవార్డు ప్రదానం

చొప్పదండి: తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఐసీ ద్వారా ఇంటింటి ఇన్నోవేషన్ అవార్డులు ప్రకటించింది. మండలంలోని పెద్దకుర్మపల్లి గ్రామానికి చెందిన మావురం మల్లికార్జున్‌రెడ్డి శుక్రవారం గణతంత్ర దినోత్సవాల్లో అవార్డు అందుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి అవార్డులు ప్రకటించగా సర్పంచ్ తొట్ల గంగమల్లయ్య, ఉప సర్పంచ్ దామోదర్‌రెడ్డి, కార్యదర్శి పద్మలత అవార్డును రైతుకు అందించారు. మోటారు ద్వారా నేరుగా పొలానికి ఫెర్టిలైజర్స్, ఆర్గానిక్ ద్రవా లను పంపించే సులభతర మార్గం రూపొందించినందున మల్లికార్జున్‌రెడ్డి అవార్డుకు ఎంపికయ్యారు. గ్రామీణ స్థాయి నుంచి ఆవిష్కరణలను బయటకు తీసుకొచ్చేందుకు అవార్డులు ప్రకటించిందని రైతు తెలిపారు.

సాక్షి యూనిట్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు


జెండా ఎగురవేస్తున్న బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని సాక్షి యూనిట్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ వైద శ్రీనివాస్ జాతీయ పతాకం ఎగురవేశారు. జెండా వందనం చేసి జాతీయ గీతం ఆలపించారు అనంతరం సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ అసిస్టెంట్ మేనేజర్ మధుకర్‌రెడ్డి, ప్రొడక్షన్ అసిస్టెంట్ మేనేజర్ ఓంప్రకాశ్, తిమ్మాపూర్ రిపోర్టర్ బత్తుల రాకేశ్, సబ్‌ఎడిటర్లు సంపత్, వీర్రాజు కార్యాలయ సిబ్బంది, సెక్యూరిటీ తదితరులు పాల్గొన్నారు.

కమలం కసరత్తు తెలంగాణ నుంచే

- రేపు దేశంలోనే తొలి బీజేపీ లోక్‌సభ క్లస్టర్ సమావేశం
- మహబూబ్‌నగర్ భేటీకి హాజరుకానున్న అగ్రనేత అమిత్ షా
- ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్న కేంద్రమంత్రి



29న భేటీలకు ఛుగ్, మీనన్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ పార్లమెంటు ఎన్నికల కసరత్తు తెలంగాణ నుంచే ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా ఎంపీ సీట్లను 143 క్లస్టర్లు (మూడు, నాలుగేసి సీట్ల చొప్పున)గా, రాష్ట్రంలోని 17 సీట్లను 5 క్లస్టర్లుగా పార్టీ విభజించింది. ఈ నేపథ్యంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా మహబూబ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించనున్న క్లస్టర్ (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ ఎంపీ సీట్లు) ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశానికి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. అలాగే కరీంనగర్ క్లస్టర్ (కరీంనగర్, జహీరాబాద్, మెదక్, చేవెళ్ల స్థానాలు)కు చెందిన కరీంనగర్ ఎంపీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్, ఆ పైస్థాయి కార్యకర్తలు దాదాపు 20 వేల మందితో భేటీ కానున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మహిళా వృత్తి నిపుణులు, వివిధ రంగాల ప్రముఖులు, మేధావులతోనూ సమావేశం కానున్నారు.

వచ్చే ఏప్రిల్ లేదా మేలో లోక్‌సభ ఎన్నికలు జరగొచ్చుననే అంచనాల నేపథ్యంలో పూర్తిస్థాయి సన్నద్ధతపై పార్టీ నాయకత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఆదివారం అమిత్ షా పాలమూరులో వచ్చే ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణ, వ్యూహంపై నాయకులు, కార్యకర్తలకు వివరించనున్నారు. కరీంనగర్‌లో.. పోలింగ్ బూత్ కమిటీ, ఆ పైస్థాయి కార్యకర్తలు ఇంటింటికీ (జనసంపర్క్ అభియాన్) వెళ్లి పదేళ్లలో మోదీ సర్కార్ సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించి, కమలం గుర్తుకు ఓటేయాల్సిందిగా కోరేలా దిశానిర్దేశం చేయనున్నారు. హైదరాబాద్‌లో జరిగే మహిళా వృత్తినిపుణుల సమ్మేళనంలోనూ బీజేపీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన కార్యక్రమాలు వివరించడం ద్వారా మహిళల మద్దతును కూడగట్టే ప్రణాళికను అమలు చేయనున్నారు. దీనికి కొనసాగింపుగా ఈ నెల 29న జరిగే కరీంనగర్ క్లస్టర్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశానికి పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ హాజరుకానున్నారు. అదేరోజు ఆదిలాబాద్ ఎంపీ క్లస్టర్ (ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్ సీట్లు) పరిధిలో నిర్వహించనున్న ఎన్నికల నిర్వహణ కమిటీ భేటీలో జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్ పాల్గొననున్నారు.

టికెట్లకు పోటీ

ఒకవైపు పార్టీ ఎన్నికలకు సమాయత్తం అవుతుంటే మరో టికెట్ల కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. అయితే సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లో సిట్టింగ్ ఎంపీలనే మళ్లీ పోటీకి దింపే అవకాశాలున్నాయని తెలుస్తోంది. మిగతా 13 స్థానాల్లో వివిధ రూపాల్లో నిర్వహించే సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని సమాచారం. మోదీ ఆకర్షణ, అభివృద్ధి నినాదం పనిచేస్తుందన్న అంచనాల నేపథ్యంలో.. తెలంగాణలో మెజారిటీ ఎంపీ సీట్లలో బీజేపీ గెలిచే అవకాశాలున్నాయని పార్టీ నాయకత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. రాష్ట్రంలోని అయిదారు మంది సిట్టింగ్ ఎంపీలు బీజేపీ వైపు చూస్తున్నట్టు బీజేపీ నేతలు చెబుతున్నారు. వారు ఇప్పటికే పార్టీ నాయకత్వంతో టచ్‌లోకి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఇలావుండగా రాష్ట్రంలోని మొత్తం 17 సీట్లలో 5 బీసీలకు, 3 రెడ్డి, 5 ఎస్సీ.. ఎస్టీ, వెలమ, కమ్మ, బ్రాహ్మణ, లింగాయత్ లేదా వైశ్య సామాజిక వర్గాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల విశ్వసనీయ సమాచారం.

అమిత్ షా పర్యటన షెడ్యూల్

- ఆదివారం ఢిల్లీ నుంచి ఐఏఎఫ్ ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.05 నిమిషాలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి బీఎస్ఎఫ్ హెలికాప్టర్‌లో 1.40కి మహబూబ్‌నగర్‌కు చేరుకుంటారు.
- 2.40 దాకా సుదర్శన్ ఫంక్షన్ హాల్లో జరిగే క్లస్టర్ మీటింగ్‌లో పాల్గొంటారు
- తర్వాత హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.55కు కరీంనగర్‌కు చేరుకుంటారు.
- సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ఎస్ఆర్ఆర్ కాలేజీలో జరిగే సమావేశంలో పాల్గొంటారు.
- 6 గంటలకు హైదరాబాద్ చేరుకుని, 6.15 నుంచి 7.05 వరకు జీఆర్‌సీ కన్వెన్షన్ హాలులో మహిళా వృత్తి నిపుణులు, ఇతరులతో భేటీ అవుతారు.
- రాత్రి 7.45 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళతారు.

యుద్ధానికి 'సిద్ధం'!

నేడు 'భీమిలి'లో ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న ఏపీ సీఎం జగన్

- 175కు 175 అసెంబ్లీ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యం
- టీడీపీ–జనసేన పొత్తుల జిత్తులు.. కుతంత్రాలను చిత్తు చేసేందుకు శ్రేణులకు దిశానిర్దేశం



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/తగరపువలస (విశాఖ జిల్లా) : రాష్ట్రంలో రానున్న ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారు. ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఒంటరిగా ఎదుర్కోలేక జనసేన సహా వివిధ పార్టీల జెండాలతో జతకట్టి.. కుటుంబాలను చీల్చుతూ పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను చిత్తుచేసి, విజయభేరి మోగించడానికి.. పార్టీ శ్రేణులను సిద్ధం చేయడానికి ఆయన నడుం బిగించారు. ఇందుకు 'సిద్ధం' పేరుతో రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో నాలుగు చోట్ల పార్టీ శ్రేణులతో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదటి సభను ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం సంగివలసలో శనివారం నిర్వహిస్తున్నారు. ఈ సభకు ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి భారీఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకానున్నారు. సుమారుగా 15 ఎకరాల స్థలంలో ఈ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అంతేకాక.. నియోజకవర్గాల వారీగా పలువురు కార్యకర్తలతో కూడా సీఎం ముఖాముఖి మాట్లాడనున్నారు. ఇక మ.3.30 గంటల నుంచి సా.5 వరకూ ఈ బహిరంగ సభ జరుగుతుంది.

రాజ్యాంగ స్ఫూర్తితో సంక్షేమ బాటలో

- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- 99.5 శాతం ఎన్నికల వాగ్దానాలను అమలు చేశాం
- 56 నెలలుగా కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన



"మా ప్రభుత్వం మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తూ 99.5 శాతం హామీలను అమలు చేసింది. కులమతాలు, ప్రాంతాలు, రాజకీయ వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ మన రాష్ట్రాన్ని దేశంలో ప్రత్యేకంగా నిలిపింది. విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో నా ప్రభుత్వం సామాజిక న్యాయ సాధనను పునరుద్ఘాటించింది. సామాజిక సాధికారత నినాదం కాదు.. మార్గదర్శక విధానమని నిరూపించింది''

– జస్టిస్ అబ్దుల్ నజీర్, గవర్నర్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తితో సంక్షేమ ప్రగతి దిశగా పయనిస్తోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గత 56 నెలలుగా లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర విలువలను ప్రతిబింబిస్తూ పాలన సాగిస్తోందన్నారు. అణగారిన వర్గాల్లో ఆనందాన్ని నింపడమే లక్ష్యంగా మారుమూల ప్రాంతాలకూ అభివృద్ధి ఫలాలను చేరవేస్తున్నట్లు చెప్పారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌర సేవలను చేర్చి గ్రామ స్వరాజ్య భావనకు జీవం పోశామన్నారు. ఇప్పటి వరకు డీబీటీ ద్వారా రూ.2,52,943.48 కోట్లు, నాన్‌– డీబీటీ ద్వారా మరో రూ.1,68,151.08 కోట్లు కలిపి మొత్తం రూ.4,21,094.56 కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూర్చినట్లు తెలిపారు. సంక్షేమంతో పాటు సామాజిక విప్లవాన్ని తెస్తూ నామినేటెడ్ పనులు, పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలతో పాటు మహిళలకు ప్రత్యేకంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. విద్య, వైద్య రంగాల్లో చరిత్రాత్మక మార్పులు తెచ్చిందని చెప్పారు. పుష్కలమైన వనరులు, అపార అవకాశాలతో ఏపీ పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందన్నారు. యువత నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా నిరుద్యోగం రేటు వేగంగా తగ్గిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు గవర్నర్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నిధులైనా... విధులైనా...

▶ మొదటి పేజీ తరువాయి

పనులూ చేశారు. పంచాయతీల్లో నిధులు లేకున్నా.. చాలా మంది సర్పంచులు సొంత డబ్బుతోనో, అప్పులు తెచ్చో పనులు పూర్తి చేయించారు.

గడువు ముగుస్తుండటంతో..

ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచులు, పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1వ తేదీతో ముగుస్తోంది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటికిప్పుడు గ్రామ పంచాయతీ (జీపీ) ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా లేనట్టు సంకేతాలు ఇచ్చింది. ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో.. అవి ముగిశాక పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో.. వారినే మరో ఆరు నెలలు కొనసాగించేందుకు, లేదా వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందిని గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమించేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుత సర్పంచులలో చాలా వరకు బీఆర్‌ఎస్‌కు అనుకూలమైనవారేనన్న ఆలోచనతో ఉన్న కాంగ్రెస్ సర్కారు.. వారినే ఇన్‌చార్జులుగా కొనసాగించేందుకు సుముఖంగా లేనట్టు సంకేతాలు ఇచ్చింది. వచ్చే ఆరు నెలల పాటు (పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యేదాకా) గ్రామాల్లో పాలన బాధ్యతను ప్రత్యేకాధికారులకు అప్పగించేందుకు మొగ్గుచూపుతోంది. ఇది సర్పంచులలో కలకలం రేపుతోంది.

'ప్రత్యేక'పాలనతో ఇబ్బందులేనంటూ..

ఫిబ్రవరి 2వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలవబోతోందంటూ జిల్లా, మండల స్థాయిలో అధికారులు హడావుడి చేస్తున్నారని సర్పంచులు అంటున్నారు. సొంత నిధులతో కొత్త పంచాయతీ భవనాలు, శ్మశానవాటికలు, క్రీడా మైదానాలు వంటివి నిర్మించామని.. ఉపాధి హామీ, ప్రత్యేక అభివృద్ధి నిధి, రాష్ట్ర ఆర్థిక సంస్థ పరిధిలోని పనులు చేపట్టామని చెప్తున్నారు. తమ పదవీకాలం ముగిసేలోగా పెండింగ్ బిల్లులైనా ఇప్పించాలని, లేదా ఎన్నికలు జరిగేదాకా సర్పంచ్‌లుగా కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డికి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేస్తున్నారు. తాము రాజకీయ పార్టీల గుర్తులపై ఎన్నికకాలేదని, తమను ఒక రాజకీయపక్షానికే అనుకూలమైన వారిగా పరిగణించవద్దని కోరుతున్నారు. తమను క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై ప్రభుత్వపరంగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేవారిగా గుర్తించాలని అంటున్నారు. ప్రత్యేకాధికారుల పాలన అంటే ఇబ్బందేనని.. గ్రామాల్లో అభివృద్ధి జరగదని సర్పంచులు పేర్కొంటున్నారు. అధికారులు కేవలం ఆఫీస్ వేళల్లోనే అందుబాటులో ఉంటారని.. వారాంతాలు, సెలవు రోజుల్లో వారిని సంప్రదించే అవకాశమే ఉండదని చెప్తున్నారు. దీనితో ప్రజలకు సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.

గ్రాంట్లపై ఆధారపడిన చోట సమస్య ఎక్కువ

ఏడాదికిపైగా పెండింగ్ బిల్లుల సమస్య వెంటాడుతోందని.. సొంత నిధులతో చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందిపడుతున్నామని సర్పంచ్‌లు చెప్తున్నారు. సొంత ఆదాయ వనరులు అధికంగా ఉన్న పలు మేజర్ గ్రామ పంచాయతీలు, పెద్ద గ్రామాల్లో ఇబ్బంది పెద్దగా లేదని.. ఆదాయ వనరులు అంతగా లేని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, గ్రాంట్లపై ఆధారపడిన మధ్య, చిన్న తరహా గ్రామాలకు సమస్య ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇలాంటి గ్రామ పంచాయతీల్లో రూ.6 లక్షల నుంచి రూ.11 లక్షల దాకా పెండింగ్ బిల్లులు ఉన్నాయని.. మొత్తంగా రూ.1,200 కోట్ల మేర బకాయిలు ఉండొచ్చని సర్పంచుల సంఘాలు అంచనా వేస్తున్నాయి. గతంలో రాష్ట్ర ఆర్థిక సంఘం, ఇతర అభివృద్ధి నిధులు సకాలంలో విడుదలకాకపోవడంతోపాటు నిధుల వ్యయంపై ఫ్రీజింగ్ పెట్టడంతో పెండింగ్ బిల్లుల సమస్య పెరిగిందని అంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థికసంఘం నిధులు నేరుగా పంచాయతీలకే అందడంతో.. కొందరు సర్పంచులు కొంతమేర బిల్లులు రాబట్టుకోగలిగారని చెప్తున్నాయి.

కొనసాగిస్తే భరోసా!

గతంలో సకాలంలో బిల్లులు రాక, అభివృద్ధి, ఇతర పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక, ఇతర కారణాలతో పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని సర్పంచుల సంఘాలు గుర్తుచేస్తున్నాయి. అందువల్ల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం వెంటనే ఏదైనా హామీ ఇవ్వాలని కోరుతున్నాయి. లేకుంటే పంచాయతీలకు ఎన్నికలు జరిగేదాకా ఇప్పుడున్నవారినే కొనసాగిస్తే పెండింగ్ బిల్లుల రాకపై సర్పంచులకు భరోసా ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి.

పెండింగ్ బిల్లుల సమస్యను వెంటనే పరిష్కరించాలి: యాదయ్యగౌడ్

ఫిబ్రవరి 1న తమ పదవీకాలం ముగుస్తున్నందున పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఒక ప్రకటనలో కోరారు. సర్పంచులు అప్పులు తెచ్చి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారని, అలాంటి వారి సమస్యలకు రాజకీయ రంగు రుద్దవద్దని విజ్ఞప్తి చేశారు. వివిధ పనులు చేసిన బిల్లులు రాక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందిపడుతున్నామని.. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

దేశాభివృద్ధిలో ఎన్టీపీసీ ప్రధాన భూమిక



గౌరవవందనం స్వీకరిస్తున్న ఈడీ కేదార్ రంజన్ పాండు



మాట్లాడుతున్న ఈడీ కేదార్ రంజన్ పాండు

- త్వరలో తెలంగాణ ప్రాజెక్టు యూనిట్–2 విద్యుత్ ఉత్పత్తి దశలోకి
- ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్(రామగుండం): భారతావనికి ఎన్టీపీసీ విద్యుత్ వెలుగులు అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. స్థానిక మహాత్మా గాంధీ క్రీడా మైదానంలో శుక్రవారం గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఆయన జాతీయ పతాకం ఎగురవేసి సీఐఎస్ఎఫ్ సిబ్బంది, విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. ఎన్టీపీసీ చేపట్టిన తెలంగాణ ప్రాజెక్టు స్టేజీ–1లోని మొదటి యూనిట్ విద్యుత్ ఉత్పత్తి దశలోకి వచ్చిందని, మరో 800 మెగావాట్ల రెండో యూనిట్ త్వరలోనే విద్యుత్ ఉత్పత్తి దశలోకి రానుందని ప్రకటించారు. ప్రాజెక్టు అత్యధికంగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందిస్తోందని తెలిపారు. 2030వ నాటికి 400 గిగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. టౌన్‌షిప్ సుందరీకరణ, సీఎస్సార్ సామాజిక సేవ, బాలికా సాధికారతలో విశేష కృషి చేస్తున్నామని చెప్పారు. అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులకు బిజినెస్ యూనిట్ హెడ్ మెరిటోరియస్ అవార్డు అందజేశారు. సీఐఎస్ఎఫ్, ఐసీహెచ్, భద్రతా అధికారులను సత్కరించారు. వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు చిన్మయి దాస్, జనరల్ మేనేజర్లు, సీనియర్ కమాండెంట్ ముఖేశ్‌కుమార్, ఏజీఎం హెచ్ఆర్ బిజయ్‌కుమార్ సిగ్దర్, సీఐఎస్ఎఫ్, ప్రాజెక్టు విభాగాల ముఖ్య అధికారులు, దీప్తి మహిళా సమితి సభ్యులు, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, ప్రధానకార్యదర్శి బండారి కనకయ్య, ఆరెపల్లి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్టీపీసీ సదరన్ రీజియన్ బాస్కెట్ బాల్ టీం కెప్టెన్ దేవరాజుల రవికుమార్‌కు శాలువా కప్పి సన్మానించారు.



జెండాకు వందనం చేస్తున్న ఈడీ కేదార్ రంజన్ పాండు

'ఖండేవ్'కు ఆధ్యాత్మిక శోభ

- కొనసాగిన సంప్రదాయ పూజలు
- రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగిన తొడసం ఆడపడుచు
- ప్రారంభమైన జాతర



నాగుబాయికి దుస్తులు అందజేస్తున్న వంశ పెద్దలు



నువ్వుల నూనెను దేవుడికి నైవేద్యంగా సమర్పిస్తున్న కటోడాలు

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని ఖండేవ్ ఆలయం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తొడసం వంశస్తులు ఈనెల 24న మాన్కాపూర్ వద్ద మాసేమాల్ దేవతకు పూజల అనంతరం 25న రాత్రి ఖండేవ్ ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయ ప్రకారం మహా పూజ నిర్వహించారు. శుక్రవారం ఉదయం కొత్త కోడళ్ల దేవుని పరిచయం అనంతరం ప్రత్యేక భేటీ చేపట్టారు. ఇంటి వద్ద తయారు చేసి సేకరించిన నువ్వుల నూనెను కటోడాలు దేవుడికి నైవేద్యంగా సమర్పించారు. ఆచారం ప్రకారం ఆ వంశానికి చెందిన ఆడపడుచు మెస్రం నాగుబాయి చందు 2.50 కిలోల నువ్వుల నూనె తాగి మొక్కు తీర్చుకొంది. వంశ ఆడపడుచు మూడేళ్లపాటు ఈ కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ. అనంతరం వంశస్తులంతా ఆలయ ప్రాంగణంలో భేటీ అయ్యారు. ఆలయ అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించారు. మహా పూజతో ప్రారంభమైన జాతర 15 రోజులపాటు కొనసాగుతుంది. కార్యక్రమంలో కటోడాలు బాపూరావు, తెలంగారావు, ఆనందరావు, నాగోరావు, రాజు, మోతీరామ్, గోపాల్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఎస్సై రవికిరణ్ తదితరులున్నారు.



భేటీలో పాల్గొన్న తొడసం వంశస్తులు

నూనె తాగడం ఇది రెండోసారి..



మాది మహారాష్ట్రలోని జివితి తాలుకా కొద్దేపూర్ గ్రామం. మా వంశ దైవం నార్నూర్‌లో ఉంది. ఏటా మహాపూజకు ఎండ్లబండిపై వస్తాం. దైవ సన్నిధిలో నువ్వుల నూనె తాగి మొక్కు తీర్చుకోవడం ఇది రెండో సారి. మా ఆచారం ప్రకారం ఒక్కో ఆడపడుచు మూడేళ్ల పాటు ఈ కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ. ఇలా చేస్తే అంతా మంచి జరుగుతుందని మా నమ్మకం.

– మెస్రం నాగుబాయి చందు, తొడసం ఆడపడుచు

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి ఆత్మహత్య



మధుకర్(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: హాస్టల్ నుంచి ఇంటికి ఎందుకు వచ్చావని తల్లిదండ్రులు మందలించడంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కుమురం భీం జిల్లాలో చోటుచేసుకుంది. ఎస్సై రాజేశ్వర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఆసిఫాబాద్ మండలం మోవాడ్‌కు చెందిన జంగు, తనుబాయి దంపతుల కుమారుడు మధుకర్(14) జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల(బాలుర)లో 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం వసతి గృహం నుంచి ఇంటికి వచ్చాడు. సెలవులు లేకున్నా హాస్టల్ నుంచి ఎందుకు వచ్చావని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన మధుకర్ రాత్రి ఇంట్లోని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

ఇంద్రవెల్లి: ఈ నెల 28 లేదా 29 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా పర్యటన ఖరారు కానున్నట్లు సమాచారం. సీఎం ఇంద్రవెల్లిలోని అమర వీరుల స్తూపాన్ని సందర్శించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. స్తూపం, పరిసర ప్రాంతాల వద్ద పనులను డీఎల్పీవో భిక్షపతిగౌడ్, ఎస్సై సునీల్ శుక్రవారం పరిశీలించారు. హీరాపూర్, గాలియబాయి తండా సమీపంలోని ఖాళీ స్థలాలను వాహనాల పార్కింగ్‌కు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్, ఈవో సంజీవ్‌రావు పాల్గొన్నారు.



స్తూపం వద్ద పనులు పరిశీలిస్తున్న అధికారులు

నాగోబా జాతర పనులు ప్రారంభం

ఇంద్రవెల్లి: వచ్చే నెల 9న మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. తాగునీటి కోసం ఆలయ పరిసరాల్లో ఉన్న 11 బోరు బావులకు ఫ్లెసింగ్‌తో పాటు తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, శాశ్వత మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. లెవలింగ్, ఇతర పనులను శుక్రవారం దగ్గరుండి పరిశీలించారు. జాతర ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయనున్నట్లు వివరించారు.



బోరుబావి ఫ్లెసింగ్ చేయిస్తున్న అధికారులు



ఆలయ ఆవరణలో భక్తులు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

రాజన్నకు జనజాతర

సమ్మక్క భక్తులతో రాజన్న క్షేత్రం కిటకిట

వేములవాడ: సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు వేములవాడ రాజన్న దర్శనానికి పోటెత్తారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సెలవు లభించడంతో ఇరుగు పొరుగు జిల్లాలకు చెందిన 30 వేల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



పర్బతి బారువా

స్త్రీలు జీవానికి జన్మనివ్వడమే కాదు.. జీవాన్ని కాపాడతారు కూడా!
ఈసారి భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీలలో కొందరు
అసామాన్యమైన స్త్రీలు తమ జీవితాన్ని, కళ, పర్యావరణం, సేంద్రియ వ్యవసాయం,
ఔషధ మొక్కలు వీటన్నిటిలోని జీవాన్ని కాపాడుకుంటూ రావడం కనిపిస్తుంది.
ఏనుగుల కోసం జీవితాన్ని అంకితం చేసిన పర్బతి బారువా...
లక్షలాది మొక్కలు నాటి ఆకుపచ్చదనం నింపిన చామి ముర్ము...
విస్మరణకు గురైన ఔషధ మూలికలకు పూర్వ వైభవాన్ని తెచ్చిన యానుంగ్...
కొబ్బరి తోటలు తీయటి కాయలు కాచేలా చేస్తున్న అండమాన్ చెల్లమ్మాళ్...
గోద్నా చిత్రకళకు చిరాయువు పోసిన శాంతిదేవి పాశ్వాన్...
వీరందరినీ పద్మశ్రీ వరించి తన గౌరవం తాను పెంచుకుంది.

పురస్కారం

అసామాన్య పద్మశ్రీలు



ఏనుగుల రాణి

భారతదేశ తొలి మహిళా మావటి పర్బతి బారువాకు భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' ప్రకటించింది. ఆమె పరిచయం.

ఇది సంతోషించదగ్గ విషయం.

అస్సాంలో, పశ్చిమ బెంగాల్‌లో, ఒరిస్సాలో ఎక్కడైనా అటవీ ఏనుగులు అదుపు తప్పి, తల తిక్కగా వ్యవహరిస్తూ ఉంటే పర్బతి బారువాకు పిలుపు వచ్చేది... వచ్చి వాటిని కాస్త పట్టుకోమని, మాలిమి చేయమని. ఇన్నేళ్లకు 69 ఏళ్ల వయసులో ఈ 'ఏనుగుల రాణి'కి, ఏనుగుల కోసం జీవితాన్ని అంకితం చేసిన రుషికి భారత ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' స్వీకరించమని పిలుపు వచ్చింది. మన దేశంలోనే కాదు ఆసియాలోనే ప్రమాదస్థాయిలో పడిపోతున్న గజరాజుల సంరక్షణకు, వాటిని ఎలా కనిపెట్టుకోవాలో తెలిపే జ్ఞానాన్ని సముపార్జించి పంచినందుకు ఆమెకు ఈ పురస్కారం ఇవ్వడం సంతోషించాల్సిన సంగతి.

కళ్లు తెరవగానే ఏనుగు

'నాకు ఊహ తెలిసిన వెంటనే నా కళ్ల ఎదురుగా ఏనుగు ఉంది' అంటుంది పర్బతి. అస్సాంలోని ధుబ్రీ జిల్లాకు చెందిన గౌరిపూర్ సంస్థానం పర్బతి కుటుంబీకులది. పర్బతి తండ్రి రాజా ప్రతాప్ చంద్ర బారువా సంస్థానం మీద వచ్చే పరిహారంతో దర్జాగా జీవిస్తూ 40 ఏనుగులను సాకేవాడు. అంతేకాదు అతనికి ఏనుగులతో చాలా గొప్ప, అసామాన్యమైన అండర్‌స్టాండింగ్ ఉండేది. వాటి ప్రతి కదలికకూ అతనికి అర్థం తెలుసు. మహల్‌లో ఉండటం కన్నా కుటుంబం మొత్తాన్ని తీసుకుని అడవుల్లో నెలల తరబడి ఉండటానికి ఇష్టపడే రాజా ప్రతాప్ తన తొమ్మిది మంది సంతానంలో ఒకతైన పర్బతికి ఏనుగుల మర్మాన్ని తెలియచేశాడు. 9 ఏళ్ల వయసు నుంచే పర్బతి ఏనుగులతో స్నేహం చేయడం మొదలుపెట్టింది. 16 ఏళ్ల వయసులో మొదటిసారి అటవీ ఏనుగును పట్టి బంధించగలిగింది. అది చూసి తండ్రి మెచ్చుకున్నాడు.



కష్టకాలంలో ఏనుగే తోడు

1970లో భారత ప్రభుత్వం (విలీనం చేసుకున్న) సంస్థానాలకిచ్చే భరణాన్ని ఆపేయడంతో పర్బతి తండ్రి పరిస్థితి కష్టాల్లో పడింది. రాబడి లేకపోవడంతో ఏనుగులే అతని రాబడికి ఆధారం అయ్యాయి. ఏనుగులను అమ్మి, టింబర్ డిపోలకు అద్దెకిచ్చి జీవనం సాగించాడు. ఆ సమయంలో పర్బతి ఏనుగుల గురించి మరింత తెలుసుకుంది. ఇంకా చెప్పాలంటే ఏనుగు కళ్లను చూసి దాని మనసులో ఏముందో చెప్పే స్థితికి పర్బతి చేరుకుంది. ఏనుగుల ప్రవర్తనకు సంబంధించిన ఆమె ఒక సజీవ ఎన్‌సైక్లోపిడియాగా మారింది.

క్వీన్ ఆఫ్ ఎలిఫెంట్స్

బీబీసీ వారు 'క్వీన్ ఆఫ్ ఎలిఫెంట్స్' పేరుతో పర్బతి మీద డాక్యుమెంటరీ తీయడంతో ఆమె గురించి లోకానికి తెలిసింది. ఉదయం నాలుగున్నరకే లేచి ఏనుగుల సంరక్షణలో నిమగ్నమయ్యే పర్బతి దినచర్యను చూసి సలాం చేయాల్సిందే. 'ఏనుగును మాలిమి చేసుకోవాలంటే ముందు దాని నమ్మకం, గౌరవం పొందాలి. లేకుంటే ఏనుగులు మావటీలను చంపేస్తాయి. వాటికి జ్ఞాపకశక్తి ఎక్కువ. ఒక ఏనుగు తనను ఇబ్బంది పెడుతున్న మావటిని అతను నిద్రపోతున్నప్పుడు వెతికి మరీ చంపింది' అంటుంది పర్బతి. కాని నమ్మకం పొందితే ఏనుగుకు మించి గొప్ప స్నేహితుడు లేడని అంటుంది. 'ఒకో ఏనుగు రోజుకు 250 కిలోల పచ్చగడ్డి తింటుంది. దానికి అనారోగ్యం వస్తే ఏ మొక్క తింటే ఆరోగ్యం కుదుటపడుతుందో ఆ మొక్కను వెతికి తింటుంది. అది తినే మొక్కను బట్టి దాని ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వైద్యం చేయించాలి' అంటుందామె. 'ఎవరికైనా విశ్రాంతి ఉంటుంది కాని మావటికి కాదు. మావటి పని డ్రైవర్ ఉద్యోగం కాదు. కారు గ్యారేజ్‌లో పెట్టడానికి. జీవంతో నిండిన ఏనుగుకు మావటి అనుక్షణం తోడు ఉండాలి' అంటుందామె.

అస్సాం అటవీశాఖలో 'చీఫ్ ఎలిఫెంట్ వార్డెన్'గా పని చేసిన ఆమె ఇప్పుడు పర్యావరణ సంరక్షణ కోసం పని చేస్తోంది.




చెల్లమ్మాళ్

నారియల్ అమ్మ

దక్షిణ అండమాన్‌లోని రంగచాంగ్‌కు చెందిన 67 ఏళ్ల కామాచీ చెల్లమ్మాళ్ సేంద్రియ కొబ్బరి తోటల పెంపకంలో చేసిన విశేష కృషికి 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపికైంది. దక్షిణ అండమాన్‌లో 'నారియల్ అమ్మ'గా ప్రసిద్ధి చెందింది. వర్షాకాలం తరువాత నేలలో తేమను సంరక్షించడానికి కొబ్బరి ఆకులు, పొట్టు మొదలైన వాటితో సేంద్రియ ఎరువు తయారుచేసింది. 'నాకు పద్మశ్రీ ప్రకటించారు అని ఎవరో చెబితే నేను నమ్మలేదు. అయోమయానికి గురయ్యాను. అండమాన్‌లోని ఒక మారుమూల గ్రామంలో నివసించే నాకు ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్ ఎందుకు ప్రకటిస్తారు అనుకున్నాను. ఆ తరువాత నేను విన్న వార్త నిజమే అని తెలుసుకున్నాను' అంటున్న చెల్లమ్మాళ్ ఆగ్రో-టూరిజంపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. తమ ప్రాంతంలోని రకరకాల పంటలు, సుగంధ ద్రవ్యాల తోటలు, చేపల పెంపకం...మొదలైనవి ఆగ్రో-టూరిజానికి ఊతం ఇస్తాయి అని చెబుతుంది చెల్లమ్మాళ్.

ఆది రాణి

అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన యానుంగ్ జమెహ్ లెగో ఆది తెగ సంప్రదాయ వైద్య విధానాన్ని పునరుద్ధరించడంలో చేసిన కృషికి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తూర్పు సియాంగ్ జిల్లాకు చెందిన 58 సంవత్సరాల యానుంగ్‌ను అభిమానులు 'ఆది రాణి' అని పిలుచుకుంటారు. లక్షమందికి పైగా ఔషధమూలికలపై అవగాహన కలిగించించిన యానుంగ్ ఏటా 5,000 ఔషధ మొక్కలను నాటుతుంది. ప్రతి ఇంటిలో హెర్బల్ కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకునేలా కృషి చేస్తోంది. ఆర్థికపరిమితులు ఉన్నప్పటికీ విస్మరణకు గురైన ఆది తెగ సంప్రదాయ వైద్య వ్యవస్థను, సాంప్రదాయ జ్ఞానాన్ని సజీవంగా ఉంచడానికి తన జీవితాన్ని అంకితం చేసింది యానుంగ్.



యానుంగ్ జమెహ్ లెగో



శాంతిదేవి పాశ్వాన్

అవమానాలను అధిగమించి

గోద్నా చిత్రకళలో చేసిన విశేష కృషికి బిహార్‌లోని మధుబని జిల్లా లహేరిఆగంజ్ ప్రాంతానికి చెందిన శాంతిదేవి పాశ్వాన్ ఆమె భర్త శివన్ పాశ్వాన్‌లు పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక అయ్యారు. గోద్నా చిత్రకళ ద్వారా ఈ దంపతులు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందారు. అమెరికా నుంచి జపాన్ వరకు వీరి చిత్రాలను ప్రదర్శించారు. తన కులం కారణంగా ఎన్నో అవమానాలకు గురైన శాంతిదేవి, వాటిని అధిగమించి జీ20 సదస్సులో పాల్గొనే స్థాయి వరకు ఎదిగింది. శాంతిదేవి, శివన్ పాశ్వాన్ దంపతులు ఇరవైవేల మందికి పైగా గోద్నా చిత్రకళలో శిక్షణ ఇచ్చారు.



చామి ముర్ము

మొక్కవోని ఆత్మస్థైర్యం

'మొక్కలు నాటడానికి నువ్వు ఏమైనా కలెక్టర్ వా!' అని ఊరి మగవాళ్లు చామిని వెక్కిరించేవాళ్లు. మొక్కలు నాటడం అనే పుణ్యకార్యం వల్ల ఉత్త పుణ్యానికే ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. ఇంటి నుంచి బయటికి వచ్చిన చామి కూలి పనులు చేసుకుంటూనే 36 ఏళ్ల రెక్కల కష్టంతో 28 లక్షలకు పైగా మొక్కలు నాటింది. ఝార్ఖండ్‌కు చెందిన చామి ముర్ము 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపికైంది....

తన గ్రామం భుర్సాకు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక సమావేశానికి హాజరు కావడం ద్వారా పర్యావరణ కార్యకర్తగా చామీ ముర్ము ప్రయాణం ప్రారంభమైంది. 'మా ప్రాంతంలో ఎటు చూసినా బంజరు భూములు కనిపించేవి. బాధగా అనిపించేది. ఇలాంటి పరిస్థితిలో మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నాను. అయితే మొక్కలు నాటడం మా ఊరిలోని మగవాళ్లకు నచ్చలేదు. ఇంట్లో కూడా గొడవలు జరిగాయి. ఈ గొడవల వల్ల సోదరుడి ఇంటికి వెళ్లాను. అతడితో కలిసి రోజూ కూలి పనులకు వెళ్లేదాన్ని. ఒకవైపు జీవనోపాధిపై దృష్టి పెడుతూనే మరోవైపు ప్రకృతికి మేలు కలిగించే పనులు చేయడం ప్రారంభించాను' అంటుంది చామీ ముర్ము. పదో తరగతి వరకు చదువుకున్న చామి మొక్కలు నాటడం, చెట్ల పరిరక్షణ కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నందుకు కొంతమందికి అకారణంగా శత్రువు అయింది. 1996లో చామి నాటిన మొక్కలను ధ్వంసం చేశారు కొందరు. 'ఇక ఆపేద్దాం. ఎందుకు లేనిపోని గొడవలు' అని కొందరు మహిళలు చామిని వెనక్కి లాగే ప్రయత్నం చేశారు. అయితే చామి మాత్రం ఆనాటి నుంచి రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడం ప్రారంభించింది. ఆమె ఉత్సాహం ముందు ప్రతికూలశక్తులు తోక ముడిచాయి.

'నన్ను నేను ఒంటరిగా ఎప్పుడూ భావించలేదు. నాకు పెద్ద కుటుంబం ఉంది. నేను నాటిన 28 లక్షలకుపైగా మొక్కలు నా బంధువులే' అంటుంది చామి. ఝార్ఖండ్‌లోని వెనబడిన జిల్లా అయిన సరైకెలా ఖరావాన్‌లో రైతులు వ్యవసాయం కోసం వర్షంపై ఆధారపడతారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాగునీటి అవసరాల కోసం వాటర్‌షెడ్‌లను నిర్మించడానికి చామి కృషి చేస్తోంది. 2,800 స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసింది. వేలాది మంది మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు పొందేలా, సొంత వ్యాపారం ప్రారంభించేలా చేసింది.

తనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంపై స్పందిస్తూ 'ఈ అవార్డు రావడం గౌరవంగా భావిస్తున్నాను. పర్యావరణ స్పృహతో మొదలైన నా ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లడానికి స్ఫూర్తి ఇస్తుంది' అంటుంది చామి.

ఒంటరిగా అడుగులు మొదలు పెట్టినప్పటికీ అంకితభావం కలిగిన వ్యక్తులు సమాజంపై సానుకూల ప్రభావం చూపించగలరు అని చెప్పడానికి చామీ ముర్ము ప్రయాణం బలమైన ఉదాహరణ. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన చామీ ముర్ము పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తోంది. టింబర్ మాఫియాపై పోరాడిన చామీ ముర్మును 'లేడీ టార్జన్ ఆఫ్ ఝార్ఖండ్' అని అభిమానులు పిలుచుకుంటారు.

---

* సేవ

పేదలకు అభయం

బాలచంద్రుని ఆనంద నిలయం

పరాన్న జీవులుగా కాదు.. పరమాత్మ జీవులుగా మనమంతా ఎదగాలి' అంటారు సుంకు బాలచంద్ర. పదిహేడేళ్లుగా సేవారంగంలో వేలాది మందికి అండగా ఉంటున్నారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఉంటున్న యాభై ఏళ్ల బాలచంద్ర. అభయ ఆనంద నిలయం పేరుతో నిరుపేదలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఉద్యోగం చేస్తూ వచ్చిన ఆదాయాన్ని పేదలకు పంచుతూ మొదలుపెట్టిన సేవా మార్గం ఇప్పుడు ఎంతో మందికి నీడనిస్తుంది. అనాథ వృద్ధులను చేరదీస్తూ, విద్యార్థుల చదువుకు అవసరాలను సమకూరుస్తూ, రోగులకు వైద్యచికిత్సను అందజేస్తూ, నిరుద్యోగుల ఉపాధికి కావల్సిన నైపుణ్యాలను అందిస్తున్నారు. స్కూల్ పిల్లలను కలుస్తూ, వారి ప్రశ్నలకు సమాధానాలను పుస్తక రూపంలో తీసుకువచ్చారు. పది వేల రూపాయలతో మొదలుపెట్టిన సేవా మార్గం నేడు ఎంత మందికి చేరవయ్యిందో తెలియజేస్తూ మనం తలుచుకుంటే సమాజంలో పేదరికం, కష్టాలు, కన్నీళ్లు లేకుండా చేయచ్చు అని వివరిస్తున్నారు. పద్దెనిమిదవ వసంతంలోకి అడుగు పెడుతున్న తన సేవా ప్రస్థానాన్ని ఇలా ముందుంచారు.



సుంకు బాలచంద్ర

''ఎనిమిదేళ్ల క్రితం ఓ రోజు నాగర్‌కర్నూలు నుంచి ఫోన్ వస్తే అక్కడకు వెళ్లాను. ఎనభై ఏళ్ల ముసలాయన బాగోగులు చూడలేక వారి పిల్లలు ఇంటి నుంచి అతన్ని రోడ్డు మీదకు తోసేస్తే కొన్ని రోజులుగా చెత్త కుప్ప వద్ద ఉన్నాడు. అతన్ని ఆశ్రమానికి తీసుకువచ్చిన ఆరునెలలకు ఆయన భార్య కూడా వచ్చింది. ఇద్దరూ ఎనిమిదేళ్లపాటు నాతోనే ఉన్నారు. నాకు కరోనా వచ్చి ఆసుపత్రిలో ఉంటే ఆవిడ బెంబేలెత్తిపోయి తన మెడలో ఉన్న మంగళసూత్రాలు, కమ్మలు ఇచ్చి 'అమ్మి, ఆ బాబును బతికించడయ్యా' అని వేడుకుంది. కోలుకుని వచ్చాక విషయం తెలిసి కళ్ల నీళ్లు వచ్చాయి.

• • •

పన్నెండేళ్ల క్రితం పాతికేళ్లమ్మాయి రోడ్డు ప్రమాదంలో హిప్‌బాల్ దెబ్బతిని మంచానికి పరిమితం అయ్యింది. హైదరాబాద్ గాంధీ నగర్‌లో ఉండే ఆమెను గుండె నొప్పితో బాధపడే తల్లి తప్ప చూసుకునేవారు ఎవరూ లేరు. నాలుగైదేళ్లు ఆ అమ్మాయి బెడ్‌మీదే ఉండిపోయింది. ఆమెకు పలుమార్లు ఆపరేషన్ చేయిస్తే ఏడెనిమిదేళ్లకు కోలుకుంది. ఇప్పుడు పెళ్లి చేసుకొని కుటుంబంతో సంతోషంగా ఉంది.

• • •

మా అమ్మాయి బాగా చదువుకుంటుంది. డాక్టర్ కావాలన్నది తన కల. కానీ, చదివించే స్థోమత మాకు లేదని బాధపడుతూ వచ్చారు ఒకమ్మాయి తల్లిదండ్రులు. ఆ బిడ్డ ఈ రోజు డాక్టర్ అయి పేదలకు సేవలందిస్తోంది.

ఈ పదిహేడేళ్లలో ఇలాంటి కథనాలు ఎన్నో... స్వచ్ఛందంగా ఎంతో మంది కదిలివచ్చి 'అభయ ఫౌండేషన్'తో చేయీ చేయీ కలిపారు.



విద్యార్థులతో...

ఉపనయనం డబ్బులతో...

పుట్టి పెరిగింది అనంతపురం జిల్లా తాడిపత్రిలో. బీఎస్సీ ఎల్‌ఎల్‌బీ చేశాను. ఇరవై నాలుగేళ్ల క్రితం నాకు ఉపనయనం చేసినప్పుడు బంధువుల ద్వారా పది వేల రూపాయలు వచ్చాయి. ఆ డబ్బుతో నలుగురికి మేలు కలిగే పని చేయాలనుకుంటున్నాను అని మా కుటుంబంలో అందరికీ చెప్పాను. అందరూ సరే అన్నారు. వారందరి మధ్యనే 'అభయ' అనే పేరుతో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేస్తున్నాను అని, తమకు తోచిన సాయం అందిస్తూ ఉండమని కోరాను. అక్కణ్ణుంచి హైదరాబాద్ వచ్చి, ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు చేశాను. నా ఖర్చులకు పోను మిగతా జీతం డబ్బులు, బంధుమిత్రులు ఇచ్చిన దానితో ఫుట్‌పాత్‌ల మీద ఉండే నిరాశ్రయులకు సాయం చేస్తూ ఉండేవాణ్ణి.



మహిళలకు ఉపాధి శిక్షణ...



అవగాహనా కార్యక్రమంలో...

నైపుణ్యాల వెలికితీత..

ఏ మనిషి అయినా ఎవ్వరి మీదా ఆధారపడకుండా బతకాలి. అందుకు తగిన నైపుణ్యం కూడా ఉండాలి. దీంతో వారాంతాలు స్కిల్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తుండేవాడిని. చదువుకున్న రోజుల్లో నేను మా బంధువుల నుంచి పుస్తకాలు, ఫీజులు, బట్టల రూపంలో సాయం పొందాను. వారందరిలోనూ ఒక ఎక్సెప్షన్ చూశాను. నాలాగే ఎంతో మంది సాయం కోసం ఎదురుచూస్తుండవచ్చు అనే ఆలోచనతో విద్యార్థుల చదువుకు ఊతంగా ఉండాలనుకున్నాను. పుట్టి పెరిగిన జిల్లాతో పాటు ఇప్పుడు దాదాపు 17 రాష్ట్రాలలో నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను. తెలుగు రాష్ట్రాలతో పాటు మరో మూడు రాష్ట్రాల్లో 12 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలకు శిక్షణ ఇస్తున్నాం. వీరిలో మహిళలూ ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. కర్ణాటక రాష్ట్రంలో నాదస్వరం స్కూల్‌ను కూడా ఏర్పాటు చేశాం. ఏ వృత్తుల వారికి ఆ వృత్తులలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారి కాళ్ల మీద వారు నిలబడేలా సాయంగా ఉంటున్నాం.

సేవకు చేయూత

ఒక మంచి పని చేస్తే ఎంత దూరమున్న వారినైనా ఆకట్టుకుంటుందని ఓ సంఘటన నాకు అర్థమయ్యేలా చేసింది. పదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ఒక సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. అక్కడకు 75 ఏళ్ల ఆవిడ వచ్చి 'నేనూ మీ సేవలో పాలు పంచుకుంటాను, నెలకు 5వేల రూపాయలు ఇవ్వగలను' అంది. ఆశ్చర్యంగా చూస్తే 'నేను రిటైర్డ్ ప్రిన్సిపాల్‌ను. 20 వేల రూపాయల పెన్షన్ వస్తుంది. ప్రతి నెలా ఐదు వేల రూపాయలు సేవకు నా జమ' అంది. నోటమాటరాలేదు. ఎక్కడ సేవ రూపంలో వెళితే అక్కడకు పది, వంద రూపాయలు సాయం అందించినవారున్నారు. ఇంతమందిలో మానవత్వం ఉంటే ఇక మనకు కొరతేముంది అనుకున్నాను. ఎవరికి సాయం అందిందో తిరిగి వాళ్లు ఎంతో కొంత సాయం అందిస్తూ వచ్చారు. కొంతమంది పిల్లలు తమ కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బును కూడా సాయంగా ఇచ్చారు.

స్వచ్ఛందంగా ముందుకు..

నేపాల్ కరువైనా, ఉత్తరాఖండ్ వరదలైనా, ఆంధ్ర, తమిళనాడు, కేరళలలో అకాల వర్షాలు ముంచెత్తినా.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సాయం అవసరమున్నవారికి అండగా ఉంటే చాలు అన్న తపన నన్ను చాలా మందికి చేరువ చేసింది. నాతో పాటు ఎలాంటి స్టాఫ్ లేదు. ప్రత్యేకించి ఆఫీసు లేదు. అందరూ స్వచ్ఛందంగా తమ చేయూతను ఇస్తున్నారు. దీనికి నేను చేస్తున్నదల్లా సాయం చేసే చేతులను కలపడం. ఈ సేవా ప్రస్థానంలో ఇప్పుడు వేల మంది జమ కూడారు.

అంతా నా కుటుంబమే!

సేవ మార్గమే నా ప్రయాణం కాబట్టి, పెళ్లి, కుటుంబం వద్దనుకున్నాను. హైదరాబాద్‌లో ఒక ప్లాట్ ఉంది. ఇటీవల ఆ ఇంటిని అభయ ఫౌండేషన్‌కు ఇచ్చేశాను. ఆరేళ్ల క్రితం ఇబ్రహీంపట్నంలో వృద్ధులకు, వైద్య సాయం అవసరమైన పేదలకు అభయ ఆనంద నిలయం ఏర్పాటు చేశాను. నేను మరణించేదాకా, మరణించాక కూడా నలుగురిని బతికించే ప్రయత్నం చేయాలన్నది తపన. ఈ ప్రయాణంలో ఎన్నో ఆవేదనలు చుట్టుముట్టాయి. ఎందరి కష్టాలనో దగ్గరుండి చూసి, దుఃఖం కలిగేది. చేసే ప్రతి పనినీ దైవాంశగా భావిస్తూ వచ్చాను.

పిల్లల కోసం కంపాస్

రేపటి తరం బాగుండాలంటే విద్యార్థుల్లో మానవతా స్పృహ కలగాలి. అందుకే, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చిన్నారులకు మన దేశ నాయకుల గురించి, సంస్కార పాఠాలు అందించే ప్రయత్నం చేస్తున్నాను. పిల్లలు అడిగిన ఎన్నో ప్రశ్నలకు సమాధానంగా 'కంపాస్'అనే పేరుతో పుస్తకం తీసుకువచ్చాను. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రతి రోజూ ఉదయం నుంచి 10 వేల మందికి టచ్‌లో ఉంటాం. నేను కోరేది ఒక్కటే ... వాలంటీర్లుగా వారంలో ఒక్క రోజు మాకివ్వండి. సేవా మార్గంలో తోడవ్వండి. అంకితభావంతో ఉన్న యువత ఇలాంటి సంస్థలలో పనిచేయడం వల్ల వారిలో జీవన నైపుణ్యాలు పెరుగుతాయి. సమాజం బాగుండాలంటే యువత చేతులు ఏకమవ్వాలి'' అని తెలియజేస్తున్నారు బాలచంద్ర.

– నిర్మలారెడ్డి



నడుము నొప్పా? సింపుల్‌గా ఇలా తగ్గించుకోండి!

నడుంనొప్పి ఉన్నవారు ఆ బాధ బయటకు చెప్పుకోలేరు. చాలా ఇబ్బంది పడుతుంటారు. తరచు పడకకే పరిమితం అయిపోవలసి వస్తుంటుంది. నొప్పి వచ్చినప్పుడల్లా సింపుల్‌గా ఒక పెయిన్ కిల్లర్‌ను వేసేసుకుంటూ ఉంటారు. అయితే ఆ మాత్ర నొప్పితోపాటు క్రమంగా మనల్నీ కిల్ చేస్తుంటుందన్న విషయాన్ని మరచిపోవద్దు. నడుం నొప్పి తగ్గించుకునేందుకు కొన్ని చిట్కాలు పాటిస్తే చాలు... సింపుల్‌గా తగ్గిపోతుంది. ఆ చిట్కాలేమిటో చూద్దాం...

బాగా నడుము నొప్పిగా ఉన్నవారు తగ్గించుకోవాలంటే ముందు ఒత్తిడిని తగ్గించుకోవాల్సి ఉంటుంది. వెన్నెముక కండరాలు బలోపేతం చేయడంతో పాటు, కొన్ని రోజువారీ అలవాట్లను మార్చుకోవడం వల్ల నడుము నొప్పి నుంచి ఉపశమనం పొందే వీలుంటుంది. చిన్న చిన్న టిప్స్‌తో నడుం నొప్పిని తగ్గించుకోవచ్చు. పడుకునే సమయంలో వెనుక భాగంపై ఒత్తిడి పడుతుంది. నడుంనొప్పి ఎక్కువగా ఉన్నవారు మోకాళ్ళ కింద దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల, కాళ్ళు ఎత్తుగా పెట్టడం వల్ల నడుంపై ఒత్తిడి తగ్గి కాస్త రిలీఫ్‌గా ఉంటుంది.

సరైన శిక్షణతో వ్యాయామం... నడుం నొప్పి నుంచి ఉపశమనం

నడుంనొప్పిని తగ్గించుకోవడంలో వ్యాయామం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక వ్యాయామం చేసే సమయంలో నడుముకు సంబంధించిన ముఖ్యమైన కండరాలపై దృష్టి సారించి సరైన శిక్షణతో వ్యాయామం చేయడం వల్ల, ముఖ్యంగా కండరాలను సాగదీసే స్ట్రెచ్ ఎక్సర్‌సైజులు చేయడంవల్ల ఫలితం ఉంటుంది. వెన్ను సంబంధిత గాయాల ప్రమాదాన్ని తగ్గించడంలో వ్యాయామం సహాయపడుతుంది. నడుం నొప్పి తగ్గడం కోసం వారానికి కనీసం రెండుసార్లు నడుమును బలపరిచే వ్యాయామాలను చేయండి.

కాల్షియం, విటమిన్ డి

ఎముకలు బలంగా ఉన్నప్పుడు నడుము నొప్పి వంటి సమస్యలు ఎక్కువ బాధించవు. బలహీనమైన ఎముకలు ఉన్నప్పుడు కచ్చితంగా నడుంనొప్పి ఇబ్బంది పెడుతుంది. కాల్షియం, విటమిన్ డి పుష్కలంగా తీసుకోవడం ద్వారా వెన్నెముకలోని ఎముకలకు బలం చేకూరుతుంది. అందుకే తప్పనిసరిగా కాల్షియం, విటమిన్ డి తీసుకోవడం మర్చిపోకండి. పాలు, పెరుగు, ఆకుకూరలు, విటమిన్ సప్లిమెంట్లు వంటి వాటిలో విటమిన్ డి ఉంటుంది.

చెప్పుల విషయంలో జాగ్రత్త

నడుంనొప్పిని నివారించడం కోసం చెప్పుల విషయంలో కూడా జాగ్రత్త వహించండి. ఎత్తు మడమల చెప్పులు ఎక్కువగా వేసుకునే వారికి నడుంనొప్పి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే తక్కువ మడమ ఉన్న చెప్పులను ధరించండి. ఇవి మన నడుంపై ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒక్క అంగుళం కంటే తక్కువ మడమ ఉంటేనే ఫలితం బాగుంటుంది.

సరైన పొజిషన్

ఆఫీసులో కూర్చున్నప్పుడు, నిలబడి ఉన్నప్పుడు సరైన భంగిమ పద్ధతులను పాటించండి. మనం కూర్చునే విధానం బట్టి కూడా నడుము నొప్పి వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే కూర్చున్నా, నిల్చున్నా కచ్చితంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యేకించి ప్రతిరోజూ గంటల తరబడి కంప్యూటర్ ముందు పని చేసేవారు మంచి కుర్చీని ఎంపిక చేసుకొని కూర్చోవాలి. లేదంటే నడుం నొప్పి ఎక్కువ అయ్యే ప్రమాదం ఉంటుంది.

బరువు తగ్గించుకోవడం

నడుం నొప్పికి మరొక కారణం విపరీతమైన బరువు. ఎక్కువ బరువు ఉన్న వారిలోనూ నడుమునొప్పి విపరీతంగా వస్తుంది. బరువు తగ్గితే సహజంగానే నడుం నొప్పి నుండి కూడా కాస్త ఉపశమనం లభిస్తుంది. కాబట్టి బరువు తగ్గటం పై కూడా ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టడం అవసరం. ప్రతిరోజు వ్యాయామం చేయడంతో పాటు, చిన్న చిన్న మార్పులతో నడుం నొప్పి ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. మందులతోనే నడుము నొప్పి తగ్గాలని చూడకుండా, పై చిట్కాలు పాటించి చూడండి. కచ్చితంగా విపరీతమైన బాధ నుండి కాస్తయినా ఉపశమనం పొందుతారు.

లవంగం టీ తాగండి!

భారతీయులు ఎక్కువగా వినియోగించే సుగంధ ద్రవ్యాల్లో లవంగాలు ఒకటి. శీతాకాలంలో చాలామందిలో రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల అనేకరకాల ఇన్ఫెక్షన్లు వస్తూ ఉంటాయి. ముఖ్యంగా చాలామంది జలుబు దగ్గు సమస్యల బారిన పడుతూ ఉంటారు. అయితే ఇలాంటి సమస్యలతో బాధపడేవారు ప్రతిరోజూ లవంగాల టీని తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులో ఉండే సుగుణాలు గొంతునొప్పి, కఫం వంటి సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తాయి.

శరీర ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయి

కొంతమందిలో వాతావరణంలోని తేమ పరిమాణాలు తగ్గడం పెరగడం కారణంగా శరీరంలోని ఉష్ణోగ్రతలు పెరుగుతూ.. తగ్గుతూ ఉంటాయి. దీని కారణంగా జ్వరం ఇతర అనారోగ్య సమస్యల బారిన పడతారు. అయితే చలి కాలంలో తరచుగా ఇలాంటి సమస్యలతో బాధపడేవారు తప్పకుండా లవంగాలతో తయారుచేసిన టీని తాగాల్సి ఉంటుంది.

దగ్గు నుంచి ఉపశమనం

శీతాకాలంలో చాలామందిని వేధించే సమస్యల్లో దగ్గు కూడా ఒకటి.. ఈ దగ్గు కారణంగా చాలామంది ఊపిరితిత్తుల సమస్యల బారిన కూడా పడుతున్నారు. కాబట్టి ఈ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి తప్పకుండా లవంగాలతో తయారు చేసిన టీని తాగడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు దగ్గు నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా శరీరంలో కఫాన్ని తొలగించేందుకు కూడా సహాయపడతాయి.

జీర్ణక్రియ మెరుగు పడుతుంది

కొంతమందిలో చలి కారణంగా సంబంధిత సమస్యలు కూడా వస్తున్నాయి. ఈ సమయంలో చాలామందిని వేధించే సమస్య జీర్ణ క్రియ మందగించడం. అయితే దీనికి కారణంగా చాలామందిలో మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు కూడా వస్తున్నాయి ఈ సమస్యల నుంచి సులభంగా ఉపశమనం పొందడానికి తప్పకుండా లవంగాలతో తయారు చేసిన టీని తీసుకోండి.





కంటి పాపను కాపాడుకుందాం...

ఈ రోజుల్లో కొంతమందికి చిన్న వయసులోనే కళ్లజోళ్లు వచ్చేస్తున్నాయి. సరైన ఆహారం తీసుకోకపోవడం వలన గాని, కొన్ని అలవాట్ల వల్ల గాని కంటి చూపు మందగిస్తుంది. సైట్ వచ్చిన తరువాత బాధపడడం కన్నా రాకుండా కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. సైట్ వచ్చిన వారికి మాత్రమే కాదు, భవిష్యత్తులో సైట్ రాకుండా కళ్ళను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తినవలసిన ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం. కళ్లను కాపాడుకుందాం.

పోషకాల లోపం

- కావలసినన్ని విటమిన్లు, పోషకాలు అందకపోతే కంటి చూపు మందగిస్తుంది. కాబట్టి కంటి చూపును పెంచే ఆహార పదార్థాలను విరివిగా తీసుకోండి.
- విటమిన్ – సి ఎక్కువగా ఉండే నిమ్మ, నారింజ, ద్రాక్ష, స్ట్రాబెర్రీ బాగా తీసుకోవాలి. ఇవి కంటికి మాత్రమే కాదు చర్మానికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయి.
- వీటితో పాటుగా చేపలు, గుడ్లు, బాదం పప్పు, పాల పదార్థాలు, క్యారట్, చిలకడదుంపలు వీటన్నిటిలోను విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వీటిని ఎక్కువగా ఆహారంలో ఉండేలా చూసుకోండి.
- చత్వారం వంటివి ఉన్న పెద్దవారికే కాదు.. పిల్లలకు కూడా నేత్ర పరీక్ష అవసరం. చూపు సమస్యలను ముందే గుర్తించకపోతే పిల్లలు చదువుల్లో వెనకబడటమే కాదు.. శారీరకంగా, మానసికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది. మధుమేహం, హైబీపీ ఉన్న వారికి కంట్లోని రెటీనా పొరలో మార్పులు వస్తుంటాయి, నీటి కాసుల వంటి ప్రమాదకర సమస్యలకు కూడా ముందస్తుగా ఎలాంటి లక్షణాలూ ఉండవు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి నేత్ర పరీక్ష చేయించుకోవాలి.



హెల్త్ టిప్స్



- బరువును అదుపులో ఉండాలంటే.. ప్రతిరోజూ రెండు చెంచాల మెంతులు రాత్రి నానబెట్టి.. తెల్లవారు జామున ఆ నీటిని తాగితే మంచి ఫలితం ఉంటుంది.



- గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు పొడి వేసి ఉదయం, సాయంత్రం తాగితే జలుబు త్వరగా తగ్గుతుంది. పసుపును నీటిలో కలిపి ముద్ద చేసి లేదా లేత వేపాకు గుజ్జుతో కానీ కలిపి చర్మంపై రాస్తే చర్మ వ్యాధులు తగ్గుతాయి. బెణికినప్పుడు నొప్పికి, గాయాలకు, కీళ్లవద్ద కొంచెం వాపు, నొప్పికి సున్నం, పసుపు కలిపి తేలికగా రుద్దితే మంచి ఉపశమనం కలుగుతుంది.
- పచ్చివెల్లుల్లి తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కీళ్ళనొప్పుల్ని తగ్గిస్తాయి.



- మినపప్పు వెన్నుపూసకు బలాన్నిస్తుంది. అంతేకాదు మినపప్పులో ఉండే విటమిన్లు, ప్రోటీన్స్ శరీరానికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. ఎముకల బలానికి ఇవి ఉపయోగపడతాయి. అందుకే వారానికి రెండుసార్లు వంటల్లో మినపప్పును చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. అలాగే ఆవాలు గుండెకు మేలు చేస్తాయి. శరీరానికి కావలసిన విటమిన్లు అందిస్తాయి.



సినిమా



రవితేజ

ఈగల్... ఆన్ హిజ్ వే!

రవితేజ హీరోగా నటించిన యాక్షన్ ఫిల్మ్ 'ఈగల్'. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తుండగా, కావ్యా థాపర్ మరో కథానాయిక. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నవదీప్, మధుబాల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రధారులు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఫిబ్రవరి 9న విడుదల కానుంది. శుక్రవారం (జనవరి 26) రవితేజ పుట్టిన రోజు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 'ఈగల్' సినిమాలోని 'ఈగల్స్ ఆన్ హిజ్ వే.. ఇట్స్ టైమ్ టు డై...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు దేవ్ జాంద్ నేతృత్వంలో ఈ పాటకు ఇంగ్లిష్ లిరిక్స్ రాసిన జార్జినా మాథ్యూయే ఆలపించారు. ఈ సంగతి ఇలా ఉంచితే... రవితేజ బర్త్ డే సందర్భంగా ఆయన హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'మిస్టర్ బచ్చన్' నుంచి కూడా ఓ కొత్త పోస్టర్ విడుదలైంది.



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్

డేట్ ఫిక్స్

'ఫ్యామిలీ స్టార్' సినిమా రిలీజ్ ఏప్రిల్ 5కు ఖరారైనట్లుగా తెలిసింది. హిట్ ఫిల్మ్ 'గీతగోవిందం' (2018) తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న సినిమా ఇది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఫిబ్రవరి 20 కల్లా పూర్తి కానుందని తెలిసింది. ఫిబ్రవరిలో ఓ పాటను విడుదల చేసి, ఈ సినిమా ప్రమోషన్స్‌ను ఆరంభించాలనుకుంటున్నారు. ఇక ఈ సినిమాను తొలుత సంక్రాంతికి విడుదల చేయాలనుకున్నారు. కుదరకపోవడంతో మార్చిలో రిలీజ్‌కు ప్లాన్ చేశారు. ఫైనల్‌గా 'ఫ్యామిలీ స్టార్' సినిమా రిలీజ్ డేట్ ఏప్రిల్ 5కు ఫిక్స్ అయినట్లుగా తెలుస్తోంది. అదే తేదీకి ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న 'దేవర' విడుదల కావాల్సి ఉంది. అయితే ఆ సినిమా విడుదల వాయిదా పడటంతో ఏప్రిల్ 5కి 'ఫ్యామిలీ స్టార్' రిలీజ్‌ని ఫిక్స్ చేశారని సమాచారం.

జోడీ రిపీట్?



ఆలియా భట్, రామ్‌చరణ్

రాజమౌళి దర్శకత్వంలోని 'ఆర్ఆర్ఆర్' (రౌద్రం..రణం..రుధిరం) సినిమాలో రామ్‌చరణ్, ఆలియా భట్ ఓ జంటగా నటించి మెప్పించారు. ఈ ఇద్దరూ మళ్లీ జోడీ కట్టనున్నారనే టాక్ ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్ర కోసం ఇప్పటివరకు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా ఆలియా భట్ పేరు వినిపిస్తోంది. మరి.. రామ్ చరణ్, ఆలియా భట్ జోడీ రిపీట్ అవుతుందా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. ఇక ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చిలో ప్రారంభం కానుందని తెలిసింది. రామ్‌చరణ్ బర్త్ డే (మార్చి 27) సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలయ్యే అవకాశం ఉందని టాక్. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ ఓ కీలక పాత్రలో నటించనున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ స్వరకర్త. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌లతో కలిసి వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు.



రకుల్ ప్రీత్ సింగ్

మళ్లీ మాస్ కాంబో

ఎనిమిదేళ్ల క్రితం విడుదలైన 'సరైనోడు' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అల్లు అర్జున్ హీరోగా నటించిన ఈ సినిమాకు బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ పతాకంపై ఈ పక్కా మాస్ మూవీని అల్లు అరవింద్ నిర్మించారు. కాగా 'సరైనోడు' తర్వాత నిర్మాత అల్లు అరవింద్– దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ మాస్ కాంబో గురించిన అధికారిక ప్రకటన శుక్రవారం వెల్లడైంది. అయితే ఈ సినిమాలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తారా? లేక మరో హీరో ఎవరైనా నటిస్తారా? అనే విషయంపై సరైన స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన మిగతా వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.



బోయపాటి శ్రీను, అల్లు అరవింద్

నితిన్ రాబిన్ హుడ్

'భీష్మ' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రానికి 'రాబిన్ హుడ్' టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించనున్నారట. శుక్రవారం (జనవరి 26) రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. 'డబ్బు చాలా చెడ్డది... రూపాయి రూపాయి నువ్వు ఏం చేస్తావ్ అంటే... అన్న దమ్ముల మధ్య అక్క చెల్లెళ్ల మధ్య చిచ్చు పెడతానంటది.. అన్నట్టే చేసింది... దేశమంత కుటుంబం నాది... ఆస్తులున్నోళ్లంతా నా అన్న దమ్ములు... ఆభరణాలేసుకున్నోళ్లంత నా అక్క చెల్లెళ్ళు... అవసరం కొద్ది వాళ్ల జేబుల్లో చేతులు పెడితే... ఫ్యామిలీ మెంబర్ అని కూడా చూడకుండా నా మీద కేసులు పెడుతున్నారు... అయినా నేను హర్ట్ అవ్వలేదు... ఎందుకంటే అయినవాళ్ల దగ్గర తీసుకోవడం నా హక్కు... మై బేసిక్ రైట్. బికాజ్ ఇండియా ఈజ్ మై కంట్రీ. ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్' అంటూ నితిన్ చెప్పే డైలాగ్స్ ఈ వీడియోలో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్ తదితరులు కీలక పాత్రల్లో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



నితిన్

పసందైన పాటలతో పెళ్లి



జాకీ భగ్నానీ

బాలీవుడ్ హీరో–నిర్మాత జాకీ భగ్నానీ, హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ ఇప్పుడు ఓ హాట్ టాపిక్. ఈ ఇద్దరూ భార్యాభర్తలుగా మారి, తమ జీవితాల్లో కొత్త అధ్యాయాన్ని ఆరంభించాలనుకుంటున్నారనే వార్త వినిపిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే నెల 22న గోవాలో కుటుంబ సభ్యులు, బాగా దగ్గర స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో ఈ ఇద్దరి పెళ్లి జరగనుందని టాక్. కాగా.. పసందైన పాటలతో తమ పెళ్లిని ఆహ్లాదకరంగా జరుపుకోవాలని ప్లాన్ చేస్తున్నారట జాకీ–రకుల్. వెడ్డింగ్ వీడియోగ్రాఫర్ విశాల్ పంజాబీని నియమించారట. విరాట్ కోహ్లీ–అనుష్కా శర్మ, రణ్‌వీర్ సింగ్–దీపికా పదుకోన్, సిద్ధార్థ్ మల్హోత్రా–కియారా అద్వానీ వంటి స్టార్స్ వివాహ వేడుకలకు వీడియోగ్రాఫర్‌గా వ్యవహరించినది విశాల్ పంజాబీయే. వివాహ వేడుకల కోసం ప్రత్యేకంగా సౌండ్ ట్రాక్స్ చేస్తుంటారట విశాల్. ఇప్పటికే బాగా హిట్టయిన ప్రేమ పాటలను రీ–క్రియేట్ చేయడంతో పాటు కొత్త ట్యూన్లు కూడా చేస్తుంటారట. ఇంకా పెళ్లి కోసం ప్రత్యేకంగా పాటలు తయారు చేయడానికి, పాడటానికి సంగీతదర్శకులు విశాల్–శేఖర్, గాయనీమణులు యాషికా సిక్కా, హర్షదీప్ కౌర్ వంటి వారిని కూడా జాకీ–రకుల్ సంప్రదించారని భోగట్టా. తమ డేటింగ్ నుంచి పెళ్లి, భవిష్యత్తుని ప్రతిబింబించేలా విశాల్ పంజాబీతో ఓ ట్రాక్ తయారు చేయిస్తున్నారని సమాచారం. ఫిబ్రవరి మొదటి వారానికి ఈ ట్రాక్ రెడీ అవుతుందట. ఇలా ప్రత్యేకమైన, పసందైన పాటలతో తమ వివాహాన్ని ఓ కమ్మని పాటలా తీపి గుర్తులా ఉండేలా ఈ జోడీ ప్లాన్ చేసుకుంటోందని టాక్.

వేసవిలో డీజే టిల్లు వస్తున్నాడు

వేసవికి థియేటర్స్‌లోకి వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు డీజే టిల్లు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' (2022) మంచి హిట్ సాధించింది. ప్రస్తుతం ఈ సినిమా సీక్వెల్ 'డీజే టిల్లు స్క్వేర్'తో బిజీగా ఉన్నారు సిద్ధు జొన్నలగడ్డ. సీక్వెల్‌లో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. మల్లిక్ రామ్ దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేయాలనుకున్నారు. కొన్ని కారణాల వల్ల రిలీజ్‌ను మార్చి 29కి వాయిదా వేస్తున్నట్లుగా శుక్రవారం ప్రకటించారు మేకర్స్. "కొన్ని అనుకోని పరిస్థితుల కారణంగా ఫిబ్రవరి 9న అనుకున్న విడుదలను వాయిదా వేస్తున్నాం. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని చిత్రాన్ని మార్చి 29న విడుదల చేయాలని నిర్ణయించాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది.



సిద్ధు జొన్నలగడ్డ

సాక్షి బిజినెస్
శనివారం
27-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
360	102
70,701	21,353

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,471	▽	41
డోజోన్స్	38,089	△	39
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,635	△	105
డాక్స్	16,691	△	54
షాంఘై	2,910	△	4
నికాయ్	35,751	▽	492

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.63	107.21
€	యూరో	ఎస్‌బీఐ	89.49	91.85
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.58	56.84
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.92	55.85
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.19	62.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.73	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.47	12.54

బైజూస్‌పై దివాలా పిటిషన్

ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన టర్మ్ లోన్–బీ రుణదాతలు




న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌పై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)–బెంగళూరులో దివాలా పిటిషన్ దాఖలైంది. కంపెనీకి 1.2 బిలియన్ డాలర్ల మేర టర్మ్ లోన్–బీ (టీఎల్‌బీ) ఇచ్చిన రుణదాతల్లో 80 శాతం సంస్థలు కలిసి గ్లాస్ ట్రస్ట్ కంపెనీ ద్వారా దీన్ని దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, దివాలా పిటిషన్ విషయం ఇంకా బహిరంగంగా వెల్లడి కాలేదు. బైజూస్ ఈ వ్యవహారమంతా నిరాధారమైనదని పేర్కొంది. రుణదాతల చర్యలపై అమెరికా కోర్టుల్లో పలు కేసులు నడుస్తుండగా ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడం సరికాదని వ్యాఖ్యానించింది. అనుబంధ సంస్థలను విక్రయించడం ద్వారా వచ్చే నిధులతో రుణాలను తీర్చేసుకునేందుకు టీఎల్‌బీ రుణదాతలతో చర్చలు జరుపుతున్నట్లు బైజూస్ చెబుతున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. బ్యాంకులు కాకుండా సంస్థాగత ఇన్వెస్టర్లు ఇచ్చిన రుణాన్ని టీఎల్‌బీ లోన్‌గా వ్యవహరిస్తున్నారు. వడ్డీ రేట్లు తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు బైజూస్ అమెరికా విభాగం ఆల్ఫా 2021లో టీఎల్‌బీ తీసుకుంది. అయితే, కంపెనీ 500 మిలియన్ డాలర్ల మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఇతర అనుబంధ సంస్థలకు బదలాయించిందని, రుణ చెల్లింపులను వేగవంతం చేయాలని రుణదాతలు అమెరికాలోని డెలావేర్ కోర్టును ఆశ్రయించారు. దీన్ని న్యాయస్థానంలో సవాలు చేసిన బైజూస్.. రుణదాతలతో వివాదాన్ని పరిష్కరించుకునే ప్రయత్నాల్లో ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

27-1-2024	
విశాఖ	565–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
26-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

ఇక మేడిన్ ఇండియా హెలికాప్టర్లు!

ఎయిర్‌బస్, టాటా గ్రూప్ జట్టు
- తయారీ యూనిట్‌కు రెడీ
- 24 నెలల్లోగా దేశీ హెలికాప్టర్ డెలివరీ



ముంబై: దేశీ డైవర్సిఫైడ్ దిగ్గజ గ్రూప్ టాటాతో ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ చేతులు కలిపింది. ఇరు సంస్థలు దేశీయంగా హెలికాప్టర్స్ తయారీకి భాగస్వామ్య కంపెనీ(జేవీ)ని ఏర్పాటు చేయనున్నాయి. టాటా గ్రూప్‌తో జత కట్టడం ద్వారా హెలికాప్టర్స్ తయారీలో తుది అసెంబ్లీ లైన్ (ఎఫ్‌ఏఎల్) యూనిట్‌ను నెలకొల్పనున్నట్లు ఎయిర్‌బస్ హెలికాప్టర్ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ ప్లాంటు ద్వారా పౌర విమాన శ్రేణిలో దేశీయంగా ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్లను రూపొందించనున్నట్లు పేర్కొంది. వీటిలో కొన్నింటిని పొరుగు దేశాలకు సైతం ఎగుమతి చేయనున్నట్లు తెలియజేసింది. వెరసి దేశీయంగా హెలికాప్టర్ తయారీకి ప్రైవేట్ రంగంలో తొలి ఎఫ్‌ఏఎల్‌ను నెలకొల్పనున్నట్లు వెల్లడించింది. ఇది భారత ప్రభుత్వం చేపట్టిన ఆత్మనిర్భర్ కార్యక్రమానికి భారీస్థాయిలో ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు వివరించింది.

డెలివరీలవరకూ..

భాగస్వామ్యంలో భాగంగా ఎయిర్‌బస్ హెలికాప్టర్స్‌తో కలసి టాటా గ్రూప్ అనుబంధ సంస్థ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్) ఎఫ్‌ఏఎల్‌ను ఏర్పాటు చేయనుంది. ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఇమాన్యుయెల్ మేక్రన్ రెండు రోజుల భారత పర్యటన సందర్భంగా ఎయిర్‌బస్ హెలికాప్టర్ తాజా ప్రకటన జారీ చేసింది. గణతంత్ర దినోత్సవాలలో ప్రధాన అతిథిగా పాల్గొనేందుకు మేక్రన్ భారత్‌కు విచ్చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ప్రధాన విడిభాగాల అసెంబ్లీలు, ఏవియానిక్స్, మిషన్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ నియంత్రణల ఇన్‌స్టలేషన్, హైడ్రాలిక్ సర్క్యూట్లు, విమాన కంట్రోళ్లు, ఇంధన వ్యవస్థతోపాటు ఇంజిన్ కూర్పు తదితరాలను జేవీ నిర్వహించనున్నట్లు ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ వివరించింది. అంతేకాకుండా భారత్ తదితర ప్రాంతాలలో హెచ్125ల టెస్టింగ్, క్వాలిఫికేషన్‌తో సహా.. డెలివరీలను సైతం చేపట్టనున్నట్లు పేర్కొంది. 24 నెల్లోగా ఎఫ్‌ఏఎల్ ఏర్పాటవుతుందని, 2026లో దేశీయంగా తయారైన తొలి (మేడిన్ ఇండియా) హెచ్125ల డెలివరీ చేసే వీలున్నట్లు అంచనా వేసింది. తయారీ యూనిట్ ఏర్పాటుచేసే ప్రాంతాన్ని సంయుక్తంగా ఎంపిక చేయనున్నట్లు వెల్లడించింది.

కీలక పాత్ర...

జాతి నిర్మాణంలో హెలికాప్టర్లు కీలక పాత్ర పోషిస్తాయని ఎయిర్‌బస్ సీఈవో గిలామ్ ఫారీ పేర్కొన్నారు. నవ భారత సామర్థ్యాలపై గల నమ్మకానికి మేడిన్ ఇండియా పౌర హెలికాప్టర్ ప్రతీకగా ఉంటుందని అభివర్ణించారు. తద్వారా దేశీయంగా హెలికాప్టర్ మార్కెట్‌కున్న భారీ అవకాశాలకు తెరతీస్తుందని అభిప్రాయపడ్డారు. దేశీయంగా ప్రయివేట్ రంగంలో తొలి హెలికాప్టర్ అసెంబ్లీ యూనిట్ ఏర్పాటుకు సంతోషిస్తున్నట్లు టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ పేర్కొన్నారు. తుది అసెంబ్లీ లైన్ ద్వారా ప్రపంచంలోనే ఎయిర్‌బస్‌కు చెందిన అత్యుత్తమ హెచ్125 సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్‌ను భారత్‌తో పాటు, ఇతర మార్కెట్లకు కూడా అందించనున్నట్లు తెలియజేశారు.

ఎస్‌బీఐ కార్డ్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 549 కోట్లు



న్యూఢిల్లీ: క్రెడిట్ కార్డుల దిగ్గజం ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం 8 శాతం వృద్ధితో రూ. 549 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 509 కోట్లు ఆర్జించింది. పీఎస్‌యూ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రమోట్ చేసిన కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ. 3,656 కోట్ల నుంచి రూ. 4,742 కోట్లకు ఎగసింది. అయితే నిర్వహణ వ్యయాలు 23 శాతం పెరిగి రూ. 2,426 కోట్లకు చేరాయి. గత క్యూ3లో ఇవి రూ. 1,974 కోట్లుగా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 2.22% నుంచి 2.64 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.8% నుంచి 0.96 శాతానికి పెరిగాయి. దీంతో అనుకోని నష్టాలు, మొండి రుణాల వ్యయాలు రూ. 533 కోట్ల నుంచి రూ. 883 కోట్లకు పెరిగాయి. కాగా.. డిసెంబర్‌కల్లా కనీస మూలధన నిష్పత్తి 23.1 శాతంగా నమోదైంది. 2023 మార్చిలో 18.4 శాతం సీఏఆర్ సాధించింది.

వదంతులపై స్పందించే గడువు పెంపు

- లిస్టెడ్ కంపెనీలకు సెబీ వెసులుబాటు
- జూన్ 1 నుంచి అమలు



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో వ్యాపించే వదంతులపై తప్పనిసరిగా స్పందించాల్సిన గడువును క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా పొడిగించింది. దీంతో టాప్–100 లిస్టెడ్ కంపెనీలకు వెసులుబాటు లభించింది. వెరసి మార్కెట్లో పుట్టే రూమర్లను ధ్రువ పరచడం, ఖండించడం లేదా స్పష్టతనివ్వడం వంటి చర్యలను తప్పనిసరిగా చేపట్టాలనే నిబంధన అమలుకు మరింత గడువు లభించింది. సెబీ ప్రతిపాదిత ఈ నిబంధనలు తొలుత టాప్ ర్యాంక్‌లోని 100 లిస్టెడ్ కంపెనీలకు అమలుకానున్న సంగతి తెలిసిందే. మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)రీత్యా అగ్రభాగంలో నిలిచే 100 కంపెనీలు 2024 ఫిబ్రవరి 1 నుంచి రూమర్లపై తప్పనిసరిగా స్పందించాలంటూ సెబీ ఇంతక్రితం గడువు విధించింది. తాజాగా ఈ డెడ్‌లైన్‌ను జూన్ 1వరకూ పొడిగిస్తూ ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ బాటలో మార్కెట్ విలువలో టాప్–250 ర్యాంకు లిస్టెడ్ కంపెనీలకు రూమర్లపై స్పందించాల్సిన నిబంధనలు 2024 డిసెంబర్ 1 నుంచి అమలుకానున్నాయి. నిజానికి 2024 ఆగస్ట్ 1 నుంచి నిబంధనలు అమలు చేయవలసిందిగా టాప్–250 సంస్థలను సెబీ గతంలో ఆదేశించింది. లిస్టెడ్ కంపెనీలు కార్పొరేట్ పాలనను మరింత పటిష్టంగా అమలు చేసే లక్ష్యంతో సెబీ తాజా నిబంధనలకు తెరతీసిన విషయం విదితమే.

ఈ కామర్స్ ఎలిఫెంట్ ఫ్లిప్‌కార్ట్

- 48 శాతం మార్కెట్ వాటా
- వేగంగా విస్తరిస్తున్న మీషో
- అలియన్స్ బెర్న్‌స్టీన్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: దేశ ఈ కామర్స్ మార్కెట్లో ఫ్లిప్‌కార్ట్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. 48 శాతం మార్కెట్ వాటాతో వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్ మొదటి స్థానంలో ఉన్నట్లు అలియన్స్ బెర్న్‌స్టీన్ తాజా నివేదిక వెల్లడించింది. అదే సమయంలో జపాన్ సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు కలిగిన మీషో వేగంగా చొచ్చుకుపోతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఫ్లిప్‌కార్ట్ 21 శాతం మేర యూజర్లను పెంచుకోగా, మీషో 32 శాతం కొత్త యూజర్లను జోడించుకుంది. అదే సమయంలో అమెజాన్ యూజర్ల వృద్ధి 13 శాతానికే పరిమితమైంది. '2022–23 సంవత్సరంలో భారత ఈ–కామర్స్‌లో 48 శాతం వాటాతో ఫ్లిప్‌కార్ట్ మార్కెట్ లీడర్‌గా ఉంది. పరిశ్రమ కంటే వేగంగా ఫ్లిప్‌కార్ట్ వృద్ధి చెందుతోంది. మొబైల్స్, వస్త్రాలు ఫ్లిప్‌కార్ట్‌కు రెండు పెద్ద విభాగాలుగా ఉన్నాయి. మొబైల్స్‌లో 50 శాతం, వస్త్రాల్లో 30 శాతం వాటా కలిగి ఉంది. ఆన్‌లైన్ స్మార్ట్ ఫోన్లలో 48 శాతం, ఆన్‌లైన్ ఫ్యాషన్ విభాగంలో 60 శాతం చొప్పున మార్కెట్ వాటా ఫ్లిప్‌కార్ట్ కలిగి ఉంటుందని అంచనా' అని ఈ నివేదిక తెలిపింది.

చిన్న పట్టణాలపై మీషో గురి

జీరో కమీషన్ నమూనాలో ద్వితీయ శ్రేణి, చిన్న పట్టణాలపై మీషో వ్యూహాత్మకంగా దృష్టి సారించడం ద్వారా మార్కెట్ వాటాను వేగంగా పెంచుకుంటున్నట్టు బెర్న్‌స్టీన్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో ఈ కామర్స్ యాప్ డౌన్‌లోడ్‌లలో 48 శాతం మేర మీషోనే ఉంటున్నట్టు పేర్కొంది. 'గడిచిన 12 నెలల్లో మీషో ఆర్డర్ల పరిమాణం 43 శాతం మేర పెరిగింది. ఆదాయంలో 54 శాతం వృద్ధి నెలకొంది. మళ్లీ, మళ్లీ కొనుగోలు చేసే కస్టమర్లు 80 శాతంగా ఉన్నారు. మీషోలో 80 శాతం విక్రేతలు రిటైల్ వ్యాపారవేత్తలు కాగా, ప్లాట్‌ఫామ్‌పై 95 శాతం కొనుగోళ్లు అన్‌బ్రాండెడ్‌వే ఉంటున్నాయి. నెలవారీ 12 కోట్ల సగటు యూజర్లతో మీషో భారత్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఈ–కామర్స్ కంపెనీ. ప్రస్తుతం మీషో స్థూల వాణిజ్య విలువ (జీఎంవీ) 5 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ' అని ఈ నివేదిక వెల్లడించింది.

ఫ్యాషన్‌లో మింత్రా టాప్...

ఫ్యాషన్ ఈ–కామర్స్‌లో రిలయన్స్‌కు చెందిన అజియో 30 శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నట్టు బెర్న్‌స్టీన్ నివేదిక తెలిపింది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సంస్థ మింత్రా ఈ విభాగంలో 50% మార్కెట్ వాటాతో మొదటి స్థానంలో ఉంది. 2023 డిసెంబర్‌లో పోటీ సంస్థల కంటే మింత్రాయే మెరుగ్గా 25 శాతం మేర వృద్ధిని నమోదు చేసింది. ఈ–గ్రోసరీలో బ్లింకిట్ చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. ఉత్పత్తుల శ్రేణి, కస్టమర్లకు చేరువ విషయంలో జెప్టో బ్లింకిట్‌తో పోలిస్తే వెనుకనే ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. బ్లింకిట్ 40 శాతం వాటాతో మొదటి స్థానంలో ఉంటే, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 37–39% వాటా, జెప్టో 20% వాటాతో తర్వాతి రెండు స్థానాల్లో ఉన్నాయి.

సాక్షి స్పోర్ట్స్



ఫైనల్లో భారత మహిళల హాకీ జట్టు

మహిళల హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. మస్కట్‌లో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి రజని కెప్టెన్సీలోని భారత జట్టు 6–3తో దక్షిణాఫ్రికాపై నెగ్గింది. ఫైనల్లో నెదర్లాండ్స్‌తో భారత్ ఆడుతుంది. సెమీఫైనల్లో భారత్ తరఫున అక్షత, మరియానా, ముంతాజ్, రుతుజా, జ్యోతి అజ్మీనా ఒక్కో గోల్ చేశారు. ఈ టోర్నీలో తెలంగాణకు చెందిన యెండల సౌందర్య భారత జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తోంది.

క్వార్టర్ ఫైనల్లో కిరణ్ జార్జి పరాజయం

ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్ కిరణ్ జార్జి పోరాటం ముగిసింది. జకార్తాలో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 36వ ర్యాంకర్ కిరణ్ జార్జి 14–21, 6–21తో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు.



మొదటి టెస్టు మన చేతుల్లోకి...

- భారత్ ప్రస్తుత ఆధిక్యం 175 పరుగులు
- తొలి ఇన్నింగ్స్‌లో 421/7
- కేఎల్ రాహుల్, జడేజా అర్ధ సెంచరీలు
- రాణించిన కేఎస్ భరత్, అక్షర్ పటేల్

భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు ఊహించిన దిశలోనే సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే ఇంగ్లండ్‌ను కట్టడి చేసిన టీమిండియా రెండో రోజు తమ బ్యాటింగ్ సత్తా చూపించింది. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా చక్కటి అర్ధసెంచరీలకు తోడు శ్రేయస్ అయ్యర్, కేఎస్ భరత్, అక్షర్ పటేల్ సమయోచిత సహకారం జట్టును భారీ ఆధిక్యంలో నిలిపాయి. శుక్రవారం 3.47 రన్‌రేట్‌తో 87 ఓవర్లలోనే 302 పరుగులు సాధించిన టీమిండియాకు టెస్టుపై పట్టు చిక్కింది. పేలవ బౌలింగ్‌తో భారత్‌ను నిలువరించడంలో విఫలమైన ఇంగ్లండ్ ఇప్పటికే దాదాపుగా చేతులెత్తేసింది. రెండో రోజు ఒక రనౌట్‌ను మినహాయిస్తే ఆ జట్టు ఐదు వికెట్లే తీయగలిగింది. మరో మూడు వికెట్లతో భారత్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉండగా... ఇంగ్లండ్ ఎంతవరకు పోరాడుతుందనేది చూడాలి.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి అండ్ బి) రూట్ 80; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (సి) డకెట్ (బి) హార్ట్లీ 23; రాహుల్ (సి) రేహాన్ (బి) హార్ట్లీ 86; శ్రేయస్ (సి) హార్ట్లీ (బి) రేహాన్ 35; జడేజా (బ్యాటింగ్) 81; భరత్ (ఎల్బీ) (బి) రూట్ 41; అశ్విన్ (రనౌట్) 1; అక్షర్ పటేల్ (బ్యాటింగ్) 35; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (110 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి) 421. **వికెట్ల పతనం:** 1–80, 2–123, 3–159, 4–223, 5–288, 6–356, 7–358. **బౌలింగ్:** వుడ్ 13–0–43–0, హార్ట్లీ 25–0–131–2, లీచ్ 25–6–54–1, రేహాన్ 23–3–105–1, రూట్ 24–2–77–2.


జడేజా


రాహుల్


భరత్

సాక్షి, హైదరాబాద్: బ్యాటింగ్ బలంతో భారత జట్టు ఇంగ్లండ్‌పై తొలి టెస్టులో ఆధిపత్యాన్ని కొనసాగించింది. మ్యాచ్ రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 110 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 421 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (123 బంతుల్లో 86; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (155 బంతుల్లో 81 బ్యాటింగ్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించగా... కోన శ్రీకర్ భరత్ (81 బంతుల్లో 41; 3 ఫోర్లు), అక్షర్ పటేల్ (62 బంతుల్లో 35 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (63 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఇప్పటికే భారత్ 175 పరుగుల ఆధిక్యంలో ఉండగా... క్రీజ్‌లో ఉన్న జడేజా, అక్షర్ ఎనిమిదో వికెట్‌కు అభేద్యంగా 63 పరుగులు జోడించారు. ఈ ఇన్నింగ్స్‌లో భారత్ ఐదు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు నమోదు చేయగా... మూడింటిలో జడేజా ఉన్నాడు. భారత్ టాప్–5 బ్యాటర్లంతా దూకుడుగా ఆడబోయి అటాకింగ్ షాట్లకే వెనుదిరగడం విశేషం.

సమష్టి బ్యాటింగ్‌తో...

ఓవర్‌నైట్ స్కోరు 119/1తో ఆట కొనసాగించిన భారత్ తొలి ఓవర్లోనే యశస్వి జైస్వాల్ (74 బంతుల్లో 80; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) వికెట్ కోల్పోయింది. ఉన్నంత సేపు ఇబ్బందిగానే కనిపించిన శుబ్‌మన్ గిల్ (66 బంతుల్లో 23; 2 ఫోర్లు) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. అయితే రాహుల్, శ్రేయస్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. శ్రేయస్ భారీ స్కోరు చేయడంలో విఫలం కాగా... 72 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. వుడ్ ఓవర్లో అతను కొట్టిన మూడు ఫోర్లు హైలైట్‌గా నిలిచాయి. రేహాన్ ఓవర్లో రాహుల్ రెండు సిక్సర్లు బాదడంతో భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. అయితే అతను సెంచరీ చాన్స్‌ను పోగొట్టుకున్నాడు. రాహుల్ పెవిలియన్‌కు చేరిన సమయంలో భారత్ 42 పరుగుల ఆధిక్యంలో మాత్రమే ఉంది. దాంతో చివరి వికెట్లు తీయగలమని ఇంగ్లండ్‌కు ఆశ కలిగింది. కానీ జడేజా వాటిని వమ్ము చేశాడు. ముందుగా భరత్‌తో, ఆ తర్వాత అక్షర్ పటేల్‌తో అతను రెండు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. కొన్ని చక్కటి షాట్లు ఆడిన ఆంధ్ర ఆటగాడు భరత్ పెద్ద స్కోరు సాధించే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. 84 బంతుల్లో జడేజా అర్ధసెంచరీ చేశాడు. జడేజాతో సమన్వయలోపంతో అశ్విన్ (1) రనౌట్ కావడం ఒక్కటే కాస్త నిరాశపర్చింది. తన బ్యాటింగ్ ప్రతిభను ప్రదర్శిస్తూ అక్షర్ కూడా చెలరేగడంతో ఇంగ్లండ్ బౌలర్లు బేలగా చూస్తుండిపోయారు. హార్ట్లీ వేసిన చివరి ఓవర్లో అక్షర్ వరుసగా 4, 6, 4 బాది రోజును ముగించాడు.

తన్మయ్ తడాఖా

160 బంతుల్లో 33 ఫోర్లు, 21 సిక్స్‌లతో 323 నాటౌట్
- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ ట్రిపుల్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా తన్మయ్ రికార్డు
- హైదరాబాద్ 48 ఓవర్లలో 529/1
- అరుణాచల్‌ప్రదేశ్‌తో రంజీ ట్రోఫీ మ్యాచ్


తన్మయ్



రాహుల్

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ క్రికెట్‌లో అనామక అరుణాచల్ ప్రదేశ్ బౌలర్లపై హైదరాబాద్ ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (160 బంతుల్లో 323 బ్యాటింగ్, 33 ఫోర్లు, 21 సిక్స్‌లు), కెప్టెన్ రాహుల్ సింగ్ గహ్లోత్ (105 బంతుల్లో 185; 26 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్‌లో భాగంగా సొంతగడ్డపై జరుగుతున్న నాలుగు రోజుల లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలిరోజు 'సూపర్‌ఫాస్ట్' ప్రదర్శన కనబరిచింది. ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 48 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 529 పరుగులు సాధించింది. ప్రస్తుతం హైదరాబాద్ 357 పరుగుల ఆధిక్యంలో ఉంది. ముందుగా అరుణాచల్ ఇన్నింగ్స్‌ను కూల్చడం మొదలు, హైదరాబాద్ బ్యాటింగ్ అంతా మెరుపు వేగంతో సాగిపోయింది. తూంకుంటలోని నెక్స్‌జెన్ క్రికెట్ అకాడమీ గ్రౌండ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 39.4 ఓవర్లలో 172 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ తెచీ డోరియా (127 బంతుల్లో 97 నాటౌట్; 12 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. హైదరాబాద్ బౌలర్లు సీవీ మిలింద్ (3/36), కార్తికేయ (3/28), తనయ్ త్యాగరాజన్ (2/53) అరుణాచల్ జట్టును కట్టడి చేశారు.

తొలి వికెట్‌కు 449 పరుగుల భాగస్వామ్యం

అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ ఓపెనర్లు తన్మయ్, రాహుల్ అరుణాచల్ బౌలర్లపై విధ్వంసరచన చేశారు. ఇద్దరూ చెలరేగిన తీరుతో ప్రతీ ఓవర్ హైలైట్స్‌ను తలపించింది. తన్మయ్‌తో రాహుల్ తొలి వికెట్‌కు 40.2 ఓవర్లలో 449 పరుగుల భాగస్వామ్యం జోడించాక అవుటయ్యాడు. రాహుల్ అవుటయ్యాక కూడా తన్మయ్ తన జోరు కొనసాగించాడు. ఈ క్రమంలో రంజీ ట్రోఫీలో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ చేసిన భారత క్రికెటర్‌గా తన్మయ్ నిలిచాడు. తన్మయ్ 119 బంతుల్లో డబుల్ సెంచరీ చేయగా... 1985లో బరోడా జట్టుపై రవిశాస్త్రి (ముంబై) 123 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించాడు. డబుల్ సెంచరీ పూర్తయ్యాక కూడా తన్మయ్ విధ్వంసం కొనసాగింది. ఈ క్రమంలో తన్మయ్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ 'ట్రిపుల్ సెంచరీ' సాధించిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. తన్మయ్ 147 బంతుల్లో 'ట్రిపుల్ సెంచరీ' సాధించి ... 2017లో దక్షిణాఫ్రికా దేశవాళీ క్రికెట్‌లో 191 బంతుల్లో 'ట్రిపుల్ సెంచరీ' చేసిన మార్కో మరైస్ రికార్డును బద్దలు కొట్టాడు. అంతేకాకుండా రంజీ ట్రోఫీ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటికి తన్మయ్ 21 సిక్స్‌లు కొట్టగా... జార్ఖండ్ ప్లేయర్ ఇషాన్ కిషన్ (2016లో ఢిల్లీపై 14 సిక్స్‌లు), హిమాచల్‌ప్రదేశ్ ఆటగాడు శక్తి సింగ్ (1990లో హరియాణాపై 14 సిక్స్‌లు) పేరిట ఉన్న రికార్డు తెరమరుగైంది.

విహారి, భుయ్ సెంచరీలు




రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు కోలుకుంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 277 పరుగులు సాధించింది. 41 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఆంధ్ర జట్టును హనుమ విహారి (119 బ్యాటింగ్; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ రికీ భుయ్ (120; 14 ఫోర్లు) సెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 231 పరుగులు జోడించారు. విహారి, కరణ్ షిండే (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

జొకోవిచ్‌కు సినెర్ షాక్

- సెమీస్‌లో ఓడిన డిఫెండింగ్ చాంప్
- జ్వెరెవ్‌పై గెలుపుతో ఫైనల్లో మెద్వెదెవ్


జొకోవిచ్


సినెర్

మెల్‌బోర్న్: ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో కొత్త చాంపియన్ అవతరించడం ఖాయమైంది. డిఫెండింగ్ చాంపియన్, 10 సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సెర్బియా దిగ్గజం జొకోవిచ్ ఈసారి సెమీఫైనల్ అడ్డంకిని దాటలేకపోయాడు. ప్రపంచ నాలుగో ర్యాంకర్, ఇటలీకి చెందిన 22 ఏళ్ల యానిక్ సినెర్ ధాటికి జొకోవిచ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో సినెర్ 3 గంటల 22 నిమిషాల్లో 6–1, 6–2, 6–7 (6/8), 6–4తో జొకోవిచ్‌ను బోల్తా కొట్టించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. జొకోవిచ్‌తో జరిగిన మ్యాచ్‌లో పక్కా ప్రణాళికతో ఆడిన సినెర్ తొమ్మిది ఏస్‌లు సంధించి, 31 విన్నర్స్ కొట్టాడు. జొకోవిచ్ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన సినెర్ తన సర్వీస్‌లో ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ అవకాశమే ఇవ్వలేదు. మరోవైపు జొకోవిచ్ 54 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. ఆదివారం జరిగే ఫైనల్లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా)తో సినెర్ తలపడతాడు. రెండో సెమీఫైనల్లో మెద్వెదెవ్ 4 గంటల 18 నిమిషాల్లో 5–7, 3–6, 7–6 (7/4), 7–6 (7/5), 6–3తో ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ)పై అద్భుత విజయం సాధించి ఈ టోర్నీలో మూడోసారి, ఓవరాల్‌గా ఆరోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకున్నాడు.

'గగన్‌యాన్'కు రెడీ

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ ఏడాదిని గగన్‌యాన్ ప్రాజెక్టు సంవత్సరంగా పరిగణిస్తోందని, మరిన్ని ప్రయోగాలు చేపట్టనున్నామని సతీశ్‌ధవన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలిపారు. శుక్రవారం షార్‌లో 75వ గణతంత్ర దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025 నాటికి మానవ సహిత ప్రయోగాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చంద్రయాన్–3, ఆదిత్య ఎల్–1 ప్రయోగాలతో 2023 ఇస్రో చరిత్రలో గుర్తుండిపోతుందన్నారు. ఈ ప్రయోగాలకు సంబంధించి ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్‌కు మ్యాన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు రావడం ఇస్రోకు గిఫ్ట్ అని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో చంద్రయాన్–3 ఉపగ్రహాన్ని పంపిన ఎల్‌వీఎం మార్క్–3 రాకెట్, ల్యాండర్, రోవర్‌ను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కొత్త ఏడాదికి కానుకగా పీఎస్‌ఎల్‌వీ సీ58 ప్రయోగం నిర్వహించామని తెలిపారు. ఫిబ్రవరి రెండోవారంలో ఇన్‌శాట్–3 డీఎస్ ప్రయోగం నిర్వహించనున్నామని, ఈ ఏడాది మరో పది ప్రయోగాలకు సిద్ధమవుతున్నామని చెప్పారు. విద్యార్థులంతా స్పేస్ సైన్స్‌పై అవగాహన పెంచుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. దేశంలో సామాన్యులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, సైన్యానికి విలువైన సమాచారాన్ని అందజేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఇస్రో ఈ ఏడాది నుంచి వాణిజ్యపరంగానే కాకుండా ప్రైవేట్ స్పేస్ సంస్థలకు చెందిన ప్రయోగాలూ చేపడుతుందని రాజరాజన్ వెల్లడించారు.

మనమంతా దేశాభివృద్ధికి పునరంకితం అవుదాం

పద్మ అవార్డులు పొందిన వారికి శుభాకాంక్షలు: కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: దేశ ప్రజలంతా ఏకమై ఒక సుస్థిరమైన ప్రభుత్వాన్ని మరోసారి దేశానికి ఇవ్వాల్సి ఉందని, మనమంతా మరోసారి దేశాభివృద్ధికి పునరంకితం అవుదామని కేంద్ర పర్యాటక శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన కిషన్‌రెడ్డి.. అనంతరం సీఆర్‌పీఎఫ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పద్మ అవార్డులు పొందిన వారందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవిలకు దేశంలోని రెండో అత్యుత్తమ పౌర పురస్కారం పద్మ విభూషణ్ దక్కడం పట్ల కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.

విచారణకు వెళ్లి బాలికతో అసభ్య ప్రవర్తన

కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

ఖలీల్‌వాడి (నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న కానిస్టేబుల్ మహేశ్‌పై పోక్సో కేసు నమోదైంది. కానిస్టేబుల్ మహేశ్ ఓ కేసు విషయమై నిందితుడికి సమన్లు అందించడానికి ఆదివారం నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండారం గ్రామానికి వెళ్లాడు. ఇంట్లో నిందితుడు లేకపోవడంతో పక్కింట్లో ఉన్న బాలికతో మాట్లాడి నిందితుడి వివరాలను తెలుసుకున్నాడు. ఈ క్రమంలో బాలికతో మహేశ్ అసభ్యంగా ప్రవర్తించాడు. తల్లిదండ్రులు రాత్రి ఇంటికి వచ్చాక బాలిక వారికి విషయం చెప్పింది. దీంతో వారు సోమవారం ఉదయం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ వ్యవహారాన్ని ఎస్సై మహేశ్ నిజామాబాద్ సౌత్ సీఐ వెంకటనారాయణకు వివరించారు. ఆయన సీపీ కల్మేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. సీపీ ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం మహేశ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మహేశ్ గతంలో ఓ కేసు విషయంలో సస్పెండ్ అయ్యారు. సస్పెన్షన్ ఎత్తేశాక మళ్లీ అదే స్టేషన్‌లో విధుల్లో కొనసాగుతున్నారు. పోక్సో కింద కేసు నమోదు కావడంతో సదరు కానిస్టేబుల్ పరారీలో ఉన్నాడు.

అరుదు...



పులి అనగానే లేత, ముదురు పసుపుపచ్చ రంగులో, నల్లటి చారలతో గంభీరంగా ఉన్న రూపం గుర్తుకువస్తుంది. కొన్నిచోట్ల తెల్ల పులులు కూడా ఉంటాయి. కానీ బంగారు వర్ణంలో ఉండే పెద్దపులిని చూశారా? అలాంటి చాలా అరుదైన ఓ 'బంగారు' పులి ఇటీవల అస్సాంలోని కజిరంగా అభయారణ్యంలో కనిపించింది. గౌరవ్ రామ్ నారాయణ్ అనే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ దీనిని చిత్రీకరించాడు. ఈ 'బంగారు' పులులు ప్రఖ్యాత రాయల్ బెంగాల్ టైగర్ జాతికి చెందినవే. జన్యు ఉత్పరివర్తనం వల్ల వీటి శరీరంపై నలుపు రంగు కాకుండా.. నారింజ/ముదురు గోధుమ రంగు చారలు ఏర్పడుతాయి. మిగతా భాగం బంగారు వర్ణంలో మెరుస్తుంటుంది.

ఆకర్షణ



75వ గణతంత్ర వేడుకల్లో తెలంగాణ అమర వీరుల ఉద్యమస్ఫూర్తి వెల్లివిరిసింది. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో శుక్రవారం నిర్వహించిన పరేడ్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమరవీరులను స్మరిస్తూ రూపొందించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శకటానికి 'జయ జయహే తెలంగాణ'గా నామకరణం చేశారు. మరోవైపు 75వ గణతంత్ర దినోత్సవాలు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగాయి. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో తెలంగాణ భవన్ ఓఎస్డీ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.
-సాక్షి, న్యూఢిల్లీ

ఆచారం..



ఖందేవ్ జాతరలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని ఖందేవ్ ఆలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. తొడసం వంశస్థులు కొత్త కోడళ్లతో ప్రత్యేక భేటీ నిర్వహించారు. అనంతరం ఆ వంశస్థులు తయారు చేసిన నువ్వుల నూనెను కటోడాలు దేవుడికి నైవేద్యంగా సమర్పించారు. ఆచారం ప్రకారం అక్కడే ఆ వంశానికి చెందిన ఆడపడుచు మహారాష్ట్రలోని జివతి తాలూకా కొద్దేపూర్ గ్రామానికి చెందిన మెస్రం నాగుబాయి చందు రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగి మొక్కు తీర్చుకుంది.
-నార్నూర్

గురుకులంలో 317 చిక్కులు

నూతన జోనల్ విధానం అమలుకు ఆటంకాలు

- జీఓ 317 ప్రకారం కేటాయింపులు జరిపినా కదలని ఉద్యోగులు
- ఏడాదిన్నరగా పాత స్థానాల్లోనే పనిచేస్తున్న ఉద్యోగులు
- దీంతో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ఆటంకాలు
- న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఎక్కడి ఉద్యోగులు అక్కడే

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో నూతన జోనల్ విధానం ప్రకారం ఉద్యోగుల కేటాయింపుల ప్రక్రియ గందరగోళంగా మారింది. దాదాపు ఏడాదిన్నర క్రితమే కేటగిరీల వారీగా ఉద్యోగుల స్థానికత ఆధారంగా జోన్లు, మల్టీజోన్లు కేటాయించినప్పటికీ వారంతా ఇంకా పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలోనే నూతన కేటాయింపులు జరిపినప్పటికీ... విద్యా సంవత్సరం మధ్యలో మార్పులు జరిపితే బోధన, అభ్యసనలకు ఇబ్బందులు కలుగుతాయనే ఉద్దేశంతో కాస్త గడువు ఇచ్చింది. కేటాయింపులు పూర్తయినప్పటికీ స్థానచలనం కలిగిన ఉద్యోగులు 2023–24 విద్యా సంవత్సరం మొదటి రోజు నుంచి నూతన పోస్టింగ్‌లలో చేరాలని స్పష్టం చేసింది. అయితే నూతన కేటాయింపులపై వివిధ వర్గాల ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఎక్కడి ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది. మొత్తంగా, రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన నూతన జోనల్ విధానానికి అనుగుణంగా అన్ని ప్రభుత్వ శాఖలు అమలు పూర్తి చేయగా... సంక్షేమ గురుకులాల్లో మాత్రం ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు.

అన్నింటికీ అడ్డంకులే

సంక్షేమ గురుకుల సొసైటీల పరిధిలో వెయ్యికి పైబడి విద్యా సంస్థలున్నాయి. రాష్ట్రంలో ఐదు గురుకుల సొసైటీలు ఉండగా... సంక్షేమ శాఖల పరిధిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్‌ఈఐఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీడబ్ల్యూ ఆర్‌ఈఐఎస్)లు కొనసాగుతున్నాయి. తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఆర్‌ఈఐఎస్) మాత్రం విద్యాశాఖ పరిధిలో ఉంది. రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యా సంస్థల్లో ప్రస్తుతం 35వేల మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. మరో 12వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే గురుకుల సొసైటీ ఉద్యోగుల సంఖ్య భారీగా పెరగనుంది. కొత్తగా గురుకుల విద్యా సంస్థల్లో నియామకాలు జరగాలన్నా.... ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నా నూతన జోనల్ విధానం ప్రకారం ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియ పూర్తి కావాల్సిందే. నూతన జోనల్ విధానానికి అనుగుణంగా ఉద్యోగుల కేటాయింపులు పూర్తయితేనే ఏయే జోన్లు, ఏయే మల్టీ జోన్లు, ఏయే జిల్లాల్లో ఉద్యోగ ఖాళీలు, పనిచేస్తున్న ఉద్యోగులు, సీనియార్టీ తదితరాలు స్పష్టంగా తెలుస్తాయి. ఆ జాబితాకు అనుగుణంగా బదిలీలు, పదోన్నతులు, కొత్తగా నియామకాలు పూర్తి చేస్తారు. కానీ గురుకులాల్లో ఉద్యోగుల కేటాయింపులు పూర్తికాకపోవడంతో గందరగోళంగా మారింది.



బదిలీలకు ఐదేళ్లు పూర్తి...

గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగుల బదిలీలు చేపట్టి ఐదేళ్లు పూర్తయింది. 2018–19 విద్యా సంవత్సరం ప్రారంభంలో రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు మళ్లీ బదిలీలు జరగలేదు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లోని వివిధ కేటగిరీల్లో కొత్తగా పోస్టులు మంజూరు కావడం, ప్రమోషన్ పోస్టులు సైతం పెద్ద మొత్తంలో ఉండటంతో పదోన్నతుల ప్రక్రియ సైతం చేపట్టాల్సి ఉంది. ఇవికాకుండా గురుకులాల్లో 12వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు సంబంధించిన అర్హత పరీక్షలు పూర్తయ్యాయి. అతి త్వరలో మెరిట్ జాబితా... అర్హుల గుర్తింపు పూర్తయితే వారికి పోస్టింగ్‌లు ఇవ్వాలి. ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో స్పష్టత వస్తే తప్ప నియామక ఉత్తర్వులు ఇచ్చే వీలు లేదు. కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి సాధారణంగా మూడు, నాలుగు కేటగిరీల్లోని ప్రాంతాల్లోనే నియమిస్తారు. ప్రస్తుతం ఉద్యోగుల కేటాయింపులు పూర్తయితే తప్ప ఖాళీలపై స్పష్టత రాదని అధికారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

కలిసి మురిసిన పద్మాలు!

వెంకయ్యను కలిసిన చిరంజీవి



సాక్షి, హైదరాబాద్: పద్మవిభూషణ్ పురస్కార గ్రహీతలు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవి శుక్రవారం సాయంత్రం కలుసుకున్నారు. పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. ''జై ఆంధ్ర ఉద్యమం జరుగుతున్న సమయంలో నేను కాలేజీలో చదువుతున్నా. ఆ సమయంలో వెంకయ్యనాయుడు విద్యార్థి ఉద్యమనేత. ఆయన ఇచ్చిన పిలుపు మేరకు మేము కాలేజీలు బహిష్కరించి ఉద్యమంలో పాల్గొన్నాం. నాకు ఆయన ఆ రోజు నుంచి తెలుసు'' అని చిరంజీవి తన కాలేజీ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వెంకయ్యనాయుడు స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి అని, ఆయనతో పాటుగా తనకు కూడా పద్మవిభూషణ్ రావటంతో తన ఆనందం ద్విగుణీకృతమయిందన్నారు. వెంకయ్య నాయుడు స్పందిస్తూ తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లయితే చిరంజీవి మూడో కన్ను అని అభివర్ణించారు. ''ఈ అవార్డు రావటానికి అన్ని అర్హతలు మీకు ఉన్నాయి. సరైన సమయంలో ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుంది సో ప్రౌడ్ ఆఫ్ యూ అని మెగాస్టార్‌ను ప్రశంసించి సత్కరించారు.

చిరంజీవికి కోమటిరెడ్డి శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన నటుడు చిరంజీవిని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'పునాదిరాళ్లు' చిత్రం నుంచి ప్రారంభమైన చిరంజీవి ప్రస్థానం రేపటి 'విశ్వంభర' దాకా విజయవంతంగా సాగుతుందని ఆకాంక్షించారు. రక్తదానం, నేత్రదానం ద్వారా కోట్లాది మంది గుండెల్లో చిరంజీవిగా చిరస్థాయిగా నిలిచిపోయారని కోమటిరెడ్డి అభినందించారు.

తన ఇంటినే కూల్చేందుకు కేవీఆర్ రెడీ

రోడ్డు విస్తరణలో భాగంగా ఇల్లు ఖాళీ చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే



సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల సమయంలో సొంత మేనిఫెస్టో ప్రకటించడంతోపాటు, ఇద్దరు ఉద్దండులను ఓడించి చరిత్ర సృష్టించిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్) మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. రోడ్డు విస్తరణ కోసం ముందుగా తన ఇంటిని కూల్చేందుకు ముందుకొచ్చారు. కామారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ రోడ్డు వరకు విస్తరణకు ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. ఇదే రోడ్డులో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇల్లుతోపాటు మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఇల్లు కూడా ఉంది. ట్రాఫిక్ పెరగడంతోపాటు, పలుచోట్ల ఆక్రమణలతో ఈ రోడ్డు ఇరుకుగా మారింది. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణ కోసం స్వచ్ఛందంగా తన ఇంటిని కూల్చేందుకు ఎమ్మెల్యే కేవీఆర్ సిద్ధమయ్యారు. శనివారం ఇంటి కూల్చివేత పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. తన ఇంటితోనే రోడ్డు వెడల్పు పనులు జరిగేలా ప్రణాళిక రూపొందించిన ఆయన.. పదిరోజుల క్రితమే ఇంటిని ఖాళీ చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మారారు. వెయ్యి గజాలకుపైగా స్థలాన్ని మున్సిపల్ అధికారులు అప్పగించారు. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చేందుకు బల్దియా అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎమ్మెల్యే ఇంటిని కూల్చివేశాక రోడ్డు వెడల్పు పనులు ఏ మేరకు ముందుకు సాగుతాయో అన్న విషయమై పట్టణంలో చర్చ నడుస్తోంది.

భక్తరామదాసు విగ్రహం ఇదిగో!



కొత్త తెలంగాణ చరిత్ర బృందం ప్రకటన

- ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో లభ్యం
- రామదాసు పదోతరం వారసుల ఆధ్వర్యంలో ధ్యానమందిరానికి తరలింపు

నేలకొండపల్లి

శ్రీసీతారామచంద్రస్వామి భక్తుడు కంచర్ల గోపన్న (భక్త రామదాసు) విగ్రహం తొలిసారిగా వెలుగులోకి వచ్చింది. భద్రాచలం ఆలయ నిర్మాత రామదాసు ఎలా ఉండేవారు, ఆయన ఆహార్యం ఏమిటనేది ఇప్పటివరకు స్పష్టత లేదు. దీంతో కళాకారులు తమ ఊహల మేరకు విగ్రహాలు, చిత్రాలు రూపొందించారు. ఇదే కోవలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని కంచర్ల గోపన్న నివాసంలో కొనసాగుతున్న ధ్యాన మందిరంలోని కాంస్య విగ్రహం, ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఉన్న మరో విగ్రహాన్ని కళాకారులు తమ ఊహల మేరకు రూపొందించారు. ఈ క్రమంలో తాజాగా నేలకొండపల్లికి చెందిన పసుమర్తి శ్రీనివాస్ అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సందర్భంలో ఆవరణలోని రావి చెట్టు వద్ద ఉన్న ఓ విగ్రహాన్ని గుర్తించారు. దీంతో ఆయన కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్, కోకన్వీనర్ కట్టా శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఆ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం అది రామదాసు విగ్రహమేనని చెబుతూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద వెలుగుచూసిన ఆ విగ్రహాన్ని ఎస్సై బి.సతీశ్ చేతుల మీదుగా రామదాసు పదోతరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావుకు అప్పగించగా ధ్యానమందిరంలో ఏర్పాటు చేశారు. రామదాసు జయంతి ఉత్సవాల నాటికి ఈ విగ్రహం ప్రతిష్ఠాపనపై భద్రాచలం దేవస్థానం అధికారులు ప్రణాళిక రూపొందించాలని వారసులు కోరారు.

స్టేషన్‌కు ఎలా చేరింది?

నేలకొండపల్లిలో పాత సెంటర్‌గా పేరున్న రావి చెట్టు బజార్‌లో చాలా ఏళ్ల క్రితం పోలీస్‌స్టేషన్ ఉండేది. 1997లో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్‌కు పాత స్టేషన్ నుంచి ఫర్నిచర్, తాజాగా బయటపడిన విగ్రహాన్ని కూడా తీసుకొచ్చారు. ఈ క్రమంలో విగ్రహాన్ని స్టేషన్ ఆవరణలోని రావి చెట్టు తొర్రలో భద్రపర్చగా ఇన్నాళ్లూ ఎవరూ పట్టించుకోలేదు. అయితే, ఆ విగ్రహం పాత పోలీసుస్టేషన్‌కు ఎలా చేరింది? ఎవరు తీసుకొచ్చారనే అంశంపై ఎక్కడా రికార్డులు లేవని చెపుతున్నారు.

విగ్రహం ఎలా ఉందంటే..

కాసెపోసి కట్టిన ధోవతి, పైబట్ట లేకుండా అర్ధనగ్నంగా.. అంజలి ముద్రతో మొన కిందికి పెట్టిన కత్తి, మీసాలు, తల వెనక జారుముడి వేసుకున్న గోష్పాద శిఖతో విగ్రహం కనిపిస్తోంది. కుడి, ఎడమ భుజాలపై శంకుచక్రాలు ఉండడంతో వైష్ణవ భక్తునిగా తెలుస్తోంది. కాగా, ఈ విగ్రహం రాజోచిత ఆహార్యంతో లేనందున అక్కన్న, మాదన్నలది కాదని, వారి మేనల్లుడు భక్త రామదాసుదేనని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

మెట్లెక్కకుండానే.. బస్సెక్కొచ్చు!

ప్రయాణికులు బస్సులోపలికి చేరుకునేలా పైకెత్తే పరికరం

'పాస్కల్' సూత్రంతో ప్రొటోటైప్‌ను రూపొందించిన నల్లగొండ జిల్లా మాల్ విద్యార్థి

వృద్ధులు, గర్భిణులు, కీళ్లనొప్పులున్న వారికి ప్రయోజనకరం

సౌత్ ఇండియా స్థాయి సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక



చింతపల్లి (దేవరకొండ)

వృద్ధులైన అమ్మమ్మ, నానమ్మ బస్సు ఎక్కేందుకు పడుతున్న ఇబ్బందులను చూసిన ఓ తొమ్మిదో తరగతి విద్యార్థి.. మెట్లు ఎక్కకుండానే బస్సులోపలికి వెళ్లగలిగే ఓ పరికరాన్ని డిజైన్ చేశాడు. సైన్స్ పాఠాల్లోని పాస్కల్ సూత్రాన్ని ఆధారం చేసుకుని, థర్మాకోల్, సిరంజీలు, పైపులతో ప్రొటోటైప్‌ను సిద్ధం చేశాడు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం మాల్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన తోలు చంద్రయ్య, చిట్టెమ్మ దంపతుల కుమారుడు అజయ్ ఘనత ఇది. అక్కడి జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అజయ్.. ఫిజిక్స్ టీచర్ శ్రీవిద్య సహకారంతో 'పాస్కల్ డివైజ్ ప్రొటోటైప్'ను రూపొందించాడు. ఇందులో పాస్కల్ సూత్రం ఆధారంగా హైడ్రాలిక్ పద్ధతిలో పనిచేసే ఒక ప్లాట్‌ఫాం ఉంటుంది. బస్సు ఆగినప్పుడు డ్రైవర్ ఒక లీవర్ లాగితే.. ఆ ప్లాట్‌ఫాం డోర్ దగ్గర నేలపైకి వస్తుంది. దానిపైకి ప్రయాణికులు ఎక్కాక మరో లీవర్ లాగితే.. ఆ ప్లాట్‌ఫాం మెల్లగా పైకిలేచి బస్సులోపలికి వెళ్లేంత ఎత్తుకు చేరుతుంది. వారు నేరుగా బస్సులోపలికి వెళ్లొచ్చు. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెస్టివల్‌లో ఆకట్టుకున్న ఈ ఎగ్జిబిట్.. సౌత్ ఇండియా స్థాయి సైన్స్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు విజయవాడలో ఆ ప్రదర్శన జరగనుంది.



పెద్దవాళ్లు ఇబ్బంది పడటం చూసి..

''మా అమ్మమ్మ, నానమ్మ, పెద్దవాళ్లు, గర్భిణులు బస్సు ఎక్కే సమయంలో ఇబ్బందిపడటం చూశాను. వారు సులువుగా బస్సు ఎక్కేలా పరికరం తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. మా సైన్స్ టీచర్ సహకారంతో ఈ పరికరానికి రూపకల్పన చేశాను. వృద్ధులు, గర్భిణులు, వికలాంగులు, కీళ్లనొప్పులున్న వారికి ఇది ఎంతో ప్రయోజనకరం. బరువైన లగేజీలను బస్సులోకి తీసుకెళ్లడానికి కూడా ఉపయోగపడుతుంది..'' అని అజయ్ చెప్పాడు. ఇక పాస్కల్ డివైజ్‌తో ఎంతో ప్రయోజనం ఉంటుందని, దాతలు ముందుకొస్తే దాని ప్రొటోటైప్ ఆవిష్కరించేందుకు వీలవుతుందని టీచర్ శ్రీవిద్య తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.